

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 181

బుధవారం 21-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



208 పరుగులు సరిపోలేదు

తొలి టీ20లో భారత్ ఓటమి.. 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా విజయం - 12లో



రెండో రోజూ మార్కెట్ల జోరు

సెన్సెక్స్ 579 పాయింట్ల జంప్.. 59,720 వద్ద ముగింపు - 13లో



పట్టణ శ్రేయస్సు ముఖ్యం

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యవహరిస్తే పట్టణాభివృద్ధి జరగదని, పట్టణాల శ్రేయస్సు ముఖ్యమని ప్రధాని మోదీ సూచించారు.

వివరాలు 6లో



ఐక్యతకు ప్రాధాన్యం పెరిగింది

దేశాల మధ్య ఐక్యతతోనే సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజం సాకారమవుతుందని నటి ప్రియాంకా చోప్రా అన్నారు.

వివరాలు 6లో



కుర్మీల ఆందోళన

ఎస్టీ హోదా కల్పించాలని కుర్మీలు చేపట్టిన ఆందోళనలతో బెంగాల్, బిహార్‌లలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వివరాలు 6లో



మయన్మార్ ఆర్మీ కాల్పులు

తిరుగుబాటుదారులున్నారనే అనుమానంతో ఓ స్కూలుపై మయన్మార్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో 13 మంది చనిపోయారు.

వివరాలు 6లో

ఏది నిజం?

తప్పు బాబుదైనా.. నెట్టేస్తే సరి!

- పోలవరంపై పదేపదే గోబెల్స్ ప్రచారంతో రామోజీ ఎత్తుగడలు
- ప్రవాహాన్ని మళ్లించకుండా కాఫర్ డ్యామ్‌లు కట్టింది చంద్రబాబు కాదా?
- పైగా అలా కట్టకూడదని ఎవరు చెప్పారని 'ఈనాడు' బుకాయింపు
- సాక్షాత్తూ కేంద్ర జలసంఘం చెప్పిన దానికే చంద్రబాబు తూట్లు
- కమీషన్లు ఎక్కువ వచ్చే పనులకే మొదట టెంకాయ కొట్టిన నారా
- ఆ క్రమంలోనే రామోజీ వియ్యంకుడికి రూ.3,302 కోట్ల పనులు
- అది కూడా టెండర్లు లేకుండా నామినేషన్‌పై అప్పగింత
- దానికోసం నిబంధనల తొలగింపు.. లంప్సమ్ పద్ధతిపై మంజూరు
- సాగునీటి రంగ చరిత్రలో దీన్ని మించిన స్కామ్ లేదన్న నిపుణులు
- 2019 మే 30న సీఎంగా జగన్ ప్రమాణం; జూన్ 14కే వరదలు
- ఆ 14 రోజుల్లో కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేయకపోవటం వైఫల్యమా?
- ఒకవేళ వీటి గ్యాప్‌లు పూడ్చేసి ఉంటే కొట్టుకుపోయేవి కావా?

4లో

చదువుతోనే వెలుగు

మారుతున్న ప్రపంచంతో మన పిల్లలు పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నాం

'నాడు-నేడు'పై చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- విద్యా రంగంపై చేసే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి
- నాడు-నేడు కింద రూ.16 వేల కోట్లతో ప్రభుత్వ స్కూళ్లలో 12 రకాల మౌలిక సదుపాయాలు
- ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూములు
- స్కూళ్లు, టాయిలెట్ల నిర్వహణకు ప్రత్యేక ఫండ్.. 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు రూ.665 కోట్లతో 5.18 లక్షల ట్యాబ్‌లు
- పాఠశాల విద్య బలోపేతం ద్వారా డిగ్రీలో 70 శాతం చేరికల లక్ష్యం
- అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్దతో పేద పిల్లలు బడిబాట
- విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా ఉన్నత విద్యకు చేయూత
- కార్పొరేట్ స్కూళ్ల కోసం ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన బాబు
- కుప్పంలో కాదు కదా.. నారావారి పల్లెలో కూడా పట్టించుకోని దుస్థితి



సాక్షి, అమరావతి: ఉన్నత ప్రమాణాలు, అత్యుత్తమ బోధనతో కూడిన మంచి చదువులను పిల్లలకు అందించడం ద్వారానే రాష్ట్రంలోని పేదల ఇళ్లలో వెలుగులు నింపగలుగుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్యా రంగంపై చేసే ఖర్చు మానవ వనరులపై, భవిష్యత్తుపై పెట్టుబడేనని స్పష్టం చేశారు. విద్యా సంస్కరణలు, వేల కోట్ల రూపాయల నిధులతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తూ మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో

మిగతా 2వ పేజీలో ▶

> ప్రపంచం మారుతోంది. చదువులు మారుతున్నాయి. అందుకు తగ్గట్టుగా 2040 నాటికి చదువులు ఎలా ఉండాలి? వాటికి తగ్గట్టుగా పిల్లలను ఎలా తయారు చేసుకోవాలి? అనే ప్రణాళికను ప్రపంచం రచించుకుంటోంది. రాష్ట్రంలో మాత్రం 2019కి ముందు వరకూ 1950 నాటి విద్యా విధానం, దశాబ్దాలుగా పట్టించుకోని ప్రభుత్వ పాఠశాలలే కనిపించేవి. చదువుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అభిప్రాయపడే పరిస్థితి. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను సమూలంగా మార్చేశాం. తద్వారా ప్రభుత్వబడుల్లో (2018-19లో) ఉన్న 37,20,988 మంది పిల్లల సంఖ్య ఇప్పుడు 44,29,561కు పెరిగింది.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

23న కుప్పంలో సీఎం జగన్ పర్యటన

మూడో విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల చేయనున్న సీఎం

3లో



వైద్య రంగానికి చికిత్స

నాడు-నేడుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమూల మార్పులు

- శాసనసభలో సీఎం జగన్
- టీడీపీ ప్రభుత్వ హయాంలో దయనీయ స్థితి
- పూర్తిగా నీరుగారిన ఆరోగ్యశ్రీ.. రూ.680 కోట్ల బకాయిలు
- మనందరి ప్రభుత్వం రాగానే విప్లవాత్మక నిర్ణయాలతో ఊతం
- ఏటా రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ ఆరోగ్యశ్రీ వర్తింపు
- 1059 ప్రొసీజర్ల నుంచి 3,118కి పెంచే దిశగా అడుగులు
- రూ.16,255 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో గ్రామీణుల ముంగిటకు వైద్యం
- కొత్తగా 17 వైద్య కళాశాలల నిర్మాణం

> ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు తావివ్వకుండా గత మూడేళ్లలో చర్యలు చేపట్టాం. ఏకంగా 45 వేల పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టాం. ఇప్పటి వరకు 40,800 మందిని నియమించాం. మిగిలిన పోస్టుల భర్తీ కొనసాగుతోంది. అక్టోబర్ 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించాం. వైద్యం కోసం పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలు కాకూడదన్న నాన్న గారి లక్ష్యం దిశగా వేగంగా అడుగులు వేశాం.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కునారిల్లిన వైద్య ఆరోగ్య రంగానికి విప్లవాత్మక కార్యక్రమాలు, చర్యలతో చికిత్స చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా జబ్బు బారిన పడితే పేదలు అప్పులపాలు కాకుండా రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందించేలా సమూల మార్పులు చేశామని చెప్పారు. శాసనసభలో మంగళవారం

మిగతా 2వ పేజీలో ▶

ఎప్పుడూ జైలు చూడలేదు..

ఇప్పుడు రప్పించారు



- ఏం పీకావని కుప్పం వస్తున్నావు జగన్‌రెడ్డి?
- జైలుకు వెళ్లే టీడీపీ కార్యకర్తల్ని స్వాతంత్ర్య సమరయోధుల్లా ఊరేగిస్తాం
- నా వల్లే సెల్‌ఫోన్లు.. అవి ఎలా పనిచేస్తాయో నేనే రిపోర్టు ఇచ్చా..!
- చిత్తూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

3లో

30 లక్షల ఓట్లపై డేటా దొంగల గురి!

తొలగించేందుకు టీడీపీ ముఖ్య నేత కుతంత్రం

- స్టేట్ డేటా సెంటర్ కేంద్రంగా గత సర్కారు పన్నాగం
- టీడీపీ సేవామిత్ర యాప్ చేతికి వ్యతిరేకుల వివరాలు
- 18 సర్వర్ల నుంచి సమాచారం బదలాయింపు
- 4 సర్వర్ల నుంచే 24.3 టెరాబైట్ల సమాచారం చోరీ
- శాసనసభకు ఉపసంఘం మధ్యంతర నివేదిక
- తీవ్రంగా పరిగణన.. క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధం
- టీడీపీ హయాంలోని కీలక నేతలను విచారించే అవకాశం
- ఆర్టీజీఎస్, డేటా సెంటర్ ఉన్నతాధికారులను కూడా..
- నిఘా పరికరాల కొనుగోలుపై ఉపసంఘం మలిదశ విచారణ



సాక్షి, అమరావతి: కంచే చేను మేసింది! ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచి కస్టోడియన్‌గా వ్యవహరించాల్సిన వారే సున్నితమైన డేటాను ఆగంతకులు, సంస్థలకు చేరవేశారు. 2019 ఎన్నికల సందర్భంగా 30 లక్షల ఓట్లను తొలగించేందుకు టీడీపీ ప్రభుత్వ పెద్దలు పన్నిన పన్నాగం, అక్రమాల వ్యవహారం బట్టబయలైంది. స్టేట్ డేటా సెంటర్ కేంద్రంగా గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలకు సమాచారాన్ని చేరవేసినట్లు నిర్ధారణ అయింది. డేటా చౌర్యంపై విచారించేందుకు శాసనసభ నియమించిన సభాసంఘం విచారణలో చంద్రబాబు సర్కారు బరితెగింపు బట్టబయలైంది. టీడీపీ ప్రభుత్వంలో ముఖ్య నేతల పన్నాగంతోనే

మిగతా 2వ పేజీలో ▶

రీసర్వేలో అప్పీళ్ల పరిష్కార సమయం కుదింపు

- 30 రోజుల నుంచి 21 రోజులకు తగ్గింపు
- సర్వే, సరిహద్దుల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం
- 4 కీలక బిల్లుల్ని ఆమోదించిన శాసనసభ
- మరో 3 బిల్లులను సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం



10లో

ఇదండీ సంగతి



..ఏదో మీ ఆశయాలకు అనుగుణంగా కట్టించాన్సార్!



ఆర్బీకేల వద్ద వే బ్రిడ్జిలు

- ధాన్యం తూకాల్లో మోసాలకు అడ్డుకట్ట
- తొలిదశలో డిసెంబర్ కల్లా 93 సిద్ధం
- ఒక్కొక్కటి రూ.19.95 లక్షల అంచనా వ్యయం
- 60 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు
- సిబ్బందికి ప్రత్యేక గది, సీసీ కెమెరాలు

3లో

దసరాకు 4,485 స్పెషల్ బస్సులు



సాక్షి, అమరావతి: దసరా ఉత్సవాల్లో ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సదుపాయాల కోసం ఆర్టీసీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. ఈ ఏడాది రికార్డుస్థాయిలో 4,485 దసరా ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని నిర్ణయించింది. నవరాత్రుల సందర్భంగా దసరాకు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు 2,100 ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. దసరా అనంతరం తిరుగు ప్రయాణం కోసం 2,385 ప్రత్యేక బస్ సర్వీసులు నడపాలని నిర్ణయించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి అత్యధికంగా హైదరాబాద్‌కు 2,290 బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది.

సభా సమయం





ఆకట్టుకున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు–నేడు, గోరుముద్దతో సహా విద్యా రంగ కార్యక్రమాలపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆకట్టుకుంది. ప్రతిపక్ష నేత చంద్రబాబు సుదీర్ఘ కాలంగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని స్కూళ్లలో, ఆయన సొంత గ్రామం నారావారిపల్లెలోని స్కూళ్లలో నాటి స్థితిగతులు, నాడు–నేడు కార్యక్రమంతో ఇపుడు సర్వాంగ సుందరంగా మారిన స్థితిని ఫొటోలతో సహా ప్రదర్శిస్తూ వివరించారు.



చదువుతోనే వెలుగు

▶ మొదటి పేజీ తరువాయి

కార్పొరేట్ స్కూళ్ల మేలు కోసం ప్రభుత్వ స్కూళ్లను నీరుగార్చారని, చివరకు నాటి సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గంలోని స్కూళ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. అసెంబ్లీలో మంగళవారం విద్య, వైద్య రంగాల్లో నాడు–నేడు కార్యక్రమం అమలుపై జరిగిన చర్చలో ఆయన సమాధానమిచ్చారు. 'విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, వ్యయంపై రాజకీయ దురుద్దేశంతో చంద్రబాబుకు తోడుగా ఎల్లో మీడియా రకరకాలుగా మాట్లాడుతోంది. విద్యా రంగం, పిల్లల చదువుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి వంటిది. రాబోయే సమాజం మీద, మంచి పౌరులను తయారు చేసేందుకు పెట్టుబడి పెడుతున్నాం' అని వివరించారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

రైట్ టు ఇంగ్లిష్ మీడియం..

- స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా ఆర్థిక, సామాజిక కారణాల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమ పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివించలేకపోతున్నారు. ప్రపంచం అంతా ఇంగ్లిష్ మీడియం వైపు అడుగులు వేస్తుంటే.. ప్రభుత్వమే దగ్గరుండి అటు వైపు అడుగులు వేయించకుండా అడ్డుకోవడం చూశాం.
- వచ్చే తరం పిల్లలను నాణ్యమైన అభివృద్ధి వైపు అడుగులు వేయించేలా చదువుల్లో మార్పులు తీసుకువస్తేనే ప్రతి ఇంటా వెలుగులు నిండుతాయి. ప్రతి కుటుంబం పేదరికం నుంచి బయటకు వస్తుంది. ఆ లక్ష్యంతోనే ఇన్ని కార్యక్రమాలు చేపట్టాం. రైట్ టు ఎడ్యుకేషన్ కేవలం ఒక నినాదంగా కాకుండా రైట్ టు ఇంగ్లిష్.. రైట్ టు హయ్యర్ ఎడ్యుకేషన్‌గా పేదరికంలో ఉన్న పిల్లలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి, వారందరినీ గొప్పగా చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంది.

స్కూళ్ల రూపురేఖలు మార్చేస్తున్నాం..

- రాష్ట్ర వ్యాప్తంగా 45 వేలకు పైగా ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు, ప్రీ ప్రైమరీలు, ఫౌండేషన్ స్కూల్స్‌గా మారుతున్న అంగన్‌వాడీలు, హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నాం. ఈ కార్యక్రమం కింద 57 వేల స్కూళ్లు, హాస్టళ్ల రూపురేఖలు మారుతున్నాయి. ఇందుకోసం రూ.16 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.
- తొలి దశలో 15,715 పాఠశాలల్లో రూ.3,700 కోట్ల నిధులతో సమూలమైన మార్పులు తెచ్చాం. ఈ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసం స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు పెడుతున్నాం. నాడు–నేడు రెండో దశ కింద 22,344 పాఠశాలలను అభివృద్ధి చేయనున్నాం. వీటిలో రూ.8 వేల కోట్లతో సకల సదుపాయాలు కల్పించనున్నాం.
- అభివృద్ధి చేసిన ప్రతి పాఠశాలలో టాయిలెట్‌ల నిర్వహణ, స్కూల్ నిర్వహణ కోసం ఫండ్‌ను ఏర్పాటు చేశాం. ఈ తరహాలో ప్రత్యేకంగా నిధి ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి. ఇలా ఏటా రూ.448 కోట్లు టాయిలెట్ నిర్వహణ కోసం కేటాయిస్తున్నాం. టాయిలెట్‌లు, పాఠశాలల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 44,968 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 47 వేల మంది ఆయాలను రూ.6 వేల గౌరవ వేతనంతో నియమించి, నిర్వహణ కోసం అవసరమైన సదుపాయాలను కల్పించాం.
- స్కూళ్ల భవన నిర్వహణ కోసం ఈ ఏడాది నుంచి నిధిని ఏర్పాటు చేస్తున్నాం. చిన్న చిన్న రిపేర్లను పట్టించుకోకుంటే పాఠశాలలు అధ్వాన్నంగా మారుతాయని అమ్మ ఒడి లబ్ధిదారుల నుంచి సేకరించిన రూ.450 కోట్లు నిధికి జమ చేశాం. ఈ నిధి ద్వారా స్కూల్స్‌లో అప్పటికప్పుడు అవసరమైన రిపేర్లు, ఇతర పనులు చేస్తారు.
- ఉన్నత విద్యా రంగంలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల వల్ల కళాశాలల్లో గరిష్ట చేరికల నిష్పత్తి (జీఈఆర్) పెరిగేలా చేస్తున్నాం. ఉన్నత విద్యలో జీఈఆర్.. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్‌లో 55 శాతం, రష్యాలో 86 శాతం, చైనాలో 58 శాతం ఉండగా మన దేశంలో 29 శాతంగా ఉంది. రాష్ట్రంలో దీన్ని 2030 నాటికి 70 శాతానికి తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నాం.


కృష్ణాజిల్లా కంకిపాడు మండల పరిషత్ పాఠశాల నేడు. (ఇన్‌సెట్‌లో) నాడు

మనబడి నాడు–నేడుతో ప్రస్ఫుటమైన మార్పు

గత ప్రభుత్వ హయాంలో కునారిల్లిన ప్రభుత్వ విద్యా రంగాన్ని తీర్చిదిద్దుతూ చేపట్టిన మనబడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడుల్లో ఇప్పుడు ప్రస్ఫుటమైన మార్పు కనిపిస్తోంది. నాడు–నేడు ద్వారా ప్రతి ప్రభుత్వ బడిలో 12 రకాల మౌలిక సదుపాయాలు సమకూరాయి.

- ప్రతి పాఠశాలలో రన్నింగ్ వాటర్‌తో కూడిన మంచి టాయిలెట్. ➡ మంచి నీటి సరఫరా
- చిన్నా, పెద్ద రిపేర్లు ఏమైనా ఉంటే చేయించడం
- ప్రతి క్లాస్ రూమ్‌లో విద్యుదీకరణ, ట్యూబ్ లైట్, ఫ్యాన్‌లు అందుబాటులోకి తేవడం
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు మంచి ఫర్నిచర్ సమకూర్చడం
- ప్రతి క్లాస్ రూమ్‌లో గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు. ➡ స్కూల్ బిల్డింగ్‌కు మంచి రంగులు వేయించడం. ➡ ప్రతి స్కూల్‌లో ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు. ➡ ప్రహరీ నిర్మాణం
- ప్రతి స్కూల్‌లో మంచి కిచెన్ షెడ్ నిర్మాణం
- అవసరం మేరకు అదనపు తరగతి గదుల నిర్మాణం. ➡ నాడు–నేడు పూర్తయిన క్లాస్ రూమ్‌లను డిజిటలైజేషన్

ప్రభుత్వ బడుల్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు

- ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ లేకుండా చేయడం, పాఠ్య పుస్తకాలు నెలల తరబడి అందించకపోవడం గతంలో ఉండేది. మధ్యాహ్న భోజన పథకాన్ని నీరు గార్చారు. వీటన్నిటి ద్వారా అసలు ప్రభుత్వ బడులకు పిల్లలను పంపడమే వేస్ట్.. అనే ఆలోచనను తల్లిదండ్రుల్లో తీసుకొచ్చారు. ఇలాంటి చర్యల ద్వారా తమకు కావాల్సిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు మేలు చేశారు.
- ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లు లేక ఆడ పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని తెలిసినా నాడు పట్టించుకోలేదు. మంచి నీరు, కాంపౌండ్ వాల్స్, బల్లలు, చివరికి బ్లాక్ బోర్డు కూడా సరిగా లేని పరిస్థితులను తీసుకువచ్చి.. ప్రభుత్వ బడుల్లో ఏమీ ఉండదనేలా చేశారు.
- ఈ కారణాల వల్ల డ్రాపౌట్ రేటు గణనీయంగా పెరిగింది. వసతులు లేక డ్రాపౌట్ రేటు పెరుగుతున్నా తగ్గించడానికి చర్యలు తీసుకోని అధ్వాన్న పాలనను అప్పట్లో చూశాం.

24.74 లక్షల మందికి జగనన్న విద్యా దీవెన

- ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు తోడుగా ఉండేలా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నాం. ఈ పథకం ద్వారా 24.74 లక్షల మంది పిల్లలకు రూ 8,365 కోట్లు ఖర్చు చేశాం. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.1,777 కోట్లు కూడా మన ప్రభుత్వమే చెల్లించింది.
- వసతి దీవెన పథకం కింద 18.77 లక్షల మంది విద్యార్థులకు రూ.3349.57 కోట్లు అందించాం. ఈ రెండు పథకాల కోసం గత మూడేళ్లలో రూ.11,715 కోట్లు ఖర్చు చేశాం.

నాడు కునారిల్లిన చదువులు

- చంద్రబాబు హయాంలో పాఠశాల విద్యలో గరిష్ట చేరికల రేషియో చాలా అధ్వాన్నంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా అట్టడుగున ఉండేది. కేంద్ర విద్యా శాఖ గణాంకాలు 2018 ప్రకారం 2015–16లో ప్రైమరీ పాఠశాలల్లో చేరే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో దేశంలో 99.21 శాతంగా ఉండగా, మన రాష్ట్రంలో 84.48%ఉండింది.
- అప్పట్లో రాష్ట్రం చండీఘర్, డామన్‌డయ్యూ, లక్ష్య ద్వీప్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలతో మాత్రమే పోటీ పడేలా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పాఠశాలలకు పూర్వ వైభవం తేవడం కోసం విప్లవాత్మకంగా అడుగులు ముందుకు వేశాం.
- దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మ ఒడి పథకం తీసుకొచ్చాం. పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికి ఏటా రూ.15 వేలు సాయం చేస్తున్నాం. ఇలా ఈ మూడేళ్లలో 84 లక్షల మంది పిల్లలకు సంబంధించి 44.5 లక్షల తల్లుల ఖాతాల్లో రూ.19,617.60 కోట్లు జమ చేశాం. గోరు ముద్ద పథకం ద్వారా రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం కింద పౌష్టికాహారం అందిస్తున్నాం. ఇదే గోరు ముద్ద పథకానికి గత ప్రభుత్వ హయాంలో ఏటా కేవలం రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఇప్పుడు ఏకంగా ఏటా రూ.1,800 కోట్లు ఖర్చు చేస్తున్నాం.
- విద్యా కానుక కింద పాఠశాలలో చేరే సమయానికి ప్రతి పిల్లవాడికి బ్యాగ్, మూడు జతల యూనిఫామ్, కుట్టుకూలి, బెల్ట్, ఒక జత షూస్, రెండు జతల సాక్స్‌లు, బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్ బుక్స్, ఇంగ్లిష్ టూ తెలుగు డిక్షనరీ ఇస్తున్నాం. ఇందుకోసం రూ.886 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

8వ తరగతి పిల్లలకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌లు

- విద్యా కానుకలో భాగంగా ఈ ఏడాది 4.70 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులు, దాదాపు 50 వేల మంది ఉపాధ్యాయులకు రూ.665 కోట్లతో 5.18 లక్షల ట్యాబ్‌లను నవంబర్ చివరి వారంలో పంపిణీ చేయనున్నాం. బయటి మార్కెట్లో రూ.16 వేల విలువైన ఈ ట్యాబ్‌లను రివర్స్ టెండర్ల ద్వారా రూ.12,840కే కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్నాం.
- ఇప్పుడు 8వ తరగతి పిల్లలు 2025లో సీబీఎస్సీ బోర్డు పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. వీరికి బైజూస్ ఆన్‌లైన్ కంటెంట్‌తో పాఠాలు అందించేలా ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు ఖర్చయ్యే బైజూస్ లెర్నింగ్ యాప్‌ను ట్యాబ్‌లలో పిల్లలకు ఉచితంగా అందిస్తున్నాం. విద్యా కానుక ద్వారా 47 లక్షల మంది పిల్లలకు మేలు జరుగుతోంది.

డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోలగట్ల

సభ నిర్వహణలో నిష్పాక్షికంగా వ్యవహరిస్తానని వెల్లడి



సాక్షి, అమరావతి: శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం బాధ్యతలను చేపట్టారు. వెలగపూడిలోని తాత్కాలిక శాసన సభ భవనంలో తనకు కేటాయించిన చాంబర్‌లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన కోలగట్లకు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స వరాహవెంకట సూర్యనారాయణరాజు, పాకలపాటి రఘువర్మ, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, బడ్డుకొండ అప్పలనాయుడు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, యు.వి.రమణమూర్తిరాజు, చెట్టి ఫల్గుణ తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. సోమవారం శాసనసభ సమావేశంలో కోలగట్ల వీరభద్రస్వామి ఉప సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. ఆ వెంటనే సభాపతి స్థానంలో కూర్చుని కొంతసేపు సభను నిర్వహించి డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించిన కోలగట్ల మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో గురుతర బాధ్యతను అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నమ్మకాన్ని ఏ మాత్రం వమ్ముచేయకుండా తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని చెప్పారు. శాసనసభ సమావేశాలను నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

వైద్య రంగానికి చికిత్స

▶ మొదటి పేజీ తరువాయి

విద్య, వైద్య రంగాల్లో నాడు–నేడు కార్యక్రమంపై జరిగిన స్వల్ప కాలిక చర్చకు ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నాడు గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆస్పత్రులు శిథిలావస్థకు చేరినా పట్టించుకోని దుస్థితి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలుకలు కొరికి పిల్లలు చనిపోవడం, సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో ఆపరేషన్ చేయడం వంటి ఘటనలు అప్పట్లో చూశాం. అలాంటి పరిస్థితుల్లో 2019లో అధికారంలోకి వచ్చాక మనసు పెట్టి వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం' అని తెలిపారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మన రాష్ట్రంలో టైర్–1 సిటీలు లేవు..

- తెలంగాణ, తమిళనాడు, బెంగళూరు రాష్ట్రాల్లో మాదిరిగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి టైర్–1 సిటీలు మన రాష్ట్రంలో లేవు. ఈ కారణంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, అత్యాధునిక వైద్య సదుపాయాలున్న పరిస్థితులు మన దగ్గర లేవు. దీంతో ఇతర రాష్ట్రాలతో పోటీ పడే పరిస్థితి ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో మన వైద్య రంగంలో ఎలాంటి మార్పులు తెస్తే ప్రజలకు మంచి చేయగలుగుతాం అని ఆలోచించి.. ఆ దిశగా వేగంగా అడుగులు వేశాం.
- దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. నిరుపేదలు పెద్ద పెద్ద జబ్బుల బారిన పడినప్పుడు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకం తీసుకొచ్చారు.
- ఆ మహానేత మరణం తర్వాత ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నీరుగార్చారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టే నాటికి టీడీపీ ప్రభుత్వం రూ.680 కోట్లు నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిపెట్టి పోయింది. ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయడానికి నెట్‌వర్క్ ఆస్పత్రులు విముఖత చూపే పరిస్థితి.
- ఈ క్రమంలో డాక్టర్‌లా చికిత్స మొదలు పెట్టాను. టీడీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.680 కోట్లు నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాం. చెల్లింపుల్లో ఎటువంటి తారతమ్యాలకు పోలేదు. నందమూరి బాలకృష్ణకు చెందిన బసవతారకం ఆస్పత్రికి ఈ రోజున బిల్లు చెల్లింపులు.. చంద్రబాబు హయాంలో కంటే చాలా వేగంగా చేస్తున్నాం.



మారుతున్న ఆస్పత్రుల రూపురేఖలు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నాం. ఇందుకోసం ఏకంగా రూ.16,255 కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగంలో నాడు–నేడు కింద 11,888 పనులు చేపట్టగా 4,851 పనులు పూర్తయ్యాయి.
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), ఏరియా ఆస్పత్రులు (ఏహెచ్), జిల్లా ఆస్పత్రులు (డీహెచ్), బోధనాస్పత్రుల వరకూ నాడు–నేడు కింద అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రతి చోటా పూర్తి సదుపాయాలు కల్పిస్తున్నాం.
- గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్స్, పీహెచ్‌సీలు ఈ రెండూ కూడా ప్రివెంటివ్ కేర్‌లో చాలా కీలకమైన మార్పులు తీసుకొస్తాయి. ఈ క్రమంలో గ్రామాల్లో రూ.1,692 కోట్ల వ్యయంతో 10,032 హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 3,673 క్లినిక్స్ నిర్మాణం పూర్తయింది. మిగిలినవి ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయి. విలేజ్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎం ఉంటారు.
- ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీలు లేదా ఒక పీహెచ్‌సీ ఒక సీహెచ్‌సీ లేదా ఒక పీహెచ్‌సీ ఒక ఏరియా ఆస్పత్రి ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉంటారు. తద్వారా ప్రతి మండలంలో నలుగురు వైద్యులు అందుబాటులోకి వస్తారు.

కొత్తగా 17 వైద్య కళాశాలలు

- రాష్ట్రంలో ప్రస్తుతం కేవలం 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయి. వీటిని సమగ్రంగా అభివృద్ధి చేస్తూ.. కొత్తగా మరో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. పాడేరు, విజయనగరం, నర్సీపట్నం, రాజమండ్రి, పాలకొల్లు, అమలాపురం, ఏలూరు, మచిలీపట్నం, బాపట్ల, మార్కాపురం, పిడుగురాళ్ల, మదనపల్లె, పులివెందుల, పెనుకొండ, ఆదోని, నంద్యాల, పార్వతీపురంలలో వైద్య, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం.
- పాత కళాశాలల అభివృద్ధి, కొత్త కళాశాలల ఏర్పాటు కోసం రూ.12,268 కోట్లు వ్యయం చేస్తున్నాం. విలేజ్ క్లినిక్ నుంచి బోధనాస్పత్రి వరకు అన్ని స్థాయిల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మక మార్పులు చేపట్టాం. నాడు–నేడు ద్వారా విద్య, వైద్య ఆరోగ్య రంగంలో పూర్తి మార్పులు వచ్చే ఏడాది, రెండేళ్లలో స్పష్టంగా కనిపిస్తాయి. ప్రజలకు ఇంకా మంచి చేసే అవకాశాన్ని దేవుడు ఇవ్వాలని కోరుకుంటున్నాను.

ప్రతి గ్రామానికి నెలలో రెండు మూడు సార్లు వైద్యుడు

- త్వరలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నాం. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని పీహెచ్‌సీ వైద్యుడు నెలలో రెండు, మూడు సార్లు సందర్శిస్తాడు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. పీహెచ్‌సీలో ఉండే ఇద్దరు వైద్యుల్లో ఒకరు రోజు విడిచి రోజు 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ)తో తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి, అక్కడే వైద్య సేవలందిస్తారు.
- దీంతో మెజారిటీ జబ్బులకు గ్రామాల్లోనే వైద్యం అందుతుంది. వైద్యుడితో గ్రామస్తులకు అనుబంధం ఏర్పడుతుంది. నెలలో రెండు, మూడు సార్లు గ్రామాన్ని సందర్శించడంతో ప్రజలను వైద్యుడు పేరు పెట్టి పిలిచే పరిస్థితులు ఏర్పడతాయి. ఓ వైపు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో విలేజ్ క్లినిక్స్, పీహెచ్‌సీ స్థాయిలో అడుగులు వేస్తుండగా, మరో వైపు సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా, బోధనాస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మార్చేస్తున్నాం. ఈ ఆస్పత్రులు క్యూరేటివ్ కేర్‌లో క్రియాశీలక పాత్ర పోషిస్తాయి.


95 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ

- వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి తీసుకువచ్చాం. అంటే నెలకు రూ.40 వేల ఆదాయం ఉండే మధ్యతరగతి కుటుంబాలకూ పథకాన్ని వర్తింపజేశాం. ఫలితంగా 95 శాతానికి పైగా కుటుంబాలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయి.
- గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీలో కేవలం 1059 ప్రొసీజర్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఈ అక్టోబర్ 5వ తేదీ నుంచి ఏకంగా 3,118 ప్రొసీజర్లకు పథకాన్ని వర్తింపచేయబోతున్నాం. ప్రొసీజర్‌ల సంఖ్య పెంచడం, మరో వైపు నెట్‌వర్క్ ఆస్పత్రులకు సకాలంలో బిల్లు చెల్లింపుల ద్వారా ఈ పథకాన్ని బలోపేతం చేశాం.
- ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ.. గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ (జీఎంపీ) మందులు మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

30 లక్షల ఓట్లపై డేటా దొంగల గురి!

▶ మొదటి పేజీ తరువాయి

డేటా చోరీకి తెగబడినట్లు తేలింది. సభా సంఘం విచారణలో వెల్లడైన అంశాలు సంగ్రహంగా...



స్టేట్ డేటా సెంటర్ కేంద్రంగా..

చంద్రబాబు సర్కారు ప్రజా సాధికారిక సర్వే ద్వారా సేకరించిన ప్రజల కీలక సమాచారం పెద్ద ఎత్తున ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు చేరింది. ఏకంగా స్టేట్ డేటా సెంటర్ నుంచే సున్నితమైన ఈ సమాచారాన్ని అక్రమంగా చేరవేశారు. స్టేట్ డేటా సెంటర్‌లో 264 కంప్యూటర్లు / సర్వర్లు ఉండగా 18 సర్వర్లను ప్రజా సాధికారిక సర్వే కోసం వినియోగించారు. ఆ సర్వర్ల నుంచే గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలకు భారీగా డేటాను చేరవేశారు. 18 సర్వర్లలో నాలుగు సర్వర్ల నుంచి ఏకంగా 24.3 టెరా బైట్ల సమాచారాన్ని చేరవేసినట్లు సభా సంఘం విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో మొత్తం 18 సర్వర్ల నుంచి ఇంకెంత సమాచారాన్ని అక్రమంగా బదలాయించారో అంతుబట్టడం లేదు.

- టీడీపీ సర్కారు స్టేట్ డేటా సెంటర్‌కే పరిమితమవ్వాల్సిన సమాచారాన్ని ఇతర శాఖల కార్యాలయాలకు కూడా అందుబాటులోకి తెచ్చింది. ఆ శాఖలు వాటి సర్వర్లను స్టేట్ డేటా సెంటర్‌లో కాకుండా బయట నిర్వహించాయని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) ఉన్నతాధికారులు సభా సంఘానికి నివేదించారు. అంటే ప్రజా సాధికారిక సర్వే ద్వారా సేకరించి స్టేట్ డేటా సెంటర్‌లో ఉంచాల్సిన సమాచారాన్ని ముందస్తు వ్యూహం ప్రకారమే బయట కార్యాలయాలకు కూడా అందుబాటులోకి తెచ్చారన్నది స్పష్టమైంది. అక్కడి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలకు ఆ సమాచారాన్ని తరలించారు.
- సర్వర్ల నుంచి డేటాను ఎక్కడికి తరలించారన్నది కీలకంగా మారింది. అనుమతి లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలకు చెందిన ఐపీ అడ్రస్‌లకు డేటాను బదిలీ చేశారని విచారణలో వెల్లడైంది. వాటి ఐపీ అడ్రస్‌లను ఎవరు నిర్వహిస్తున్నారో గూగుల్ సంస్థ కూడా గుర్తించలేకపోవడం గమనార్హం. పక్కాగా తప్పుడు చిరునామాలు, వివరాలతో నకిలీ ఐపీ అడ్రస్‌లతో ఉన్న గూగుల్ ఖాతాల్లోకి డేటాను చేరవేశారన్నది స్పష్టమైంది.
- ప్రజా సాధికారిక సర్వే ద్వారా సేకరించిన ప్రజల సమాచారానికి స్టేట్ డేటా సెంటర్, ఆర్‌టీజీఎస్ కస్టోడియన్‌గా ఉన్నాయి. అంటే ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత వాటిదే. కానీ ఆ శాఖల నుంచే సమాచారం బయటకు వెళ్లిందంటే కచ్చితంగా అత్యున్నత స్థాయి వ్యక్తుల అనుమతితోనే చేసి ఉంటారని సభా సంఘం నిర్ధారించింది. అత్యున్నత స్థాయి వ్యక్తుల అనుమతి లేకుండా ఆ సమాచారాన్ని బయటకు తరలించడం సాధ్యపడదని స్టేట్ డేటా సెంటర్ ఉన్నతాధికారులు సభా సంఘానికి స్పష్టం చేయడం గమనార్హం. అంటే డేటా చోరీ పన్నాగం టీడీపీ ముఖ్య నేతల కనుసన్నల్లోనే సాగిందన్నది సుస్పష్టమైంది.

క్రిమినల్ కేసులకు సిద్ధం

ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడాన్ని శాసనసభా సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది. గత సర్కారు హయాంలో డేటా చోరీకి పాల్పడ్డారని శాసనసభకు మధ్యంతర నివేదిక సమర్పించిన సభా సంఘం రెండో దశ విచారణ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఫోన్ కాల్స్ ట్యాపింగ్, డేటా చోరీ కోసం నిఘా పరికరాల కొనుగోలుపై ప్రధానంగా దృష్టి సారించనుంది. అప్పటి ఐటీ శాఖ బాధ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు, ఆర్‌టీజీఎస్, స్టేట్ డేటా సెంటర్ ఉన్నతాధికారులతో పాటు గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతలను కూడా సభా సంఘం విచారించనుందని తెలుస్తోంది. అత్యున్నతస్థాయి వ్యక్తుల ప్రమేయంతోనే డేటాను అనధికారిక వ్యక్తులు, సంస్థలకు తరలించినట్లు ఇప్పటికే సభా సంఘం విచారణలో వెల్లడైంది. దీంతో వారిని విచారణకు పిలవనుంది. మరోవైపు ఈ వ్యవహారంపై క్రిమినల్ కేసుల నమోదుకు కూడా రంగం సిద్ధమవుతోంది. గోప్యంగా ఉంచాల్సిన ప్రభుత్వ అధికారిక సమాచారం, ప్రజల వ్యక్తిగత వివరాలను అక్రమంగా గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలకు చేరవేయడం రాజ్యాంగ విరుద్ధం. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమైన అంశం. దీన్ని సభా సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది.

30 లక్షల ఓట్ల తొలగింపు కుట్ర

- టీడీపీ సేవామిత్ర యాప్ చేతికి డేటా సెంటర్ సమాచారం: భూమన
- డేటా చౌర్యంపై శాసనసభకు ఉపసంఘం మధ్యంతర నివేదిక

రాష్ట్ర ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని అక్రమంగా బయటకు తరలించి 2016–19 మధ్య కాలంలో టీడీపీ సర్కారు డేటా చౌర్యానికి పాల్పడినట్లు విచారణలో నిర్ధారణ అయిందని శాసనసభ ఉపసంఘం అధ్యక్షుడు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న 30 లక్షల మందికిపైగా ఓటర్లను తొలగించేందుకు యత్నించారని నిగ్గు తేలిందన్నారు. ఉపసంఘం మధ్యంతర నివేదికను మంగళవారం శాసనసభకు సమర్పించిన అనంతరం ఆయన సభలో మాట్లాడారు. వివిధ శాఖల అధిపతులు, ఇతర అధికారులతో నాలుగుసార్లు సమావేశమై ఈ వ్యవహారం లోతుల్లోకి వెళ్లి విచారించినట్లు తెలిపారు. స్టేట్ డేటా సెంటర్‌లో ఉండాల్సిన ప్రజల సమాచారాన్ని టీడీపీకి చెందిన సేవామిత్ర యాప్ ద్వారా దుర్వినియోగం చేసి ఇతరులకు అందజేశారని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. టీడీపీకి ఓట్లు వేయని వారి సమాచారాన్ని స్టేట్ డేటా సెంటర్ల ద్వారా సేకరించినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై మరికొంత మందిని విచారించి సమాచారాన్ని సేకరిస్తామన్నారు. ప్రస్తుతానికి మధ్యంతర నివేదికను శాసనసభకు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ వర్క్‌షాప్ ప్రారంభం

మరింత సమర్థవంతంగా సేవలందించడంపై చర్చ


మాట్లాడుతున్న కృష్ణబాబు

సాక్షి, అమరావతి: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు అన్నారు. విజయవాడలో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. వైద్య చికిత్సల సంఖ్య పెంపు, ఆరోగ్యశ్రీ బిల్లింగ్, చెల్లింపుల విధానాల్లో తీసుకురావాల్సిన మార్పులు తదితరాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించి నివేదిక రూపొందిస్తారని తెలిపారు. ప్రతి విభాగానికి నలుగురు ప్రముఖ వైద్య నిపుణులతో ఒక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అక్టోబర్ 2 నుంచి అవసరమైన మార్పులు, చేర్పులతో మరింత మెరుగ్గా ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశించారని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో ప్రజలకు సత్వర వైద్య సహాయం అందేలా 104తో పాటు టెలీమెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో హరేంధిర ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

24న సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం

మహిళా కమిషన్ ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో నిర్వహణ

సాక్షి, అమరావతి: మహిళలకు విద్య, సాంఘిక హక్కులు, రాజకీయ చైతన్యం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా మహాత్మ జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 150వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 24వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర మహిళా కమిషన్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీ ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో 'మహాత్మ పూలే–సత్యశోధక్ సమాజ్–మహిళలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ మంగళవారం వెల్లడించారు.

దశలవారీగా అన్ని ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో దర్శనాలు, ఆర్జితసేవలు, వసతి సౌకర్యాలు, ఈ–హుండీ, ప్రసాద విక్రయాలు తదితరాలను దశలవారీగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. దేవదాయ శాఖ పరిధిలోని ఎనిమిది ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన వెబ్‌పోర్టల్ aptemples.gov.inను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే శ్రీశైలం దేవస్థానంలో ఆన్‌లైన్ సేవలను పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేశామని, ఇది విజయవంతం కావడంతో మరో ఎనిమిది ఆలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విజయవాడ దుర్గగుడి, ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, పెనుగంచిప్రోలు ఆలయాలతోపాటు విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆన్‌లైన్ సేవలు మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు.

మధ్యంతర పెగసస్ నివేదికపై కేంద్రం స్పందించాలి

సీపీఎం నేత శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మధ్యంతర పెగాసెస్ నివేదికపై కేంద్రం, ఎన్నికల సంఘం స్పందించి సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వం పెగసస్‌ను కొనుగోలు చేసినట్టు ప్రాథమిక ఆధారాలున్నాయని నివేదికలో పేర్కొన్న అంశాలు చాలా తీవ్రమైనవిగా పేర్కొన్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను సవాల్ చేసేవిగా అభివర్ణించారు. దీనిపై ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని టీడీపీని డిమాండ్ చేశారు.

ఆర్బీకేల వద్ద వే బ్రిడ్జిలు

ధాన్యం తూకాల్లో మోసాలకు అడ్డుకట్ట

- తొలిదశలో డిసెంబర్ కల్లా 93 వేబ్రిడ్జిలు సిద్ధం
- ఒక్కొక్కటి రూ.19.95 లక్షల అంచనా వ్యయం
- 60 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు



సాక్షి, అమరావతి: పంట కొనుగోళ్లను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) వద్ద ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దళారీలు, మిల్లర్ల ప్రమేయం లేకుండా గత వ్యవసాయ సీజన్ నుంచి ధాన్యంతో పాటు అన్ని రకాల పంటలు ఆర్బీకేల ద్వారా కొనుగోలుచేస్తున్నారు. ఖరీఫ్‌లో రూ.7859.30 కోట్ల విలువైన 40.38 లక్షల టన్నులు, రబీలో రూ.5245.23 కోట్ల విలువైన 26.98 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 85.58 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులొస్తాయని అంచనా.

రైతన్నలు నష్టపోకుండా...

ధాన్యంలో తేమ శాతాన్ని ఆర్బీకేల్లో ప్రస్తుతం మాయిశ్చర్ మిషన్ ద్వారా పరీక్షిస్తున్నారు. కొనుగోలు తేదీలను రైతులకు వెల్లడిస్తూ గన్నీ బ్యాగ్‌లు కూడా సరఫరా చేస్తున్నారు. ఆ సమయానికి రైతులు ధాన్యాన్ని గోతాల్లో నింపి కల్లాల వద్దే తూకం వేసి ఆర్బీకే పరిధిలోని రైసు మిల్లులకు తరలిస్తున్నారు. అయితే కల్లాల వద్ద రైతు వేసిన తూకానికి, మిల్లువద్ద వేసే తూకానికి వ్యత్యాసం వస్తోంది. కల్లాల వద్ద వెయ్యి కిలోలున్న ధాన్యం బస్తాలు మిల్లు వద్ద తూకం వేస్తుంటే 900–950 కేజీలే ఉన్నట్లు మిల్లర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తూకాల్లో మోసాలకు అడ్డుకట్ట వేసి రైతులు పండించిన ప్రతి గింజకు కనీస మద్దతు ధర లభించాలన్న సంకల్పంతో అవసరమైన చోట ఆర్బీకేల వద్ద వేబ్రిడ్జ్‌లు ఏర్పాటు చేయాలని ఇటీవల సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యేలోగా తొలిదశ వే బ్రిడ్జిల ఏర్పాటుకు అధికారుల సిద్ధమయ్యారు.

ఐదు సెంట్ల స్థలంలో..

ఒక్కో వే బ్రిడ్జికి ఐదు సెంట్ల స్థలం అవసరమని అంచనా వేశారు. ఆ మేరకు స్థలాలు అందుబాటులో ఉన్న ఆర్బీకేలకు తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు చెందిన 28 గోదాముల వద్ద ఇప్పటికే వే బ్రిడ్జిలుండగా కొత్తగా మరో 35 గోదాముల వద్ద వే బ్రిడ్జిల నిర్మాణానికి అనువైన స్థలాలున్నట్లు గుర్తించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చెందిన రెండు గోదాములతో పాటు 16కిపైగా వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముల వద్ద కొత్తగా వే బ్రిడ్జిలను నిర్మించాలని ప్రతిపాదించారు. వీటితోపాటు వరి ఎక్కువగా సాగయ్యే జిల్లాల్లో కనీసం 40 ఆర్బీకేల పరిధిలో కొత్తగా వే బ్రిడ్జిల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. మొత్తమ్మీద 93 చోట్ల కొత్తగా వే బ్రిడ్జిల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆర్బీకేల పరిధిలో వీలైనంత మేరకు మరిన్ని అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నిస్తున్నారు.

డిసెంబర్ నాటికి సిద్ధం!

60 టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఒక్కో వే బ్రిడ్జి కోసం రూ.19.95 లక్షలు వ్యయం కానుందని అంచనా. ఈ మొత్తంతో 9 గీ 3 మీటర్ల పిట్‌లెస్ టైప్ వే బ్రిడ్జి, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, యూపీఎస్, సిబ్బంది ఉండేందుకు వీలుగా ఎంఎస్ క్యాబిన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్‌కల్లా వీటిని అందుబాటులోకి తెచ్చేలా కసరత్తు జరుగుతోంది.

23న కుప్పంలో సీఎం జగన్ పర్యటన

మూడో విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటించనున్నారు. అక్కడ వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు మూడో విడత నిధులను సీఎం విడుదల చేయనున్నారు. అలాగే బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగించనున్నారు. వాస్తవానికి ఈ నెల 22నే కుప్పం పర్యటనకు వెళ్లాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల 23కి వాయిదా పడింది.

సీఎం జగన్ పర్యటన షెడ్యూల్..

- ఈ నెల 23 ఉదయం 9.15 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి కుప్పం బయలుదేరతారు.
- 10.45 గంటలకు కుప్పం చేరుకుంటారు.
- 11.15–12.45 గంటల మధ్య బహిరంగ సభలో పాల్గొంటారు
- అనంతరం వైఎస్సార్ చేయూత పథకం మూడో విడత నిధులను విడుదల చేస్తారు.
- 1.20 గంటలకు కుప్పం నుంచి బయలుదేరి 3.10 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

'నవయుగ' అనుబంధ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయాన్ని వాయిదా వేసిన హైకోర్టు



సాక్షి, అమరావతి: మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను ఇతరులెవరికీ అప్పగించకుండా ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని నవయుగ పోర్ట్ లిమిటెడ్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయాన్ని వాయిదా వేసింది. నవయుగ పోర్ట్ లిమిటెడ్‌తో ఒప్పందాన్ని రద్దుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ నవయుగ పోర్ట్ లిమిటెడ్ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను మంగళవారం జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశం నవయుగ పోర్ట్ లిమిటెడ్‌కి ఏ మాత్రం లేదని, అందుకే ఒప్పందంలోని నిబంధనలను బేఖాతరు చేస్తూ వచ్చిందని చెప్పారు. రాయితీల కల్పనకు ఉద్దేశించిన స్టేట్ సపోర్ట్ అగ్రిమెంట్ (ఎస్ఎస్ఏ) ఖరారు విషయంలో కూడా ఆ సంస్థ ఏ మాత్రం చొరవ చూపలేదన్నారు. భూములన్నీ ఒకేసారి అప్పగించాల్సిన అవసరం లేదని, ఇలా అప్పగించాలని ఒప్పందంలో ఎక్కడా లేదని తెలిపారు. ప్రస్తుతం ఏ భూములు కూడా నవయుగ పోర్ట్ లిమిటెడ్ స్వాధీనంలో లేవని చెప్పారు. ఈ పోర్టు నిర్మాణంలో విస్తృత ప్రజాప్రయోజనాలు, భారీ ప్రజాధనం ముడిపడి ఉన్నట్లు తెలిపారు. అందువల్ల ఈ ప్రాజెక్టుపై ప్రభావం చూపేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. శ్రీరామ్ వాదనలకు నవయుగ పోర్ట్ తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ సమాధానం ఇస్తూ.. రాష్ట్ర ప్రభుత్వమే ఒప్పందం ప్రకారం నడుచుకోలేదన్నారు. ఒప్పందం ప్రకారం అప్పగించాల్సిన భూములను అప్పగించలేదని తెలిపారు. సింగిల్ జడ్జి తీర్పు నేపథ్యంలో పోర్టు నిర్మాణ పనులను ఇతరులకు అప్పగించే ఆస్కారం ఉందన్నారు. అందువల్ల యథాతథస్థితి కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయాన్ని వాయిదా వేసింది.

క్రీడాకారులకు రూ.23.91 లక్షలు మంజూరు

జాతీయ పోటీల్లో పాల్గొనే ఏపీ బృందానికి ప్రభుత్వ సాయం


క్రీడా సంఘాలతో సమావేశమైన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎండీ ప్రభాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: గుజరాత్ వేదికగా 36వ జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు ప్రభుత్వం రూ.23.91 లక్షలు మంజూరు చేసింది. వీటితో క్రీడాకారులతోపాటు కోచ్, మేనేజర్లకు టీఏ, డీఏలు, అవసరమైన స్పోర్ట్స్ కిట్స్ కొనుగోలుకు అనుమతులిస్తూ మంత్రి ఆర్కే రోజా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడేళ్ల తర్వాత జరుగుతున్న జాతీయ క్రీడల్లో 36 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రం తరఫున 170 మంది క్రీడాకారులు 30 ఈవెంట్స్‌లో పాల్గొననున్నారు. క్రీడాకారులు, సహాయ సిబ్బంది, కోచ్‌లతో కలిపి మొత్తం 250 మందితో కూడిన ఏపీ బృందానికి ద్రోణాచార్య రమణారావు సారథ్యం వహించనున్నారు. కేరళలో చివరిసారిగా 2015లో జరిగిన జాతీయ క్రీడల్లో ఏపీ 16 పతకాలతో 18వ స్థానంలో నిలిచింది. కాగా మంగళవారం శాప్ కార్యాలయంలో రాష్ట్రంలో గుర్తింపు పొందిన 23 క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులకు శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేసేలా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని క్రీడా సంఘాలు కచ్చితంగా జాతీయ క్రీడల అభివృద్ధి కోడ్–2011ను పాటించాలని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో జనసేనతోనే పొత్తు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



ఏలూరు (టూటౌన్): వచ్చే ఎన్నికల్లో తమ పొత్తు జనసేనతోనే ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. ఏలూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ హీరో అయితే.. వైఎస్ జగన్, చంద్రబాబు జీరోలని విమర్శించారు. పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే.. టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు కమీషన్ల కోసం పనులు చేస్తున్నాయని ఆరోపించారు. అక్టోబరు 2 లోగా రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌లకు నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

విశాఖలో భారీ ఆన్‌లైన్ బ్యాటింగ్ రాకెట్

- కిర్లంపూడి లే అవుట్ శ్రీపాల్ టవర్స్‌లో 9 మంది అరెస్ట్
- నిందితుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్ యువకులు
- ఉమ్మడి విశాఖ జిల్లా యువకులు ఇద్దరు, ఒడిశాకు చెందిన మరొకరి అరెస్టు
- రూ.90 లక్షలతో బ్యాటింగ్ గేమ్

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): నగరంలో భారీ ఆన్‌లైన్ బ్యాటింగ్ రాకెట్ బయటపడింది. ఈ రాకెట్‌లో తొమ్మిది మందిని త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి లే అవుట్‌లోని శ్రీపాల్ టవర్స్‌లో ఆన్‌లైన్ జూదం జరుగుతున్నట్లు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ రామారావు ఉన్నతాధికారుల అనుమతితో ఎస్ఐలు రాము, సంతోష్‌కుమార్, సిబ్బందితో శ్రీపాల్ టవర్స్‌లోని ఓ అపార్టుమెంట్‌లో తనిఖీలు చేశారు. ఆన్‌లైన్ బ్యాటింగ్ గేమ్ నిర్వహిస్తున్న 9 మంది యువకులను అరెస్టు చేశారు. వీరిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు, ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు, ఒడిశాకు చెందిన ఒకరు ఉన్నారు. వీరు సుమారు వెయ్యి మందితో ఈ ఆన్‌లైన్ గేమ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ ముఠాకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కథలి కిషోర్ (26) టీమ్ లీడర్‌గా వ్యవహరించగా మిగతా వారు ఆర్థిక లావాదేవీలు, బుకీలతో సంప్రదింపులు చేస్తున్నారు. వీరు రూ.90 లక్షల లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. వీరి నుంచి 16 సెల్‌ఫోన్లు, నాలుగు ల్యాప్ టాప్‌లు, 1 వైఫై రూటర్, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధిక లాభాల నెపంతో యువకులను ఈ జూదం వైపు ఆకర్షిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కథలి కిషోర్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు నిర్ధారించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కోనాడ మోనుమూర్తి (20), ప్రదీప్ పాండే (28), వంకా మహేష్‌కుమార్ (31), వేదూ ప్రకాష్ (26), జితేంద్ర పాండే (23), ఒడిశాకు చెందిన కర్కాయల హరికృష్ణ (22)ను అరెస్టు చేశారు. ఈ జూదంలో పాల్గొన్న నర్సీపట్నంకు చెందిన కోనూరు ఉమామహేశ్వరరావు (22), విశాఖ మల్కాపురానికి చెందిన పెదిరెడ్ల సాగర్ (20)ను కూడా అరెస్టు చేశారు.

ఎప్పుడూ జైలు చూడలేదు.. ఇప్పుడు రప్పించారు

చిత్తూరులో చంద్రబాబునాయుడు వ్యాఖ్యలు

చిత్తూరు అర్బన్: తన జీవితంలో ఇప్పటివరకు జైలుకు వెళ్లలేదని.. కానీ, ఇప్పుడు జైలుకెళ్లి మా పార్టీ కార్యకర్తలను పరామర్శించాల్సిన పరిస్థితిని జగన్ తెప్పించారని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. చిత్తూరు నగరానికి మంగళవారం వచ్చిన ఆయన.. కుప్పం అల్లర్లలో అరెస్టయి జిల్లా జైల్లో ఉన్న టీడీపీ నేతలతో ములాఖత్ అయ్యారు. దాదాపు 40 నిమిషాలపాటు అక్కడే ఉన్నారు. అనంతరం బయటికొచ్చి రోడ్‌షోలో మాట్లాడుతూ.. 'దేశంలోనే ఎక్కువకాలం సీఎంను నేనే.. ఎక్కువకాలం ప్రతిపక్ష నేతగా ఉన్నదీ నేనే.. ఎన్ఎస్‌జీ కమాండో ప్రొటెక్షన్‌లో ఉన్నాను. మా వాళ్లను జైల్లోకి తోసి, ఇప్పుడు జగన్ కుప్పం వచ్చి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నాడు. జగన్‌రెడ్డి.. ఏం పీకావని కుప్పం వస్తున్నావు? నువ్వు ఏ లగ్నాన పుట్టావు? నువ్వు మనిషివేనా? పశువుకంటే హీనంగా ఉన్నావు'.. అంటూ మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..


జైలువద్ద పోలీసులను నెట్టేస్తున్న టీడీపీ కార్యకర్తలు

వారిని వీరుల్లా పరిగణిస్తాం

'తమ్ముళ్లూ.. మీరు నాసిరకం మద్యం తాగుతుంటే నాకు బాధగా ఉంది. వైసీపీకి పోయేరోజులు దగ్గర పడ్డాయి. రోజురోజుకు జగన్‌రెడ్డి గ్రాఫ్ పడిపోతోంది. నేను సవాల్ చేస్తున్నా.. 175 సీట్లు కాదు, పులివెందులలో గెలిచి చూపించు. ఏపీకి రాజధాని ఏది అని యువతను బయటివాళ్లు అడుగుతుంటే మూడుముక్కలాట అని చెప్పండి. వైఎస్సార్‌సీపీపై దాడులుచేసి జైలుకు వెళ్లివచ్చే టీడీపీ కార్యకర్తలను వీరుల్లాగా పరిగణిస్తాం. జైలు నుంచి బయటకొస్తే స్వాతంత్ర్య సమరయోధుల్లాగా ఊరేగించి, వారి ఊర్లో వదిలిపెట్టి వస్తాం. రాష్ట్రంలో 90 శాతం పోలీసులు మంచివాళ్లే, మిగిలిన వాళ్లు టెర్రరిస్టుల్లా, గూండాల్లాగా ప్రవర్తిస్తున్నారు. అవకాశం వస్తే మిమ్మల్ని నేనే శిక్షిస్తాను. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కడానికి నేనే పితామహుడిని. సెల్‌ఫోన్లు నాతోనే వచ్చాయి. అవి ఎలా పనిచేస్తాయో నేనే రిపోర్టులిచ్చాను. వాటి ఆధారంగానే సెల్‌ఫోన్లు కనిపెట్టారు. జాతీయ రహదారులు వేయాలని నాటి ప్రధాని వాజ్‌పేయికి చెప్పింది నేనే. అప్పటి నుంచే దేశంలో జాతీయ రహదారులు మొదలయ్యాయి. 24 క్లైమోర్ మైన్స్‌తో కూడా తనకు ఏమీకాలేదు. దానికే భయపడని నేను వైఎస్ జగన్‌కు భయపడే ప్రసక్తేలేదు. 1985లో ఎన్టీఆర్‌ను కొందరు గద్దె దించితే 35 రోజులు పోరాడిన ఘనత నాదే' అని చంద్రబాబు అన్నారు.

అనంతరం.. చిత్తూరు మాజీ మేయర్ హేమలత ఇంటికి వెళ్లిన చంద్రబాబు.. మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆరోపించారు. చంద్రబాబు వెంట పార్టీ నాయకులు కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నాలుక అనేది పదునైన కత్తి లాంటిది.
కాకపోతే రక్తం చిందించకుండానే చంపగలదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, సెప్టెంబర్, 21

సినిమా ఊరట!

ఒకటి కాదు... రెండు కాదు... మూడు దశాబ్దాల పైగా సుదీర్ఘ నిరీక్షణ. ఎట్టకేలకు అది ఆదివారం నాడు ఫలించింది. కశ్మీర్‌లోని పుల్వామా, షోపియాన్ జిల్లాల్లో సరికొత్త మల్టీపర్పస్ సినిమా హాళ్ళు రెండింటిని జమ్మూ–కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రారంభించారు. అలాగే, కశ్మీర్‌లో తొలి మల్టీప్లెక్స్ సైతం 3 స్క్రీన్లతో మంగళవారం శ్రీనగర్‌లో మొదలైంది. పాలకులు చెబుతున్నట్టు కశ్మీర్‌లో సినీ రంగానికి ఇది చరిత్రాత్మక దినమే. 1980ల తర్వాత టీవీలో, ఇటీవల ఓటీటీలలో తప్ప థియేటర్లలో పదుగురితో కలసి సినీ సందర్శన అనుభవమే లేని కొత్త తరానికి ఇది మరో ప్రపంచపు స్వాగతమే. అదే సమయంలో వెండితెరతో పాటు జనజీవితాలూ వెలిగిపోవడానికి ఇది సరిపోతుందా?

తీవ్రవాదంపై పోరులో తెరపై గెలిచే సినిమా... నిజజీవితంలో అదే తీవ్రవాదానికి దశాబ్దాలుగా బాధితురాలవడమే విచిత్రం. మిగిలిన భారతీయుల్లా కల్లోలిత కశ్మీర్ వాసులూ సాధారణ జీవితం గడపడానికీ, తీరికవేళ సినీవినోదాన్ని ఆస్వాదించడానికీ ఈ కొత్త సినిమా హాళ్ళు ఉపకరిస్తాయని భావన. అందుకే, ప్రతి జిల్లా ముఖ్యపట్టణంలో సినిమా హాలు నెలకొల్పాలని పాలకుల నిశ్చయం. అలా కేంద్రపాలిత జమ్మూ – కశ్మీర్‌లోని 20 జిల్లాల్లోనూ థియేటర్లు పెడతారు. జిల్లా పాలనా యంత్రాంగంతో కలసి ప్రభుత్వ 'మిషన్ యూత్ డిపార్ట్‌మెంట్' ఈ థియేటర్లను నెలకొల్పుతుంది. వాటి నిర్వహణను నిపుణులకు అప్పగిస్తారు. ఇందులో భాగంగా అనంతనాగ్, శ్రీనగర్, రాజౌరీ, పూంఛ్ లాంటి చాలాచోట్ల త్వరలో సినీ వినోదశాలలు రానున్నాయి. అక్కడ సినిమా షోలతో పాటు విజ్ఞానభరిత వినోదం, యువతకు నవీన నైపుణ్యాభివృద్ధి వసతులు కల్పించాలని ప్రణాళిక.

కనువిందైన మంచు కొండలు, కాదనలేని డాల్ సరస్సులో నౌకా విహారం వగైరాతో అందమైన ప్రకృతి, ఆహ్లాదభరిత వాతావరణంతో చాలాకాలం సినిమా షూటింగ్‌లకు కశ్మీర్ కేంద్రం. రాజ్ కపూర్ నుంచి తెలుగులో ఎన్టీఆర్, ఏయన్నార్, చిరంజీవి సినిమాల దాకా అన్నీ కశ్మీర్ అందాలను కెమెరాకంటితో బంధించినవే. 1989 నాటి వేర్పాటువాద విజృంభణతో ఆ పరిస్థితే పోయింది. మరోపక్క ఎందరో కశ్మీరీలు హిందీ చిత్రసీమలో పేరు తెచ్చుకున్నా, ఎప్పుడో 58 ఏళ్ళ క్రితం తొలి పూర్తినిడివి కశ్మీరీ ఫీచర్ ఫిల్మ్ 'మైంజ్ రాత్'తో మొదలైన 'కశ్మీరీ భాషా సినీపరిశ్రమలో ఇప్పటికీ ఎదుగూబొదుగూ లేదు. తర్వాత కొద్ది ఫిల్మ్‌లే వచ్చాయి. తీవ్రవాదుల భయానికి స్థానిక, పరభాషా చిత్రాల నిర్మాణం రెండూ స్తంభించాయి. చిత్రప్రదర్శనపై అప్రకటిత నిషేధం వచ్చిపడింది.

నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం, అనంతర పాలకులూ థియేటర్లు తెరిచేందుకు ప్రయత్నించినా తీవ్రవాద దాడులతో అవేవీ విజయవంతం కాలేదు. పైరసీ రాజ్యమేలుతోంది. హాలులో సినిమా చూడడానికి సినీప్రియులు కశ్మీర్ దాటి పొరుగు రాష్ట్రాలకు వెళుతున్న పరిస్థితి. లోయలో సాధారణ పరిస్థితి తెస్తున్నామంటూ 2019లో కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన పాలకులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. జమ్ము – కశ్మీర్‌ను మళ్ళీ భారతీయ సినీనిర్మాణ పటంపైకి తీసుకురావాలని కేంద్రపాలిత ప్రాంత పాలనాయంత్రాంగం గత ఏడాది ఓ సరికొత్త చలనచిత్ర విధానాన్ని తెచ్చింది. హిందీ నిర్మాతలను మళ్ళీ కశ్మీర్ వైపు ఆకర్షించడానికి ప్రత్యేక వసతులు కల్పించింది. ఇప్పుడీ ప్రయత్నాలన్నిటి వల్ల కశ్మీరీలకు వెండితెర వినోదం అందుబాటులోకి రావడమే కాక, స్థానిక ఆర్థిక కార్యకలాపాలు పెరిగి, ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగవుతాయనేది ఆలోచన.

వర్తమాన సంస్కృతి, విలువలతో పాటు ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిఫలించే సినిమా మనోనేత్రానికి ద్వారాలు తీస్తుంది. మతమౌఢ్యంతో అన్నిటినీ నిరాకరించలేం. సౌదీ అరేబియా లాంటి దేశాలు సైతం పంథా మార్చుకొని, సినీ ప్రదర్శనలపై 35 ఏళ్ళ నిషేధాన్ని నాలుగేళ్ళ క్రితం 2018లో ఎత్తివేసి, మార్పును ఆహ్వానించడం ఒక సరికొత్త అధ్యాయం. సినిమా అనే శక్తిమంతమైన సృజనాత్మక సాధనం ఆసరాగా కశ్మీరీలను ప్రధాన స్రవంతిలో మమేకం చేయాలనే ఆలోచన మంచిదే. అయితే, అదొక్కటే సరిపోదు. దాని కన్నా ముందుగా చేయాల్సినవీ చాలానే ఉన్నాయి. ఇలాంటి ప్రతి చిన్న ప్రయత్నం స్థానిక వాణిజ్య కార్యకలాపాలకు కొత్త ప్రోత్సాహమే. కానీ, పాలకులు కశ్మీర్‌కు పారిశ్రామిక పెట్టుబడులు రప్పించి, స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంచి పోషించాల్సిన లక్ష్యం ఇప్పటికీ సుదూరంగా నిలబడి చేరబిలుస్తోంది.

కశ్మీర్ పండిట్‌ల కన్నీటి గాథలపై 'కశ్మీరీ ఫైల్స్' లాంటి ప్రచార చిత్రానికి పాలకులు ఇటీవల అండగా ఉండి, అక్కున చేర్చుకున్నారు. మరి, లోయలో సురక్షితంగా జీవించే పరిస్థితులు ఎందుకు కల్పించలేక పోతున్నారు? వారి సమస్యల పరిష్కారానికి ఇప్పటికీ ఎందుకు పూచీ పడలేకపోతున్నారు? అవన్నీ జరగాలంటే ముందుగా స్థానిక ప్రజల మనసు గెలుచుకోవాలి. అభివృద్ధి సహా అన్నిటిలో తామూ భాగస్వాములమనే భావన కల్పించాలి. అన్నిటి కన్నా ముఖ్యంగా తమ ప్రాంతాన్ని తామే పాలిస్తున్నామనే భావన కల్పించాలి. సైనికుల ఉక్కుపాదంతోనో, ఢిల్లీ ప్రభువుల కనుసన్నల్లోని పాలనా యంత్రాంగంతోనో అది సాధ్యం కాదు. నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ నుంచి తాజాగా ఓటర్ల జాబితాలో పేర్ల దాకా రకరకాల జిమ్మిక్కులతో పైచేయి కోసం ప్రయత్నిస్తున్న ఏలికలు దొడ్డిదోవ ప్రయత్నాలు మానుకోవాలి. నిజాయతీగా, నిష్పాక్షికంగా, ఎంత త్వరగా కశ్మీర్‌లో ఎన్నికలు జరిగితే అంత మేలు. కశ్మీర్ సమస్యల పరిష్కారం సినిమాల్లో చూపినంత సులభం కాదు... సినిమాలు చూపినంత సులభం కూడా కాదు. ఆ సంగతి పాలకులకూ తెలుసు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.10.23 వరకు
తదుపరి ద్వాదశి **నక్షత్రం:** పుష్యమి రా.11.53 వరకు
తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.6.11 నుండి 7.55 వరకు,
దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.19 వరకు
అమృతఘడియలు: సా.4.46 నుండి 6.33 వరకు.

సూర్యోదయం: 5.52
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం: ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుంచి 9.00 వరకు

తప్పు బాబుదైనా... నెట్టేస్తే సరి!!

2019 మే 30న సీఎంగా జగన్ ప్రమాణం ; జూన్ 14కే వరదలు

- ఆ 14 రోజుల్లో కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేయకపోవటం వైఫల్యమా?
- ఒకవేళ వీటి గ్యాప్‌లు పూడ్చేసి ఉంటే కొట్టుకుపోయి ఉండేవి కావా?
- ఐఐటీ బృందం తప్పుబట్టింది అప్పటిదాకా పాలించిన బాబుని కదా?
- 'పాలకులు' అనే పదాన్ని పట్టుకుని దాన్ని జగన్‌పైకి నెట్టేస్తున్న 'ఈనాడు'
- చంద్రబాబును ఈ స్థాయిలో వెనకేసుకు రావటంపై నిపుణుల విస్మయం

సిగ్గూఎగ్గూ.. ఉచ్ఛంనీచం అన్నీ వదిలేసి రాసే రాతలెలా ఉంటాయో... 'ఈనాడు'ను చూస్తే అర్థమవుతుంది. 2019 మేలో ఎగువ కాఫర్‌డ్యామ్‌లో ఉంచిన గ్యాప్‌లను సకాలంలో పూడ్చకపోవటంవల్లే ప్రాజెక్టు ప్రధాన డ్యాం నిర్మించే చోట పెద్దపెద్ద గుంతలు పడ్డాయని, నదీగర్భం కోతకు గురైందని హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం చెప్పిందనేది రామోజీరావు మాట. ఇదంతా పాలకుల ప్రణాళిక లోపమేనని, వారి వైఫల్యమేనంటూ రామోజీ రెచ్చిపోయారు. అసలు ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిందెప్పుడు? 2019 మే 30న కదా? ఆ ఏడాది జూన్ 14 నుంచే ఊహించని రీతిలో రాష్ట్రానికి వరదలొచ్చాయి. ఎగువ కాఫర్ డ్యామ్‌లో గ్యాప్‌ల గుండా నీటి ప్రవాహం పెరిగి ప్రధాన డ్యామ్ నిర్మించే చోట పునాది (డయాఫ్రమ్ వాల్) దెబ్బతింది. పెద్దపెద్ద గోతులు పడ్డాయి. మరి ఆ వైఫల్యం అధికారంలో ఉండి ఐదేళ్లూ ఆ పని చేయని చంద్రబాబుదా? లేక 15 రోజుల్లో చేయలేకపోయిన వై.ఎస్.జగన్‌దా? ఎవరి పాపాలు ఎవరికి అంటగట్టాలని చూస్తున్నారు రామోజీరావు గారూ?

పోలవరాన్ని ప్రాజెక్టులా కాకుండా చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నారని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ చెప్పటం పచ్చి నిజం. చంద్రబాబు దీన్ని పద్ధతి ప్రకారం కట్టకుండా కమీషన్లు వచ్చే పనులే ముందు చేశారన్నది కాదనలేని నిజం. ఈ ప్రాజెక్టులో ఏకంగా రూ.3,302 కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో రామోజీ వియ్యంకులకు చెందిన నవయుగకు కట్టబెట్టడం తిరుగులేని నిజం. అది కూడా ఈపీసీ పద్ధతి కాకుండా లంప్సమ్ (ఎల్ఎస్) విధానంలో!!. సాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో ఇదే అతిపెద్ద స్కామ్ కూడా. ఈ నిజాలు చెప్పకుండా పదేపదే అర్ధసత్యాలు, అసత్యాలు రాయాలని.. వారంలో ఒకసారైనా పోలవరంపై కథనం రాసి తప్పుడు ప్రచారాన్ని జనంలోకి తీసుకెళ్లాలని రామోజీరావు తనవారికి హుకుం జారీ చేయటం పచ్చి నిజం. అంతేకాదు!! అసెంబ్లీ సాక్షిగా బాబు–రామోజీల దోచుకో–పంచుకో–తినుకో (డీపీటీ) విధానాన్ని ఎండగడుతూ ముఖ్యమంత్రి చెప్పినవన్నీ పచ్చి వాస్తవాలు. మంగళవారం 'నిపుణుల మాట వేరు' అంటూ 'ఈనాడు' అచ్చేసిన వార్తలో అసత్యాలు ఒక్కొక్కటీ చూద్దాం...

ఏది నిజం?

భారీ కోత... బాబు అవివేకం వల్ల కాదా?

ఈనాడు: పోలవరం ప్రాజెక్టులో ఏ నిర్మాణం చేపట్టాలన్నా ముందు కేంద్ర జలసంఘం, కేంద్రం నియమించిన డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) అనుమతులు తీసుకోవాలి. డయాఫ్రమ్ వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణ పనులు ప్రారంభించే క్రమంలో ముందే ఆ అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు.

వాస్తవం: గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులు పూర్తి చేశాక.. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. ఇవి జరిగాక.. ఒకే సీజన్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు పూర్తి చేయాలనే షరతుతో కేంద్ర జలసంఘం 2018లో అనుమతి ఇచ్చింది. కానీ చంద్రబాబు ఈ అనుమతులకు ముందే అంటే... 2017 జూన్ 8నే ఎగువ కాఫర్ డ్యామ్‌కు టెంకాయ కొట్టేశారు. 2018లో వరదలు తగ్గాక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు ప్రారంభించారు. కానీ.. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపైగానీ.. అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్‌లను పూర్తి చేయడంగానీ ఏమాత్రం చేయలేదు. ఇదే అంశంపై నిర్వాసితులు కేంద్ర జల్ శక్తి శాఖకు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీకి (పీపీఏ) ఫిర్యాదు కూడా చేశారు. దాంతో.. నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, తాము విధించిన నిబంధనల మేరకు పనులు చేయాలని మరోసారి నాటి టీడీపీ సర్కార్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ, పీపీఏ ఆదేశించాయి. వాటిని చేయలేక మధ్యలోనే చంద్రబాబు చేతులెత్తేశారు. ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఒక చోట 380 మీటర్ల మేర, మరో చోట 300 మీటర్ల గ్యాప్‌లు వదిలేశారు. 2019 జూన్ మధ్య నుంచే వర్షాలు మొదలయ్యాయి. ఆ సీజన్లో భారీ వరదొచ్చింది. అది 2.1 కిలో మీటర్ల వెడల్పున ప్రవహించాలి. కానీ ఎగువ కాఫర్ డ్యామ్‌లో వదిలిన ఖాళీలు... అంటే 680 మీటర్ల వెడల్పునే ప్రవహించాల్సి వచ్చింది. దాంతో ఉద్ధృతి ఎక్కువై ఇసుక కోతకు గురైంది. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో రెండు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఇదే అంశాన్ని శాసనసభలో సీఎం చెప్పారు. దీన్ని వివరించి... తప్పు ఎవరిదని ఏ సామాన్యుడిని ప్రశ్నించినా.. చంద్రబాబుదేనని ఠక్కున సమాధానం చెబుతారు. ఒక్క రామోజీ తప్ప.

గ్యాప్‌లు పూడిస్తే కాఫర్ డ్యామ్‌లు కొట్టుకుపోవా?

ఈనాడు
2019, మేలో ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఉంచిన గ్యాప్‌లను సకాలంలో పూడ్చకపోవడం వల్లే విధ్వంసం జరిగిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు తేల్చిచెప్పారు. 2020లో గోదావరికి భారీ వరదలు సంభవించాయి. 22 లక్షల క్యూసెక్కుల కుపైగా ప్రవాహాలతో కాఫర్ డ్యామ్ దిగువన, ప్రధాన డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2 ప్రాంతాల్లో భారీ ఎత్తున ఇసుక కోత పడిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు తేల్చారు.

వాస్తవం: 2014, జూన్ 8 నుంచి 2019, మే 29 వరకూ చంద్రబాబే అధికారంలో ఉన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి 2016, డిసెంబర్ 30 వరకూ అంటే 31 నెలలపాటు పోలవరంలో చంద్రబాబు తట్టెడు మట్టి పోయించింది లేదు. నిర్మాణ బాధ్యతలను కేంద్రమే తీసుకున్నా... ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్‌ను అడ్డంపెట్టుకుని పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి.. కాంట్రాక్టర్లకు బాగా మిగిల్చి, అధికంగా కమీషన్లొచ్చే ఈజీ పనులకే చంద్రబాబు ప్రాధాన్యమిచ్చారు. పైన స్పిల్ చానెల్ పూర్తి చేసి... స్పిల్ వే నిర్మిస్తే నీరు అటు మళ్లుతుంది. అప్పుడు కాఫర్ డ్యామ్‌లు నిర్మించి ప్రధాన డ్యాం పనులు చేపడితే ఇబ్బందులుండవు. కానీ స్పిల్ వే పునాది స్థాయిలో ఉన్నప్పుడే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు చేపట్టారు చంద్రబాబు. వాటిని కూడా పూర్తి చేయలేక చేతులెత్తేశారు. చివరకు ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీలు (300 మీటర్లు, 380 మీటర్లు చొప్పున) వదిలేశారు.

జగన్ సీఎంగా 2019, మే 30న బాధ్యతలు స్వీకరించారు. వెంటనే... అంటే జూన్ 14 నాటికే గోదావరి వరద పోలవరాన్ని ముంచెత్తింది. ఎలాంటి పనులూ చేయలేని పరిస్థితి. ఆ 15 రోజుల్లో... చంద్రబాబు ఐదేళ్లలో పూర్తి చేయలేని పనిని సీఎం వైఎస్ జగన్ చేయగలరా? హైదరాబాద్ ఐఐటీ నిపుణులు సకాలంలో పనులు పూర్తి చేయలేదని ఎత్తిచూపింది చంద్రబాబు సర్కార్‌నే. కానీ.. దాన్ని రామోజీ వక్రీకరించి.. వైఎస్ జగన్ సర్కార్‌పైకి నెట్టడానికి గోబెల్స్‌ను తలదన్నే రీతిలో చెప్పిన అబద్ధాన్నే పదే పదే చెబుతున్నారు.

పైపెచ్చు కాఫర్ డ్యామ్‌లో ఖాళీలు పూడ్చకపోవటం వల్లే ప్రాజెక్టులో విధ్వంసం జరిగిందని, దాన్ని పూడ్చేసి ఉంటే ఇబ్బందులుండేవి కావని మార్గదర్శితో ముందిని ముంచిన నిపుణుడి సలహా. ఎగువన స్పిల్ చానెల్ ద్వారా స్పిల్ వేకి ప్రవాహాన్నింకా అప్పటికి మళ్లించలేదు. అలా చేయకుండా కాఫర్ డ్యామ్ ఖాళీలు పూడ్చేస్తే మొత్తం నీరు నిండి కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయేది కాదా? కాఫర్ డ్యామ్ అంటే జస్ట్ మట్టి కట్ట. కిందకు పోయే దారి లేక అంతటి నీరు నిల్వ ఉంటే ఆ కాఫర్ డ్యామ్ తట్టుకోగలదా? ఇదేనా రామోజీ నీకు నిపుణులు చెప్పింది? ఇంతకీ ఎవరా నిపుణులు?

పనుల్లో తీవ్ర జాప్యం చేసిందెవరు?

ఈనాడు
సరైన సమయంలో దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని పీపీఏ తప్పు పట్టిన మాట వాస్తవం కాదా?

వాస్తవం: ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయలేక.. చంద్రబాబు సర్కార్ వదిలేసిన గ్యాప్‌ల వల్ల గోదావరి అధిక ఉద్ధృతితో ప్రవహించడం వల్ల దిగువ కాఫర్ డ్యామ్ 0 మీటర్ల నుంచి 640 మీటర్ల వరకూ కోతకు గురైంది. ఆ ప్రాంతంలో జెట్ గ్రౌటింగ్ చేస్తూ.. జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి.. వాటిని అగాధం ఏర్పడిన ప్రాంతంలో వేసి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చి.. 30.5 మీటర్ల ఎత్తుతో ఈ ఏడాది జూలై 31 నాటికి పూర్తి చేయాలని ఏప్రిల్ ఆఖరులో పీపీఏ, డీడీఆర్పీ, సీడబ్ల్యూసీలు సూచించాయి. జియో మెంబ్రేన్ బ్యాగ్స్ వినియోగం తక్కువ. వాటి లభ్యత కూడా అంతంత మాత్రమే. అయినా సరే గుజరాత్, అస్సాంలలో వాటిని ఉత్పత్తి చేసే సంస్థలకు ఆర్డర్ ఇచ్చి.. 2.50 లక్షల జియో మెంబ్రేన్ బ్యాగ్స్‌ను సేకరించారు. జెట్ గ్రౌటింగ్ విఫలమవుతుండటంతో ఎక్కువ సమయం తీసుకోవడంతో పాటు కష్టమైన పాలీ యురిథేన్ (పీయూ) గ్రౌటింగ్ చేస్తూ.. జూలై 9 నాటికే 20 మీటర్ల ఎత్తుకు దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. గోదావరికి అనుకోకుండా ఈ సారి వరదలు ముందే వచ్చాయి. దీంతో జూలై 10న అర్ధరాత్రి స్పిల్ వే నుంచి దిగువకు విడుదలైన వరద దిగువ కాఫర్ డ్యామ్ మీదుగా ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలోకి చేరి నిర్మాణ పనులను ముందుకెళ్లకుండా చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో జూలై 31 నాటికి దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయడం ఎలా సాధ్యం రామోజీరావ్? ఇదే అంశాన్ని పీపీఏకు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వివరించారు. వరదలు తగ్గాక.. యుద్ధ ప్రాతిపదికన దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేస్తామని ఇచ్చిన వివరణతో పీపీఏ సంతృప్తి చెందింది. వరదల్లోనూ పనులు చేస్తూ.. పూర్తి చేసినట్లు గ్రాఫిక్స్‌ను సృష్టించి.. అదే నిజమని నమ్మబలికే చంద్రబాబే అబద్ధాల్లో మీకు సరైన జోడీ.


కళ్లుండి చూడలేకపోతే ఎలా?

ఈనాడు
అప్రోచ్ ఛానల్ పూర్తి చేశామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. కానీ.. ఇప్పటికీ పూర్తి కాలేదు. సులువుగా జరిగే మట్టి తవ్వకం పనులూ చేయలేదు. 2019లో సీఎం వైఎస్ జగన్ తొలి సమీక్ష నిర్వహించే నాటికే ప్రధాన డ్యామ్ పనులు 64.08 పనులు పూర్తయ్యాయి. తాజా నివేదికల ప్రకారం 76 శాతం పనులు పూర్తయ్యాయి. మూడేళ్లలో 12 శాతం పనులు చేయడాన్ని గణనీయమైన ప్రగతి అంటారా?

వాస్తవం: చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దితూ పోలవరం ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు. కరోనా వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు సమయంలో 48 గేట్లతోసహా స్పిల్ వేను పూర్తి చేశారు. అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి.. 2021, జూన్ 11న 6.1 కిమీల పొడవున గోదావరి ప్రవాహాన్ని మళ్లించారు. ఇది గణనీయమైన ప్రగతి కాదా? కళ్లుండి చూడలేకపోతే ఎలా రామోజీ..? అధికారంలో మీ బాబు ఉంటే ఇవన్నీ మీకు త్రీడీలో కనిపించేవేమో!!. మీ బాబు గ్రాఫిక్స్ చూపించినా ప్రాజెక్టును పూర్తి చేసినట్లు బాకాలూదటంలో ఆరితేరిన మీకు తస్మదీయుడు సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసిన పనులు కన్పించకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు.

పునరావాసానికి పెద్దపీట..

ఈనాడు
పీపీఏ లెక్కల ప్రకారం 9,229 మందికే పునరావాసం కల్పించారు. ఇంకా 9,390 మందిని తరలించాలి. ఇందుకు ఇంకా రూ.2173.61 కోట్లు అవసరం. నిజానికి పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ 41.15 మీటర్ల స్థాయికి పూర్తి చేయడానికి ముందే వీరికి పునరావాసం కల్పించాలి.



వాస్తవం: *41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో 20,946 కుటుంబాల ప్రజలు నిర్వాసితులు అవుతారు. ఇందులో 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకముందే 207 కుటుంబాలకు రూ.44.77 కోట్ల వ్యయంతో పునరావాసం కల్పించారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ సర్కార్ హయాంలో 3073 కుటుంబాలకు రూ.193 కోట్లతో పునరావాసం కల్పించారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని వారికి చంద్రబాబు సర్కార్ పునరావాసం కల్పించకుండా ఎగువ కాఫర్ డ్యామ్ పనులు చేస్తుంటే అప్పట్లో అది 'ఈనాడు'కు కనిపించనే లేదు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తే కమీషన్లు రావన్న ఉద్దేశంతోనే చంద్రబాబు వాటిని పట్టించుకోలేదన్నది రామోజీ తప్ప జగమెరిగిన వాస్తవం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ మూడేళ్లలో 10,330 నిర్వాసితుల కుటుంబాలకు రూ.1773 కోట్లతో పునరావాసం కల్పించారు. మిగతా 6,836 కుటుంబాలకు పునరావాసం కల్పించే పనులు శరవేగంగా సాగుతుండటం కళ్లున్న కబోది రామోజీకి కన్పిస్తాయనుకోవడం అత్యాశే.*

బొమ్మలు చెక్కిన శిల్పం

బొమ్మలు కూడా మాట్లాడతాయి. మాట్లాడ్డమే కాదు జనం తరఫున పోట్లాడతాయి. కత్తులు దూస్తూ ముందుకు ఉరుకుతాయి. కదం తొక్కుతూ పరుగులు తీస్తాయి. రాజుగారి దురహంకారాన్ని ఎడంకాలితో తన్ని పారేస్తాయి. అయితే అన్ని బొమ్మలూ అలా చేయవు. బొమ్మకు ప్రాణం పోసే చేయిని బట్టి, ఆ చేతిని కదిపే కళాకారుడి మనసును బట్టి, ఆ మనసులో రెపరెపలాడే ఎర్ర జెండా పొగరును బట్టి బొమ్మలు కాలర్లు ఎగరేస్తాయి. అలాంటి బొమ్మల తాలూకు ఓనర్లలో ముఖ్యులు ఆర్టిస్ట్ మోహన్.

తాడి మోహన్ రావు అంటే ఎవ్వరికీ తెలీకపోవచ్చు. కానీ కార్టూనిస్ట్ మోహన్ అంటే మాత్రం తెలీని వాళ్లు ఉండరు. మోహన్ అంటే సకల కళా వల్లభుడు. కార్టూన్లు, ఇలస్ట్రేషన్లు, కేరికేచర్లు, కవర్ పేజీ బొమ్మలు, ఉద్యమాలకు కదం తొక్కండర్రా అని కుర్రకారు గుండెల్లో పౌరుషాగ్ని రగిలించే పోస్టర్లు, రాజ్యాధికారపు దురహంకారాన్ని కాలరు పట్టుకుని నిలదీసి తిరుగుబాటు చేసే జెండాలపై బొమ్మలు, బిగించిన పిడికిళ్లు, కస్సుమని దూసుకుపోయే కొడవళ్లు, యుద్ధభూమికి కదం తొక్కించే లాంగ్ మార్చ్ కాన్వాస్‌లు! మోహన్ అంటే యుద్ధం. అధర్మంపై అన్యాయంపై చిరునవ్వుతోనే కత్తులు దూసే యుద్ధమే మోహన్!



కార్టూనిస్ట్ మోహన్

ఎక్కడో ఏలూరులో పుట్టి, అక్కడెక్కడో పశ్చిమబెంగాల్‌లో జ్ఞానానికి సానపట్టి, విజయవాడ 'విశాలాంధ్ర' మీదుగా హైదరాబాద్‌కు తరలి అదే రాజధానిగా కళాకారుల సామ్రాజ్యాన్ని స్థాపించాడు మోహన్. తెలుగునాట పొలిటికల్ కార్టూన్ అంటే ఇలా ఉండాలిరా నాయనా అన్నట్లు వందల వేల కార్టూన్లతో రాజకీయ నేతల గుండెల్లో అణుబాంబులు పేల్చిన ఉగ్రవాది మోహన్. ఎంత పెద్ద నాయకుడైనా సరే భయం లేదు. ఎంత దుర్మార్గపు నాయకుడైనా సరే ఖాతరే లేదు. తిట్టాలనుకుంటే తిట్టేయడమే. కోపం పెద్దదైతే లాగి లెంపకాయలు కొట్టేయడమే. ఎన్టీఆర్ నుండి నేటి కేసీయార్ వరకు మోహన్ కార్టూన్ బారిన పడని నేత లేరు.

మోహన్ తండ్రి తాడి అప్పలస్వామి కమ్యూనిస్టు నాయకులు. నాన్న నీడలో మండుటెండవు ఉద్యమాలు మోహన్‌లోని కళాకారుడికి చిన్నప్పుడే ఓ కర్తవ్య బోధ చేసేశాయి. అదే 5 దశాబ్దాల పాటు తెలుగు నాట ఉద్యమ పోస్టర్లపైనా, తిరుగుబాటు జెండాలపైనా పిడికిళ్లు బిగించిన యోధుల విప్లవ నినాదాలు, కసి ఎక్కిన కొడవళ్ల బెదిరింపులు వగైరాల ఎర్రెర్రటి బొమ్మల రూపంలో మోహన్ సంతకం మెరుస్తూనే ఉంది.


ప్రభువెక్కిన పల్లకీలు మోసి, వారి అంతఃపుర రాణుల అందాలు పొగిడి వారిచ్చే చిల్లర బహుమతులు మూటకట్టుకుని మురిసిపోయే కళాకారులు కాలగర్భంలో కలిసి పోతారు. ఎవరికీ గుర్తుకు కూడా రారు. పల్లకి నెక్కిన ప్రభువును కాలర్ పట్టుకుని నీ రాజ్యం చాలా అన్యాయంగా ఉంది గురూ అని అనగలిగిన వాడే నిఖార్సయిన వీరుడు. అసలు సిసలు యోధుడు. అలాంటి వారినే తరతరాలుగా జనం గుర్తు పెట్టుకుంటారు. గుర్తు పెట్టుకోవడమేం ఖర్మ గుండెల్లో గుడి కట్టేసి ఆ గుడిలో ఏనిమేషన్ సినిమాలతో పూజలు చేసేస్తారు. అటువంటి అరుదైన యోధుడూ, కళాకారుడూ మన మోహన్!

– సీఎస్ఎస్ యాజులు ı 95055 55384

(నేడు చిత్రకారుడు మోహన్ వర్ధంతి)

రజాకార్ల అకృత్యాలనూ నివేదిస్తూ...


సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

సెప్టెంబర్ 17వ తేదీ కేంద్రంగా రకరకాల వాదనలు వినిపిస్తున్న తరుణంలో హైదరాబాద్ నిజామ్ అనుకూలురు నిర్వహించిన 'మీజాన్' పత్రిక గురించి చెప్పుకోవాలి. నిజామ్ సన్నిహితుడయిన ఖాన్ బహదూర్ అహ్మద్ నవాజ్ జంగ్ అల్లుడైన గులాం అహ్మద్ కలకత్తావాలా ఈ పత్రికను 1943–1947 మధ్య హైదరాబాద్ నుంచి నడిపారు. బొంబాయి వ్యాపారవేత్త కలకత్తావాలా పత్రికల స్థాపన ప్రతిపాదన తీసుకురావడంతో... అప్పటికే ప్రజానాడి తెలుసుకోవడానికి పత్రికలు పెడితే బాగుంటుందని భావిస్తున్న నిజామ్ వెంటనే అనుమతించాడు.

త్రాసు అని అర్థం వచ్చే అరబిక్ పదం 'మీజాన్' పేరుగా నిర్ణయించి 1943లో ఇంగ్లిష్, ఉర్దూ భాషలలో రెండు పత్రికలను ఒకేసారి ప్రారంభించారు. నాలుగు పేజీలతో వెలువడిన ఈ పత్రిక వెల అణాగా ఉండేదట. మరుసటి సంవత్సరం తెలుగు భాషలో కూడా మొదలైంది. తెలుగు 'మీజాన్'కు సంపాదకులు ఉర్దూ తెలియని అడివి బాపిరాజు. ఈ మూడు భాషల పత్రికల విధానాల గురించి తెలుగు పత్రిక సంపాదక వర్గంలో పనిచేసిన పండితులు తిరుమల రామచంద్ర 1994లో రాసిన ఓ వ్యాసంలో ఇలా అంటారు – ''ఇంగ్లిష్, ఉర్దూ, తెలుగు మూడింటివీ మూడు విడివిడి విధానాలు. ఇంగ్లిష్ నిజామ్ ప్రభుత్వాన్ని సమర్థించేది. ఉర్దూ రజాకార్లను సమర్థించేది. తెలుగు మీజాన్ నిజామ్ వ్యతిరేక శక్తులను సమర్థించేది. అప్పుడు నిజామ్‌ను ఎదిరించి పోరాడుతున్న ప్రజాసంస్థ రావి నారాయణరెడ్డిగారి నాయకత్వంలో ఉన్న ఆంధ్ర మహాసభ కనుక దానిని సమర్థించేది. ఇతర ప్రజాసంస్థల వార్తలను బాగా ప్రచురించేది.''



కొన్ని కొన్ని సందర్భాలలో తెలుగు 'మీజాన్' చేసిన సాహసాలు పెద్దవనే చెప్పాలి. 19 సంవత్సరాల దొడ్డి కొమరయ్య 1946 జులై 4న అమరుడైనపుడు కమ్యూనిస్టు నాయకుడు దేవులపల్లి వెంకటేశ్వర రావు 1946 జూలై 25న 'కడవెండి దినం'గా సభలు, సమావేశాలు జరపమని పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన అడివి బాపిరాజు జూలై 25వ తేదీ తెలుగు 'మీజాన్' పత్రికను దొడ్డి కొమరయ్య ప్రత్యేక సంచికగా వెలువరిస్తూ ఆ రోజు పత్రిక మొత్తం సంబంధిత వార్తలు, ఫోటోలు, వ్యాఖ్యానాలతో నింపి ప్రచురించడం సాహసమే.

ఆకునూరు, మాచిరెడ్డి పల్లెలలో రజాకార్ల దుండగాలు తారస్థాయికి చేరినపుడు... ఆ బీభత్స దృశ్యాలను తెలుగు 'మీజాన్' ఫోటోలతో సహా ఉన్నదున్నట్లు ప్రచురించింది. ఈ వార్తలతో పోలీసులు, ప్రభుత్వ అధికారులు మండిపడ్డారు. సరోజినీనాయుడు కుమార్తె పద్మజా నాయుడు ప్రత్యక్షంగా ఆ గ్రామాలకు వెళ్లి చూసి తయారు చేసిన రిపోర్టు... ఆ అకృత్యాలు ఊహకు మించిన స్థాయిలో ఉన్నాయని బోధపరిచింది. ఈ నివేదికను తెలుగు 'మీజాన్' యథాతథంగా ప్రచురించింది. దీనిని ఖండిస్తూ ప్రభుత్వ సమాచార శాఖ జారీ చేసిన ప్రకటనతోపాటు దురంతాలనూ పక్కపక్కనే తెలుగు 'మీజాన్' ప్రచురించింది.

తెలుగు 'మీజాన్'లో అచ్చయిన, ఆ ప్రకటన పట్టుకుని పద్మజా నాయుడు వార్ధా వెళ్ళి గాంధీజీకి చూపించింది. గాంధీజీ విచలుడై పోయాడు. వెంటనే ప్రెస్ కాన్ఫరెన్సుకు పిల్చి ఆ ప్రకటన వారికిచ్చారు. గాంధీజీ ద్వారా ఆకునూరు, మాచిరెడ్డి పల్లి దురంతాలు ప్రపంచానికి తెలిశాయి. కేవలం మూడు నాలుగేళ్ళు 'స్వాతంత్ర్యమూ, సమత్వమూ, సౌభ్రాతృత్వమూ' ట్యాగ్‌లైన్‌గా వెలువడిన తెలుగు 'మీజాన్' చరిత్ర నిజంగా ఘనమైనదే.

వ్యాసకర్త ఆకాశవాణి పూర్వ సంచాలకులు ı 94407 32392

(రేపు అడివి బాపిరాజు వర్ధంతి)

సజ్జన సాంగత్యం

ఓ గురువును ఆయన శిష్యులు, సజ్జనులతో కలిసుండటం వల్ల కలిగే మేలేమిటి అని అడిగారు. గురువు వారిని ఓ కొలను వద్దకు తీసుకుపోయి ఓ చిన్న రాయి తీసి కొలనులో విసిరారు. అది నీటిలో మునిగిపోయింది. అనంతరం అక్కడి నుంచి ఆయన శిష్యులను తెప్పోత్సవం జరుగుతున్న చోటుకు తీసుకుపోయారు. అక్కడున్న తెప్పను చూపించి అది తాను కొలనులో విసిరిన రాయి కన్నా పెద్దదైనా ఎందుకు మునగకుండా తేలియాడుతుందో చెప్పమన్నారు. ఎవరూ సరైన సమాధానం చెప్పలేకపోవడంతో గురువు గారు 'రాయి ఒంటరి కావడంతో అది చిన్నదైనా మునిగిపోతుంది. తెప్ప పెద్దదయినప్పటికీ తేలియాడే గుణమున్న కట్టెలతో కలిసి ఉండటం వల్ల అది కూడా తేలియాడుతోంది. అలాగే మంచివాడై ఉండి ఒంటరిగా ఉంటే కొంతకాలానికే కనిపించకుండా పోతాడు. అదే మంచితనం నిండుగా లేకున్నా మంచి వారి సహవాసంతో ఈ లోక మాయలో చిక్కుకోరు' అని చెప్పారు.

జ్యోతిర్మయం

శిష్యులకు నిజం అర్థమైంది. సజ్జనుల సాంగత్యం ఎప్పటికీ ముప్పు కాదు. ఓ మంచి బాటలో సాగిపోవడానికి ఓ వెలుగు లాంటిది సజ్జన సాంగత్యం. కనుక నిరంతరం సజ్జన సాంగత్యంతో వేసే అడుగు మంచికే దారి చూపుతుంది తప్ప దారి తప్పనివ్వదు.

– యామిజాల జగదీశ్

బెంగాల్ వైపు మళ్లిన అల్పపీడనం

- ఆపై ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనం
- కోస్తాలో నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వైపు మళ్లింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా పయనించనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. అల్పపీడనం పశ్చిమ బెంగాల్ వైపు మళ్లడంతో మంగళవారం రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. గడిచిన 24 గంటల్లో కొమరిపాలెంలో 7.5 సెంటీమీటర్లు, ఏలూరులో 6.2, సర్వేలలో 5.7, ఆకివీడులో 5.4, పాలకొల్లులో 5, ఇచ్ఛాపురంలో 4.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడ్డాయి.

టీటీడీకి ముస్లిం దంపతుల రూ.1.02 కోట్లు విరాళం

తిరుమల: చెన్నైకి చెందిన సుబీనాబాను, అబ్దుల్ ఘనీ దంపతులు టీటీడీకి రూ.1.02 కోట్లు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో దాతలు విరాళం చెక్కును టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఇందులో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.15 లక్షలు, ఇటీవల తిరుమలలో ఆధునీకరించిన శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో నూతన ఫర్నిచర్, వంటశాలలో పాత్రలకు రూ.87 లక్షలు విరాళంగా అందజేశారు.


విరాళాన్ని ఈవోకి అందజేస్తున్న దాతలు

కొత్తపేట శిల్పశాలలో కృష్ణంరాజు విగ్రహం

హైదరాబాద్‌లో నేడు జరిగే దశదినకర్మ కోసం రూపకల్పన

కొత్తపేట: ప్రముఖ సినీ నటుడు, కేంద్ర మాజీ మంత్రి, రెబల్‌స్టార్ ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు విగ్రహం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట వుడయార్ ఫైన్ ఆర్ట్స్ (వుడయార్ శిల్పశాల)లో తయారైంది. ఈ నెల 11న కృష్ణంరాజు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన దశదిన కర్మ కార్యక్రమాలను కృష్ణంరాజు కుటుంబ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కృష్ణంరాజు విగ్రహం తయారు చేయాలని ఆయన కుటుంబీకులు ప్రముఖ జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్‌ను కోరారు. ఆ మేరకు సిలికాన్ వ్యాక్స్ మెటీరియల్‌తో 4 రోజుల్లో విగ్రహం రూపొందించినట్లు శిల్పి తెలిపారు. దీనిని మంగళవారం రాత్రి హైదరాబాద్ పంపిస్తున్నారు. సినిమాల్లో కృష్ణంరాజు పోషించిన వివిధ పాత్రల రూపాలతో విగ్రహాలు తయారు చేయనున్నట్టు రాజ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయన అభిమానులు, క్షత్రియ పరిషత్‌ల సభ్యులు ఇప్పటికే తనను సంప్రదించి తాండ్ర పాపారాయుడు, బ్రహ్మనాయుడు, బొబ్బిలి బ్రహ్మన్న వంటి వివిధ రూపాలతో కృష్ణంరాజు విగ్రహాలు రూపొందించాలని కోరినట్లు తెలిపారు. ఆ మేరకు ముందుగా ఆయా రూపాల నమూనాలు తయారు చేయనున్నట్లు చెప్పారు.


కొత్తపేట శిల్పశాలలో కృష్ణంరాజు విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న శిల్పి రాజ్‌కుమార్

బిహార్‌లో సిక్కోలు యువకుడి కిడ్నాప్

రూ.లక్ష ఇచ్చి విడిపించుకున్న కుటుంబ సభ్యులు

మందస : శ్రీకాకుళం జిల్లా మందస మండలానికి చెందిన ఓ గిరిజన యువకుడిని బీహార్ గ్యాంగ్ కిడ్నాప్ చేసింది. కుటుంబ సభ్యులు రూ.లక్ష ఇచ్చి ఆ యువకుడిని విడిపించుకున్నారు. మందస మండలంలోని బుడారిసింగి పంచాయతి, పెడంగో గిరిజన గ్రామానికి చెందిన మజ్జి భరత్‌ సెంట్రింగ్ పనుల కోసం ఈ నెల మొదటి వారంలో ఒడిశాలోని భువనేశ్వర్ వెళ్లాడు. భువనేశ్వర్ వెళ్లిన రెండు రోజుల వరకు ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడిన భరత్‌ ఆ తర్వాత ఆచూకీ లేకుండాపోయాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. దీంతో అతని తండ్రి ఉద్ధవ ఈ నెల 9వ తేదీన మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత మూడు రోజులకు బీహార్ నుంచి భరత్‌ తల్లిదండ్రులకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి 'మీ కుమారుడిని కిడ్నాప్ చేశాం. రూ.3 లక్షలు ఇస్తేనే వదిలిపెడతాం...' అని చెప్పాడు. భయాందోళనలకు గురైన భరత్‌ కుటుంబ సభ్యులు వెంటనే తమ 70 సెంట్ల భూమిని విక్రయించి డబ్బు తీసుకున్నారు. భరత్‌ బావ, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు, ఇద్దరు డ్రైవర్లు కలిసి డబ్బులు తీసుకుని ఓ వాహనంలో బీహార్ వెళ్లారు. అక్కడకు వెళ్లాక కిడ్నాపర్లు సరైన చిరుమానా చెప్పకుండా ఫోన్ పే ద్వారా రూ.95వేలు బదిలీ చేయించుకున్నారు. భరత్‌ వద్ద ఉన్న రూ.5వేలతోపాటు ఆధార్, పాన్, ఏటీఎం, వస్తువులు కూడా లాక్కుని పట్నా సమీపంలోని గుర్తుతెలియని ప్రదేశంలో అతడిని వదిలేశారు. చివరకు భరత్‌ ఆచూకీని పాట్నా వద్ద కనిపెట్టిన కుటుంబ సభ్యులు అతడిని బీహార్ నుంచి మంగళవారం తీసుకువచ్చారు. బిహార్‌లో పని ఉందని సలీం అనే వ్యక్తి తనను భువనేశ్వర్ నుంచి తీసుకువెళ్లినట్లు భరత్‌ తెలిపాడు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని చెబుతున్నాడు.


తల్లిదండ్రుల చెంతకు చేరుకున్న మజ్జి భరత్‌

ఏవోబీలో అప్రమత్తం

- నేటి నుంచి మావోయిస్టుల 18వ వార్షికోత్సవాలు
- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు

సాక్షి, పాడేరు/జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ 18వ వార్షికోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపు ఇచ్చారు. దీంతో పోలీసు యంత్రాంగం ఏవోబీ వ్యాప్తంగా అప్రమత్తమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రం ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్‌లతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని పోలీసు యంత్రాంగమంతా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మారుమూల ప్రాంతాల్లో కూంబింగ్ చర్యలను విస్తృతం చేయడంతో పాటు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లు, అవుట్‌పోస్టులు, ఒడిశాలోని కటాఫ్ ఏరియాలోని అవుట్‌పోస్టుల్లో రెడ్ అలెర్ట్‌ను అమలు చేస్తున్నారు. మావోయిస్టుల కార్యకలాపాలను నిరోధించడమే లక్ష్యంగా ఏవోబీ వ్యాప్తంగా ఇప్పటికే ప్రత్యేక పోలీసు బలగాలు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఏవోబీ వ్యాప్తంగా అదనంగా పోలీసు బలగాలు మోహరించాయి. మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో వాహనాల తనిఖీలను పోలీసులు విస్తృతం చేశారు. ఒడిశా సరిహద్దులో ఉన్న సీలేరు, ముంచంగిపుట్టు, పెదబయలు, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చింతూరు ప్రాంతాల్లో పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ మరింత అప్రమత్తం చేశారు. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలు ముగిసేంత వరకు పోలీసు యంత్రాంగం వ్యూహాత్మకంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది.


సీలేరు, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రామకృష్ణ, ఇతర సిబ్బంది

మావోయిస్టు పార్టీని శక్తివంతం చేస్తూ వార్షికోత్సవాలు

మావోయిస్టు పార్టీని శక్తివంతం చేసుకుంటూ ఈ నెల 21 నుంచి 27 వరకు పార్టీ 18వ వార్షికోత్సవాలను నిర్వహించుకుందామని ఆంధ్ర–ఒడిశా బోర్డర్ (ఏవోబీ) స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరుతో మీడియాకు మంగళవారం ఓ ప్రకటన అందింది. విప్లవ ప్రతిఘాతుక సమాధాన్–ప్రహార్ దాడిని ఓడించాల్సిందిగా అందులో పేర్కొన్నారు. శత్రువు కొనసాగిస్తోన్న మానసిక యుద్ధాన్ని, లొంగుబాటు ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమాధాన్–ప్రహార్ దాడులను ధైర్యసాహసాలతో ఎదుర్కొంటూ ఈ ఏడాది దేశ వ్యాప్తంగా పలు స్థాయిలకు చెందిన 124మంది మావోయిస్టులు అమరులయ్యారని పేర్కొన్నారు. అమరుల్లో కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఏపీ, ఏవోబీ ఉద్యమాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించిన రామకృష్ణతో పాటు విప్లవ సాంస్కృతిక సేనాని దప్పు రమేష్, ఎంకేబీ డివిజన్ కమిటీ సభ్యుడు అనిల్, ఏసీఎం సోని, పీఎం చిన్నారావు ఉన్నారని తెలిపారు. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా ద్వారానే నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలమని పేర్కొన్నారు.

- అమరావతి పేరుతో దొంగ యాత్రలు చేస్తున్న బాబు అండ్ కోను ప్రజలు నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 723వ రోజుకు చేరాయి.

వైఎస్ జగన్ సర్కార్‌లోనే తెలుగు భాషాభివృద్ధి

రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తెలుగు భాషాభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు చేయని ఎన్నో మంచి పనులను వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిందని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. ఆయన మంగళవారం శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మూసివేసిన తెలుగు అకాడమీ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు చేసిందన్నారు. మైసూరులో ఉన్న తెలుగు భాష ప్రాచీన అధ్యయన కేంద్రాన్ని నెల్లూరుకు తరలించడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెప్పారు. ఈ సంస్థ కోసం నెల్లూరులో 5 ఎకరాల భూమిని కూడా కేటాయించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు, శిలాఫలకాలను తెలుగులోనే రాసేలా కృషి చేస్తున్నామన్నారు. ఆంగ్ల మాధ్యమ విద్యాసంస్థల్లోనూ తెలుగును బోధించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ.25 కోట్ల మూలధనంతో 'తెలుగు భాషాభివృద్ధి నిధి'ని ఏర్పాటు చేశామని వివరించారు.

బొత్స ఝాన్సీకి ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థిని, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఆమెకు ఇది రెండో డాక్టరేట్. గతంలో తత్వశాస్త్ర విభాగంలో పరిశోధన జరిపి డాక్టరేట్ అందుకున్నారు. లా కాలేజీ విశ్రాంత ఆచార్యులు డి.సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ పంచాయతీ రాజ్ ఇన్‌ఇండియా– ఏ సోషియో లీగల్ స్టడీ విత్ రిఫరెన్స్ టు నార్త్ ఆంధ్ర' అంశంపై జరిపిన పరిశోధనకు ఇప్పుడు ఆమెకు డాక్టరేట్ లభించింది. సోమవారం ఏయూ వీసీ ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఆమె స్వీకరించారు.


డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న బొత్స ఝాన్సీ

ఫారం-సి

(10 ఏ మినహాయింపు ఇచ్చినపుడు చట్టములోని 11 వ విభాగము క్రింద)
(6/12 నియమము చూడండి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రెవెన్యూ(ఎల్.ఏ.) శాఖ

శ్రీయుత జిల్లా కలక్టరు, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం వారు జారీచేయుచున్న ప్రకటన

రిఫ.నెం. GEN/G4/202/2021 — తేది : 14.09.2022

ప్రజా ప్రయోజనము అనగా అయినవిల్లి గ్రామము, అయినవిల్లి మండలం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 400/132 KV AIS సబ్-స్టేషన్ నిర్మాణం నిమిత్తం అయినవిల్లి గ్రామము, అయినవిల్లి మండలం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని మొత్తం ఏ 21.32 సెంట్లు భూమి అవసరమని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం/కలక్టరు భావిస్తున్నారు.

అందువల్ల పైన పేర్కొనబడిన ప్రాజెక్టు కొరకు అయినవిల్లి గ్రామం, అయినవిల్లి మండలం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దాదాపు ఏ 21.32 సెంట్లు అంటే 8.63-5 హెక్టార్ల ప్రామాణిక కొలతగం భూమిని సేకరణ కోసం ప్రతిపాదించబడినదని ప్రకటించడమైనది.

సవివర వివరణ ఈ దిగువ విధముగా ఉన్నది.

షెడ్యూల్

గ్రామము : అయినవిల్లి — మండలం : అయినవిల్లి — జిల్లా: డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

వ. సంఖ్య	సర్వే నెంబర్	భూమి రకం	సేకరణ విస్తీర్ణం ఏ.సెంట్లు	ఆస్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు: రకం	సంఖ్య	నిర్మాణాలు: రకం	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	323-2	GW	1.13		333-3	322-1	323-1	330-1, 324-1	కొబ్బరి	48	లేవు	లేవు
	324-1	GD	1.00		330-1, 330-2	324-1	323-2	328-1	కొబ్బరి	10	లేవు	లేవు
	329-1	GD	0.21		Road	329-2	331-6	329-4	టేకు	48	పాత బిల్డింగ్	8*9 మీటర్స్
	329-2	GD	0.60		329-1	328-1	330-2	329-3	కొబ్బరి-	22		
	329-3	GD	1.76		329-4	328-1	329-2	327	మామిడి సపోటా వేప	7 2 1		
	330-1	GD	1.00	తోటకూర వెంకట పద్మావతి భర్త టి.వి.ఎస్.ఎస్ రాజు	330-1	324-1	323-2	330-2	కొబ్బరి టేకు	29 2	లేవు	లేవు
	331-2	GD	0.56		331-2	330-1	333-3	331-3	కొబ్బరి వేప	33 1	లేవు	లేవు
	331-3	GD	2.08		331-3	330-2	331-2	331-5	కొబ్బరి	37	లేవు	లేవు
	331-4	GD	0.06		Road	331-3	331-3	331-4	వరి		లేవు	లేవు
	333-3	GD	1.61		Road	323-2	333-3	331-1,2	కొబ్బరి వేప	42 1	లేవు	లేవు
	331-5	GD	0.90		331/6	330/2	331/3	329/2	వరి		లేవు	లేవు
	333-3	GD	0.20		Road	323-2	333-3	331-1,2	వరి		లేవు	లేవు
	331-1	GD	0.82		Road	331-2	331-3	333-3	కొబ్బరి	14	లేవు	లేవు
	Total		10.83									
2	330 -2/C	GD	0.60	తోటకూర అనంతలక్ష్మి భర్త సత్యనారాయణరాజు	331-5	330-2	330-1	329-2	వరి		లేవు	లేవు
	331-5	GD	0.01		331-6	331-5	329	331-5	వరి		లేవు	లేవు
	322-1	GD	0.44		323-2	322-4	324-1	322-1	వరి		లేవు	లేవు
	Total		1.05								లేవు	లేవు
3	330-2A1	GD	0.50	కంఠంశెట్టి ఖేడిష భర్త శ్రీనివాసరావు	330/2	324/1	330/2	330/1	కొబ్బరి	5	లేవు	లేవు
4	328-1	GD	0.80	అద్దంకి పావ వెంకట రామారావు తండ్రి సూర్యనారాయణ	329/2	328	324/1	329/3, 328/1	వరి	-	లేవు	లేవు
5	328-4	GD	0.41	జిత్తుగ రాధ భర్త విజయ కుమార్	Road	329/3	329/3	328	వరి	-	లేవు	లేవు
6	331-5	GD	0.13	మానేపల్లి గణపతి తండ్రి సత్యనారాయణ	331/6	330/2	331/3	329/2	వరి	-	లేవు	లేవు
7	331-5	GD	0.16	మానేపల్లి వెంకాయమ్మ భర్త సత్యనారాయణ	331/6	331/5	329/3	331/5	టేకు, కొబ్బరి బత్తాయి	14 28 4	లేవు	లేవు
	331-8	GD	0.11		268	331/5	329/3	331/5	వేప	5	లేవు	లేవు
8	330-2D2	GD	0.30	ఎర్రాశెట్టి పద్మావతి భర్త సత్యనారాయణ	331/3	330/2	330/1	330/2	కొబ్బరి టేకు	33 2	లేవు	లేవు
9	330-2D1	GD	0.30	పసకాల వెంకటలక్ష్మి భర్త శ్రీనివాసరావు	331/3	330/2	330/1	330/2	కొబ్బరి	30	లేవు	లేవు
10	330-1	GD	0.18	మారెడ్డి అమ్మన్న తండ్రి మాచరయ్య	330-1	324-1	323-2	330-2	కొబ్బరి	8	లేవు	లేవు
	330-2A	GD	0.40		331/3	330/2	330/1	330/2	వరి	-	లేవు	లేవు
	330-2B	GD	0.50		331/3	330/2	330/1	330/2	వరి	-	లేవు	లేవు
	Total		1.08									
11	324-1	GD	0.40	కొమనాపల్లి సాయిబాబు తండ్రి సత్యనారాయణ	324/1	324/3	324/2	323/2	వరి		లేవు	లేవు
12	324-2	GD	0.74	మోకా ఇంద్రకుమారి భర్త సత్యనారాయణ	324-2	324-3	328-2	324-1	వరి		లేవు	లేవు
13	324-2	GD	0.72	పులపకూర జగత్ కళ్యాణి భర్త శ్రీరామమూర్తి	330-2	324-2	328-2	324-1	వరి		లేవు	లేవు
14	325-1	GD	0.16	పెరుకువాడ రాంబాబు తండ్రి వెంకన్న	328-5	325-3	326	325-1	వరి		లేవు	లేవు
15	325-2	GD	0.29	పెరుకోటి అమర్నాథ్ తండ్రి గనిరాజు	328-5	325-3	326	325-1	వరి		లేవు	లేవు
16	328-1	GD	0.40	గుద్దటి రమేష్ తండ్రి రాంబాబు	328-1	328-4	328-1	330-2	వరి		లేవు	లేవు
17	328-1	GD	0.50	అద్దంకి సాయి లక్ష్మి భర్త పావ వెంకట రామారావు	329-3	328-1	327	328-1	వరి		లేవు	లేవు
18	328-1	GD	0.24	గుబ్బల దుర్గాభవాని భర్త వెంకటేశ్వరరావు	328-1	328-4	327	330-2	వరి		లేవు	లేవు
19	328-2	GD	0.39	జిత్తుగ నాగూర్ తండ్రి నరసయ్య	330-2	325-1	325-3	324-2	వరి		లేవు	లేవు
	328-3	GD	0.02		328-3	328-2	328-4	328-2	వరి		లేవు	లేవు
20	328-2	GD	0.39	జిత్తుగ నరసింహమూర్తి తండ్రి వెల్లియ్య	330/2	325/1	328/2	324/1	వరి		లేవు	లేవు
	328-3	GD	0.02		328/1	328/3	328/4	328/3	వరి		లేవు	లేవు
	328-4	GD	0.28		328-1	328-4	327	328-4	వరి		లేవు	లేవు
	328-4	GD	0.10		328-1	328-4	328-4	328-4	వరి		లేవు	లేవు
21	328-4A	GD	0.42	పులి వెంకట భవాని భర్త సత్యనారాయణ	328-1	328-5	328-4	328-3	వరి		లేవు	లేవు
22	328-4	GD	0.30	యన్నపు సుబ్బమ్మ భర్త లక్ష్మణరావు	328-1	328-5	327	328-3	వరి		లేవు	లేవు
23	328-5	GD	0.15	అద్దాల సూర్యనారాయణ మూర్తి, తండ్రి చలమయ్య శాస్త్రి	328-4	325-2	328-5	328-2	వరి		లేవు	లేవు
24	328-5	GD	0.15	కాగిత సూర్యారావు తండ్రి నాగయ్య	328-4	325-2	327	328-5	వరి		లేవు	లేవు
	Total		21.32									

2013 భూసేకరణ పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2018 లోని 22 వ చట్టం) ద్వారా సవరించబడిన విధముగా 2013 భూసేకరణ పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2013 లో 30 వ చట్టం) లోని 11(1) వ విభాగములోని నిబంధనల క్రింద సంబంధితులందరికి ఈ ప్రకటనను జారీ చేయడమైనది.

పని గంటల సమయములో అనగా ఉ.10.30 గం.ల నుండి సా.5.00 గం.ల వరకు ఏదేని పని దినాన డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలక్టరు కార్యాలయం/శ్రీ రెవెన్యూడివిజనలు అధికారి, కొత్తపేట వారి కార్యాలయములో భూమి ప్రణాళికను తనిఖీ చేసుకొనవచ్చు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం/కలక్టరు -కమ్-సమ్మతిత ప్రభుత్వం సదరు చట్టములోని 12వ విభాగములో పొందుపరచి మరియు నిర్దిష్ట పరచినట్లుగా భూమిని సర్వే చేయడం, ఏదేని భూమిని చదును చేయడం, భూమిని లోపలికి ప్రవేశం లేదా బోర్లు వేయడం మరియు వారి పని యొక్క సక్రమమైన అమలు కోసం అన్ని ఇతర చర్యలను చేపట్టి వారిని సమీకరు చేయవలసినదిగా శ్రీ అధికృత అధికారి మరియు రెవెన్యూ డివిజనలు అధికారి, కొత్తపేట మరియు అతని సిబ్బందిని కోరడమైనది.

చట్టంలోని 11/4/వ విభాగము క్రింద , కలక్టరు పూర్వ ఆమోదము లేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి ఏదేని లావా దేవీ లేదా ఏ దేని భూమి యొక్క లావాదేవీలు కారణం అంటే అమ్మకం/కొనుగోలు ముస్సగునవి లేదా అట్టి భూమిపై ఏవేని తాకట్టులను సృష్టించడం ఏవ్యక్తి చేయరాదు.

సేకరణకు సంబంధించి ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లయితే నష్టపరిహారానికి సంబంధించి సంప్రదింపుల ద్వారా పరిష్కారంకోసం చట్టంలోని 15 వ విభాగము క్రింద పొందుపరచినట్లుగా ఈ ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 15 (పదిహేను) రోజులు లోపల ప్రయోజనం ప్రభావితమైన వ్యక్తిరే క్లైములను జిల్లా కలక్టరు/శ్రీ అధికృత అధికారి మరియు రెవెన్యూ డివిజనలు అధికారి, కొత్తపేట సమక్షములో దాఖలు చేసుకొనవచ్చును.

హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం
కంఠం రాజు కొండూరు గ్రామము, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా

E-Procurement Tender

శ్రీ అమ్మవారి దేవస్థానం పునః నిర్మాణము పనులకు e-Procurement Tender ద్వారా టెండరు కోరటమైనది. వివరములకు వెబ్‌సైట్: https://tender.apeprocurement.gov.in ను చూడగలరు.

తేది: 20-09-2022 సం/- కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ

నెం. 05/2022-23 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 19-09-2022

పనిపేరు: తూర్పుగోదావరి జిల్లా-తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకము-పురుషోత్తపట్నం మండలం-సీతానగరం గ్రామం-అఖండ గోదావరి కి.మీ.41.100 మరియు కి.మీ.41.200 వద్ద గల ఫస్టు స్టేజి పంపుహౌస్‌లకు 2022-23 వార్షిక నిర్వహణ గురించి. **పని విలువ:** రూ. **1,50,74,636/-** టెండర్లు స్వీకరించుటకు ఆఖరి తేది: 11-10-2022, మ.3 గం. వరకు. తదుపరి వివరాలను https://tender.eprocurement.gov.in. లో చూడగలరు. ఫోన్: 08854-251196.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, పి.ఐ.పి. యల్.యం.సి.సర్కిల్, తుని

DIPR RO No. 5983/CL/ADVT/1/1/2021-22, Dt: 20.09.2022

APSRTC
HIRE BUS TENDER NOTIFICATION

APSRTC invites e-bids for new buses of 2022 or later BS-VI model under Hire scheme through MSTC portal from entrepreneurs, registered as vendors for APSRTC on MSTC portal, for supply of AC Sleeper, Non AC Sleeper, Super Luxury, Ultra Deluxe, Express, Ultra Pallevelugu, Pallevelugu, Metro Express and City Ordinary buses under **"APPLICANT RATE QUOTE SYSTEM"** for operation on the identified routes of APSRTC.
Detailed particulars viz. List of Routes, Daily scheduled KMs, Security Deposit, Model and Specifications of Bus, Body Standards, Seating Capacity, Seating Pattern, Colour Scheme, Criteria for Selection of Entrepreneurs, Agreement Period, Terms & Conditions of bid, Schedule (dates) of the Tender will be available in the APSRTC website https://apsrtc.ap.gov.in from 23.09.2022.
Corporation reserves the right to cancel this notification without assigning any reason.

No.P9/359(11)/2022-OPD(P), Dt.19.09.2022 — Sd/- Vice Chairman & Managing Director

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

తి.తి.దేవస్థానముల మార్కెటింగ్ శాఖకు **"01 నెల కాలవ్యవధి కోసం 75,000 కిలోగ్రాముల జీడిపప్పు (Cashew Wholes) (W320 వెరైటీ)"** సరఫరా కోసం ఇ-టెండర్స్-కమ్-ఇ-రివర్స్ టెండరింగ్ ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కోసం వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.inకు లాగాన్ అవండి. తదుపరి వివరాల కోసం సంప్రదించండి ఫోన్ నంబర్లు: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం: 0877-2264554

Roc No.PR4/13946/Adv.No.222/PRO/2022, Dt: 20.09.2022 — ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

A.P. TOURISM DEVELOPMENT CORPORATION LTD.
5th Floor, Stalin Corporate, Industrial Estate, Autonagar, Vijayawada-07

Tender Notice No.APTDC/O&M/1/2022, Dt:20.09.2022

E-TENDER NOTIFICATION

APTDC Ltd inviting Bids for Selection of O&M Operator for 22 properties at various Tourist locations in Andhra Pradesh. For further details visit our website www.tourism.ap.gov.in and https://www.apeprocurement.gov.in

Sd/- K. KANNA BABU, IAS, Managing Director

DIPR Ro No.1271PP/CL/Advt/1/1/2021-22, Dt:20.09.2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

నెం.206 నుండి 216 వరకు/2022-23 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 16.09.2022

విశాఖపట్నం జిల్లా మరియు అనకాపల్లి జిల్లా పరిధిలోని వివిధ మండలాలలో 11 పనులకు అంచనా విలువ: రూ.1342.23 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూళ్ళ లభ్యత: 23.09.2022 ఉ.11.00 గం. 07.10.2022 సా.4.00 గం. వరకు. టెండరు దాఖలు పరచుట: తేది: 23.09.2022 ఉ.11.00 గం. నుండి 07.10.2022 సా.5.00 గం. వరకు. టెండర్లను తెరుచు తేది: 10.10.2022 ఉ.11.00 గం. నుండి. వివరాలు: http://www.apeprocurement.gov.in. ఫోన్: 0891-2706461.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, గ్రా.నీ.స మరియు పారిశుద్ధ్యం, విశాఖపట్నం

DIPR RO No.5978/CL/Advt/1/1/2021-22, Dt. 20.09.2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.05/0.5%QC&CMDF/SEPRVSP/2022-23 తేది: 14-09-2022

అనకాపల్లి మరియు విశాఖపట్నం జిల్లాలలోని మాడుగుల, పద్మనాభం మరియు ఆనందపురం మండలాలలో 0.50% QC చార్జెస్ మరియు CMDF గ్రాంట్ క్రింద రూ.146.00 లక్షల అంచనా వ్యయంతో 3 భవన పనుల నిర్మాణం. బిడ్ డౌన్‌లోడ్: 21-09-2022 తరువాత. సంబంధిత అధికారి పేరు, హోదా: SE, PR సర్కిల్, విశాఖపట్నం. తదుపరి వివరాలకు దర్శించండి http://www.apeprocurement.gov.in

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, PR సర్కిల్, విశాఖపట్నం

DIPR RO No.5972/CL/Advt/1/1/2021-22, Dt.20.09.2022

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి

'ఇ'ప్రొక్యూర్‌మెంట్ నిట్ నెం.286(6వ పిలుపు), 70 to 79 /డి.యమ్/2022-2023, తేది:20.09.2022

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి వారు సాంకేతిక విభాగము నందు 11 (పదకొండు) పనులకు గాను అర్హత కలిగిన రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి 'e' టెండర్లు కోరుచున్నారు. బిడ్డు వివరముల కొరకు www.tender.apeprocurement.gov.in లో చూడగలరు.

సం॥యస్.హరికృష్ణ, MA., M.Phil, ఉపాధ్యక్షులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి

Jawaharlal Nehru Technological University Gurajada
Vizianagaram-535003

Notification

Admission to UG/PG Programmes Under NRI/FN/OCI Categories- 2022

Advt No. JNTUGV /DA/NRI UG-PG-Programmes/ Admissions/2022 — Dated 21-09-2022

Applications are invited from **NRI/ Foreign National / OCIs** for admission to regular B.Tech/ M.Tech/ MCA Programmes at JNT University Gurajada Vizianagaram. Application forms are to be filled **online** by the link provided in JNTU GV, Vizianagaram website http://www.jntugv.edu.in. Filled in Application with required certificates and application fee of **USD $ 100 or equivalent in Indian Rupees** payable through SBI Collect in favour of **REGISTRAR JNTU GV ADMISSIONS** should submit on or before 30-09-2022.

Sd/- Registrar

ప్రపంచ దేశాల ఐక్యతకు ప్రాధాన్యం పెరిగింది

ఐరాసలో ప్రియాంక ప్రసంగం



ఐక్యరాజ్యసమితి: ''న్యాయమైన, సురక్షితమైన, ఆరోగ్య కరమైన సమాజం ప్రతి వ్యక్తి హక్కు. ప్రపంచ దేశాల ఐక మత్యంతోనే ఇది సాకారమవుతుంది'' అని నటి, దర్శకురాలు ప్రియాంకా చోప్రా జోనాస్ అన్నారు. ప్రపంచదేశాలు సంఘీభావంతో వ్యవహరించాల్సిన అవసరం మునుపటి కంటే ఇప్పుడే ఎక్కువగా ఉందని ఆమె చెప్పారు. ఇందుకు నిర్దేశించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యా(ఎస్‌డీజీ)ల సాధనకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. యునిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్ అయిన చోప్రా ఎస్‌డీజీపై మంగళవారం జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు.

ప్రమాదం ముంగిట ప్రపంచం

ప్రపంచ దేశాల మధ్య విభేదాలు భద్రతా మండలి వంటి కీలక అంతర్జాతీయ వ్యవస్థలను బలహీనపరుస్తున్నాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వెలిబుచ్చారు. ప్రపంచం ప్రమాదం అంచున ఉందన్నారు. అంతర్జాతీయ సహకారం లేకుండా మనుగడ సాగించలేమని గుర్తు చేశారు. ప్రపంచం ముంగిట ఉన్న సవాళ్లను సహకారం, చర్చల ద్వారా మాత్రమే ఎదుర్కోగలమని తెలిపారు.

వణికిస్తున్న లంపీ ముప్పు

పాడి పశువుల్లో వ్యాపిస్తున్న వ్యాధి

- 10కిపైగా రాష్ట్రాలను వణికిస్తున్న వైరస్
- రాజస్తాన్‌లో తీవ్రంగా పరిస్థితి
- రోజుకు 600–700 ఆవులు మృత్యువాత
- ఉద్రిక్తతలు రేపిన బీజేపీ చలో అసెంబ్లీ

దేశంలో కొద్ది నెలలుగా మరో వైరస్ పేరు మారుమోగుతోంది. పాడి పశువుల్లో ఈ వైరస్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. అదే లంపీ స్కిన్ వ్యాధి (ఎల్‌ఎస్‌డీ). కాప్రిపాక్స్ అని పిలిచే ఈ వైరస్ ఆవులు, గేదెలకు సోకుతోంది. ఈ ఏప్రిల్‌లో గుజరాత్‌లోని కచ్‌లో తొలిసారి ఇది బయటపడింది. రాజస్తాన్, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, యూపీ సహా పలు రాష్ట్రాలకు విస్తరించింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే 70 వేల పశువులు మరణించాయి. మరో 15 లక్షల పశువులకు వైరస్ సోకింది. ఈ అంటువ్యాధి మరింత విస్తరిస్తే దేశ పాడిపరిశ్రమకే తీవ్ర నష్టం తప్పదన్న ఆందోళనలున్నాయి.

రాజస్తాన్‌లో పశువులపై తీవ్ర ప్రభావం

లంపీ స్కిన్ వ్యాధి రాజస్తాన్‌లో ప్రమాదఘంటికలు మోగిస్తోంది. వ్యాధితో రాష్ట్రంలోనే ఏకంగా 57,000 ఆవులు మరణించగా, మరో 11 లక్షల ఆవులు దీని బారిన పడ్డాయి. రోజుకి సగటున 600–700 ఆవులు మరణిస్తున్నాయి. ఈ వ్యాధి కారణంగా పాల ఉత్పత్తి 15–18 శాతం తగ్గిపోయింది. దీంతో పాలు, వాటితో తయారు చేసే స్వీట్ల ధరలు బాగా పెరిగిపోయాయి. రోజుకు 5–6 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి తగ్గిపోయిందని రాజస్థాన్ కో ఆపరేటివ్ డెయిరీ వెల్లడించింది.

రాజస్తాన్ అసెంబ్లీ వద్ద ఉద్రిక్తతలు

ఈ వ్యాధి నివారణకు రాష్ట్రంలోని అశోక్ గెహ్లోట్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటూ భారతీయ జనతా పార్టీ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించింది. ఈ సందర్భంగా నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ముట్టడికి భారీ సంఖ్యలో తరలివచ్చిన బీజేపీ కార్యకర్తల్ని పోలీసులు అడ్డుకున్నారు. కానీ నిరసనకారులు బారికేడ్లు దూకి మరీ అసెంబ్లీలోకి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. దీంతో చాలా సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒక బీజేపీ ఎమ్మెల్యే ఈ వ్యాధి తీవ్రత గురించి అందరికీ తెలియజేయడానికి సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోకి ఒక ఆవుని కూడా తోలుకొని వచ్చారు. వ్యాధి సోకిన పశువులకి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ పూనియా డిమాండ్ చేశారు. మరోవైపు దీనిపై కేంద్రమే స్పందించాలని రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ డిమాండ్ చేస్తున్నారు. దాదాపుగా 13 రాష్ట్రాల్లో పశువులకి ఈ వ్యాధి సోకడం వల్ల జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి సాయం అందించాలన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఆవుతో అసెంబ్లీకొచ్చిన బీజేపీ ఎమ్మెల్యే

ఏమిటీ వైరస్?

దోమలు, ఈగలు, పేలు మరికొన్ని కీటకాల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది గోట్ పాక్స్, షీప్ పాక్స్ కుటుంబానికి చెందిన వైరస్. ఈ వ్యాధితో పశువులకు జ్వరం సోకడంతో పాటు వాటి చర్మంపై గడ్డలు ఏర్పడతాయి. ఈ వైరస్ సోకితే పశువులు ఆహారం తీసుకోలేవు. అధికంగా లాలాజలం ఊరి నోట్లో నుంచి బయటకు వస్తుంది. ముక్కు, కళ్లల్లోంచి కూడా స్రవాలు బయటకి వస్తాయి. కొన్నాళ్లకే పశువులు బరువును కోల్పోవడం, పాల దిగుబడి తగ్గిపోవడం జరుగుతోంది.ఈ వైరస్‌కు ఎలాంటి చికిత్స లేకపోవడంతో ఎన్నో పశువులు మృత్యువాత పడుతున్నాయి. పశువుల్లో ప్రాణాంతకంగా మారిన ఈ వైరస్ సోకిన జంతువులకు పశు వైద్యులు ప్రస్తుతానికి యాంటీబయోటిక్స్ ఇస్తూ ఉపశమనం కలిగిస్తున్నారు.



మనుషులకు సోకదు

లంపీ స్కిన్ వ్యాధి మనుషులకి సోకే అవకాశం ఎంత మాత్రం లేదదిది జూనోటిక్ (మనుషులకు సంక్రమించదు) వైరస్ కాదని, మనుషులకు సోకదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్‌ఐవీ) నిపుణులు వెల్లడించారు. వ్యాధి సోకిన ఆవుల పాలను నిర్భయంగా తాగవచ్చునని మనుషులకు ఎలాంటి ముప్పు లేదని చెబుతున్నారు.

పరిష్కారమేంటి?

ప్రస్తుతానికి ఈ వ్యాధి మరింత విస్తరించకుండా రాష్ట్రాల పశుసంవర్ధక శాఖలు బాధ్యత తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రైతులు, పశుపోషకుల్లో ఈ వ్యాధిపై అవగాహన పెరిగేలా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని, కేంద్రం రాష్ట్రాల పశుసంవర్ధక శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు కొన్నాళ్ల పాటు పశువుల్ని వేరే రాష్ట్రాలకు తరలించవద్దని సూచించింది. గోట్‌పాక్స్ వైరస్ నిరోధక వ్యాక్సిన్ దీనినీ అరికడుతుందని నిపుణులు చెప్పడంతో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1.5 కోట్లను ఈ వైరస్ ఉన్న ప్రాంతాలకు పంపిణీ చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్), ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఆర్‌ఐ) సంయుక్తంగా లంపీ స్కిన్ వ్యాధికి వ్యాక్సిన్ కనుగొన్నారు. అయితే ఇది అందుబాటులోకి రావడానికి మరో మూడు నాలుగు నెలలు పడుతుంది. దేశంలోని పశువులన్నింటికీ వ్యాక్సిన్ ఇవ్వాలంటే 18–20 టీకా డోసులు అవసరం. దేశంలోని పశువులకి 80శాతం వ్యాక్సినేషన్ పూర్తి అయితేనే ఈ వ్యాధి ముప్పు నుంచి బయటపడతామని ఏనిమల్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బి.ఎస్. త్రిపాఠి అభిప్రాయపడ్డారు. 2025 నాటికి వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది.

క్లుప్తంగా...

ఎస్టీ హోదా కోసం కుర్మీల ఆందోళన

కోల్‌కతా/బరిపద/రాంచీ: తమకు షెడ్యూల్ తెగ(ఎస్టీ) హోదా కల్పించాలని, కుర్మాలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ మంగళవారం కుర్మీలు చేపట్టిన ఆందోళనలతో బెంగాల్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు రైలు పట్టాలపై బైఠాయించడంతో ఆగ్నేయ రైల్వే 18 రైళ్లను రద్దు చేసింది. మరో 13 రైళ్లను వేరే మార్గాల్లోకి మళ్లించి, 11 రైళ్ల గమ్యస్థానాన్ని కుదించింది. ఆందోళనకారులు పురులియా వద్ద జాతీయ రహదారిని దిగ్బంధించారు. పొరుగునే ఉన్న ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో కూడా కుర్మీలు రైల్ రోకోలో పాల్గొన్నారు.

జనరల్ కోటా నుంచే ఈడబ్ల్యూఎస్: కేంద్రం

న్యూఢిల్లీ: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అమలవుతున్న 50 శాతం రిజర్వేషన్ కోటాలో ఎలాంటి కోత లేదని, కేవలం జనరల్ కోటా నుంచే ఈడబ్ల్యూఎస్‌కు స్థానం కల్పించామని కేంద్రం సుప్రీంకోర్టులో స్పష్టంచేసింది. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న 50 శాతం రిజర్వేషన్ స్వాతంత్ర్యతకు ఎలాంటి భంగం వాటిల్లలేదని కేంద్రప్రభుత్వం తరపున హాజరైన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ సుప్రీంకోర్టు సీజే జస్టిస్ లలిత్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారు. ప్రవేశాలు, ఉద్యోగాల్లో ఆర్థికంగా బలహీనమైన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు కేంద్రం 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న విషయం విదితమే. రిజర్వేషన్ కల్పనకు ఆర్థిక పరిస్థితి గీటురాయి కాదని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కోర్టు సమర్థించాలనుకుంటే అంతకుముందుగా ఇందిరా సహానీ(మండల్) తీర్పును సమీక్షించాలని తమిళనాడు ప్రభుత్వం కోరింది.

కర్ణాటకలో ఇద్దరు ఐఎస్ ఉగ్రవాదులు అరెస్ట్

శివమొగ్గ: నిషేధిత ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలున్నాయనే అనుమానంతో కర్ణాటక పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరివద్ద పేలుడు పదార్థాలు లభించాయని, రాష్ట్రంలో పేలుళ్లకు కుట్ర పన్నారని ఆరోపించారు. వారిని కోర్టు ఏడు రోజుల కస్టడీకి అనుమతించింది.

పాత పింఛను విధానం

గుజరాత్ ప్రజలకు కాంగ్రెస్, ఆప్ హామీలు

న్యూఢిల్లీ/వడోదర: గుజరాత్‌లో తాము అధికారంలోకి వస్తే పాత పింఛను విధానాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ, ఆప్ ప్రకటించాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో ఇదే చేశామంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం ట్వీట్ చేశారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వడోదరలో ఓ సమావేశంలో మాట్లాడుతూ ఇదే హామీ ఇచ్చారు. ఉద్యోగులు డిమాండ్ల సాధనకు రోడ్లెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

హిజాబ్‌పై నిషేధం సబబే

న్యూఢిల్లీ: విద్యాసంస్థల్లో హిజాబ్ నిషేధాన్ని కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారేందుకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ) సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద కుట్రకు తెరతీసిందని ఆరోపించింది. విద్యాసంస్థల్లో హిజాబ్ ధారణపై నిషేధాన్ని ఎత్తివేసేందుకు కర్ణాటక హైకోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ సాగింది. జస్టిస్ హేమంత్ గుప్తా, జస్టిస్ సుధాన్షు ధులియాల ధర్మాసనం ఎదుట సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కర్ణాటక ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. అనంతరం ముస్లిం పిటిషనర్ల తరఫున దుష్యంత్ దవే..'హిజాబ్‌పై నిషేధంతో దేశంలోని మైనారిటీల మత విశ్వాసాన్ని దెబ్బతీసింది. రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ హక్కుకు భంగం వాటిల్లింది'అని పేర్కొన్నారు. హిజాబ్ వంటి మతాచారాలు అత్యవసరమైనవి కాకపోయినా, ఒక వ్యక్తి నచ్చిన వాటిని ఆచరించే క్రమంలో కోర్టులు, యంత్రాంగం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు.

టాయిలెట్‌లో భోజనాలు

యూపీలో క్రీడాకారిణులకు దారుణ అవమానం ● రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అధికారుల నిర్వాకం

సహరన్‌పూర్ (యూపీ): ఉత్తరప్రదేశ్‌లో వినడానికే రోత పుట్టించే ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో క్రీడాకారిణులకు ఇంకెక్కడా చోటు లేనట్టు టాయిలెట్‌లో భోజనాలు వడ్డించారు! సహరన్‌పూర్‌లోని డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ స్టేడియంలో సెప్టెంబర్ 16 నుంచి 18 దాకా రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గర్ల్స్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 16 డివిజన్ల నుంచి 300 మంది అమ్మాయిలు పాల్గొన్నారు. వారికి టాయిలెట్లో భోజనాలు వడ్డించడం తీవ్ర దుమారం రేపింది. అన్నం, కూరలతో పాటు పూరీలను టాయిలెట్‌లోనే నేలపై పేపర్లు పరిచి ఉంచారు. గత్యంతరం లేక బాలికలు అక్కడే వడ్డించుకొని తింటున్న వీడియో వైరల్‌గా మారింది. దాంతో యూపీ ప్రభుత్వం తీరును నెటిజన్లు అసహ్యించుకున్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సహరన్‌పూర్ జిల్లా క్రీడల అధికారి అనిమేశ్ సక్సేనాను సస్పెండ్ చేసింది. భోజనాలు తయారు చేసిన కేటరర్‌ను బ్లాక్ లిస్ట్‌లో ఉంచింది. మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ''వీడియోలో కనిపిస్తున్న ఆహారం సెప్టెంబర్ 15న వండినది. పాడైపోయిన ఆహారం కావడంతో భారీ వర్షాల వల్ల స్టేడియంలో ఎక్కడా చోటు లేక ఛేంజింగ్ రూమ్‌లో ఉంచాం. అంతే తప్ప బాలికలకు పెట్టడానికి కాదు'' అంటూ సక్సేనా సమర్థించుకున్నారు. భోజనాలపై కోచ్‌లు, క్రీడాకారిణులు ఎలాంటి అసంతృప్తి వ్యక్తం చేయలేదని చెప్పుకొచ్చారు. 300 మందికి భోజనాన్ని ఇద్దరే చేశారని, అన్నం కూడా ఉడకలేదని సమాచారముందని కలెక్టర్ చెప్పారు. దీనిపై బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ మండిపడ్డారు. క్రీడాకారిణుల్ని ఈ స్థాయిలో అగౌరవపరచడం జాతికే అవమానమంటూ ట్వీట్ చేశారు. ఇంత దారుణంగా చూస్తారా అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాంగ్రెస్ కూడా దీనిపై మండిపడింది.



టాయిలెట్లో నేలపై ఉంచిన పూరీలు, అన్నం. అందులోంచే వడ్డించుకుని తింటున్న ప్లేయర్లు

పట్టణ శ్రేయస్సు ముఖ్యం

- సమగ్ర ప్రణాళిక అవసరం
- గెలుపే లక్ష్యంగా పని చేయొద్దు
- బీజేపీ మేయర్ల సదస్సులో మోదీ

గాంధీనగర్: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యవహరిస్తే పట్టణాభివృద్ధి జరగదని, పట్టణాల శ్రేయస్సు గురించి ఆలోచించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పట్టణాల అభివృద్ధికి స్థానిక సంస్థలు సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లో మంగళవారం బీజేపీ పాలిత నగరాల మేయర్ల అఖిల భారత సదస్సును ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. ఈ రెండు రోజుల సదస్సులో 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 118 మంది మేయర్లు, డిప్యూటీ మేయర్లు పాల్గొన్నారు. అర్బన్ ప్లానింగ్, శాటిలైట్ నగరాలు, టైర్–2, టైర్–3 నగరాల నిర్మాణంపై దృష్టి సారిస్తే మెట్రో నగరాలపై జనాభా భారాన్ని తగ్గించవచ్చన్నారు. పట్టణాల సుందరీకరణ, నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో అనే అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధాని మేయర్లను కోరారు. ''ఎన్నికల్లో కేవలం గెలుపు మాత్రమే మీ లక్ష్యం కాకూడదు. అలా వ్యవహరిస్తే మీ ఊళ్లు అభివృద్ధి చెందవు. పట్టణాల శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకోవాలి. అలాంటి నిర్ణయాలు తీసుకోకపోతే ఎన్నికల్లో ఓడిపోతారు'' అని ప్రధాని మోదీ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మీద ఆధారపడకుండా పట్టణాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చి ప్రణాళికలు రూపొందించాలని ప్రధాని అన్నారు. దేశవ్యాప్తంగా కేంద్రం 100 స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేస్తోందని ఇప్పటివరకు రూ.75 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తయ్యాయని అన్నారు. ప్రతీ పట్టణానికి ఓ ఘనమైన చరిత్ర ఉంటుందని, అది ప్రతిబింబించేలా మ్యూజియంలు ఏర్పాటు చేయాలని మోదీ మేయర్లతో చెప్పారు.



గంటకో రైతు మృతి

బీజేపీ పాలనపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ: బీజేపీ పాలనలో దేశంలో గంటకో రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడంటూ కాంగ్రెస్ పార్టీ మంగళవారం ధ్వజమెత్తింది. ''2021లో 10,881 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. అంటే సగటున రోజుకు 30 మంది. గంటకొకరన్నమాట. 2014–21 మధ్య 54 వేల రైతు ఆత్మహత్యలు జరిగినట్టు నేషనల్ క్రైమ్స్ రికార్డ్ బ్యూరో గణాంకాలే చెబుతున్నాయి. 2022కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని బీజేపీ ప్రభుత్వం వాగ్దానం చేసింది. కానీ ఇప్పుడు వారికి రోజుకు కేవలం 27 రూపాయలు గిడుతోంది'' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథే అన్నారు.

విద్వేష బీజేపీ: రాహుల్

కొచ్చి: దేశ ప్రజల్లో బీజేపీ విద్వేషాన్ని వ్యాపింపజేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ''ఇలాంటి అవకాశం కోసం విదేశీ శక్తులు ఎదురు చూస్తున్నాయి. వేలాది కిలోమీటర్ల భారత భూభాగాన్ని మొదటిసారిగా చైనీయులు ఆక్రమించుకున్నారు. భారత సైన్యం కూడా ఈ విషయాన్ని ఒప్పుకుంది. ప్రధాని మోదీ మాత్రం దీన్ని బహిరంగంగానే ఖండిస్తున్నారు'' అంటూ మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఎర్నాకులం జిల్లా కొచ్చిలో రాహుల్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మంగళవారం ఉదయం 13వ రోజు యాత్రను అలప్పుజ జిల్లా చెర్తాలా నుంచి ప్రారంభించారు. దారి పొడవునా ప్రజలను పలకరిస్తూ సాగారు.



అలప్పుజలో రాహుల్‌ను కలిసిన యాసిడ్ బాధితురాలు



పారదర్శకంగా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలంటూ మంగళవారం కోల్‌కతాలో ఆందోళనకు దిగిన ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు

పోటీకి గెహ్లోట్ విముఖత?

రాజస్తాన్ వీడేందుకు ససేమిరా

- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తా!
- సీఎంగా నన్నే కొనసాగించండి
- అధిష్టానానికి కొత్త ప్రతిపాదన
- పైలట్ సీఎం కాకుండా పావులు
- ఎమ్మెల్యేలతో బల ప్రదర్శన భేటీ

జైపూర్/న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికకు గడువు సమీపిస్తున్న కొద్దీ పార్టీలో వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. ఒకవైపు బుధవారం నోటిఫికేషన్ వెలువడనుంది. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ (71) బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. ఆయనకు పోటీగా తాజాగా తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ కూడా తెరపైకి వచ్చారు. తాత్కాలిక అధినేత్రి సోనియాగాంధీ ఆశీస్సులతో గెహ్లోట్ సోమవారం నామినేషన్ వేయాలన్న నిర్ణయం కూడా అంతర్గతంగా జరిగిపోయింది. అయితే పోటీకి గెహ్లోట్ విముఖంగా ఉన్నారని హస్తిన రాజకీయ వర్గాల్లో విన్పిస్తోంది. పార్టీ అధ్యక్షునిగా ఎన్నికై ఢిల్లీ వెళ్తే సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వస్తుంది. అప్పుడు చిరకాల ప్రత్యర్థి సచిన్ పైలట్‌ను అధిష్టానం ముఖ్యమంత్రిని చేసే అవకాశముంది. ఇది గెహ్లోట్‌కు సుతరామూ ఇష్టం లేదు. రాష్ట్రంపై పట్టు వదులుకోవడానికి ఆయన అస్సలు సుముఖంగా లేరట. రాహుల్ భారత్ జోడో యాత్రలో పాల్గొనేందుకు సచిన్ పైలట్ కేరళలో ఉన్నారు. ఈ సమయంలో గెహ్లోట్ ఉన్నట్టుండి మంగళవారం రాత్రి పదింటికి కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని సమావేశపరిచారు. పైలట్ గైర్హాజరీలో ఎమ్మెల్యేలపై తన పట్టును ప్రదర్శించుకోవడమే ఈ భేటీ లక్ష్యమని భావిస్తున్నారు. మధ్యేమార్గంగా సీఎంగా కొనసాగుతూనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పని చేస్తానంటూ అధిష్టానానికి ఆయన ప్రతిపాదించారట. కుదరని పక్షంలో కనీసం పైలట్‌కు బదులు తన విశ్వాసపాత్రున్ని సీఎం చేయాలని కోరుతున్నారట. ఇది అధిష్టానానికి కొత్త తలనొప్పిగా పరిణమించిందని సమాచారం. గట్టి నాయకుడైన పైలట్ సీఎంగా చాన్స్ దక్కనందుకు రెండేళ్ల క్రితమే పార్టీపై తిరుగుబావుటా ఎగురవేశారు. దాంతో సోనియా, రాహుల్ రంగంలోకి దిగి బుజ్జగించాల్సి వచ్చింది. ఈసారి కూడా ఆయనకు అవకాశం ఇవ్వకపోతే అది రాష్ట్ర పార్టీలో సంక్షోభానికి దారి తీయవచ్చన్నది కాంగ్రెస్ పెద్దల ఆందోళన.

రాహులే అధ్యక్ష పగ్గాలు చేపట్టాలని గెహ్లోట్ ఇప్పటికీ డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రాజస్తాన్ పీసీసీతో తీర్మానం కూడా చేయించారు. దాంతో రాజస్తాన్ బాటలోనే పలు రాష్ట్రాల పీసీసీలు రాహుల్ సారథ్యాన్ని కోరుతూ తీర్మానాల బాట పట్టాయి. బుధవారం గెహ్లోట్ ఢిల్లీ వెళ్తున్నారు. అక్కడి నుంచి కేరళ వెళ్లి రాహుల్ యాత్రలో పాల్గొనే అవకాశముంది. ఈ సందర్భంగా కూడా పోటీకి రాహుల్‌ను ఒప్పించేందుకు మరోసారి ప్రయత్నిస్తారని చెబుతున్నారు.



సచిన్ పైలట్



అశోక్ గెహ్లోట్


22 ఏళ్ల తర్వాత పోటీ!

గెహ్లోట్‌తో పాటు థరూర్ కూడా బరిలో దిగితే పోటీ అనివార్యమయ్యేలా కనిపిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి చివరిసారిగా 22 ఏళ్ల క్రితం ఎన్నిక జరిగింది. 2000 నవంబర్‌లో జరిగిన ఆ ఎన్నికలో జితేంద్ర ప్రసాదపై సోనియా నెగ్గారు. 1997లో శరద్ పవార్‌ను సీతారాం కేసరి ఓడించారు. కాంగ్రెస్‌కు సుదీర్ఘ కాలం సారథ్యం వహించిన రికార్డు సోనియాదే. 1998 నుంచి మధ్యలో రెండేళ్లు మినహా ఇప్పటి దాకా పార్టీ పగ్గాలు ఆమె చేతిలోనే ఉన్నాయి. 2017 నుంచి 2019 దాకా రాహుల్ గాంధీ అధ్యక్షునిగా కొనసాగారు. ఈసారి ఎన్నికకు సోనియా దూరంగా ఉండటం తెలిసిందే. సారథ్యానికి విముఖంగా ఉన్న రాహుల్ చివరి క్షణాల్లో మనసు మార్చుకుంటే తప్ప ఈసారి గాంధీయేతర నేతే కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టడం ఖాయంగా కన్పిస్తోంది.

4 సెకన్లకో ఆకలి చావు

ప్రపంచ నేతలు స్పందించాలి: ఎన్జీవోలు

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా 45 దేశాల్లోని 34.5 కోట్ల మంది ప్రజలు తీవ్ర క్షుద్బాధతో తనువు చాలిస్తున్నారని నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్(ఎన్జీవోలు) పేర్కొన్నాయి. రోజుకు 19,700 మంది వంతున ప్రతి సెకనుకు నలుగురు చొప్పున ఆకలితో చనిపోతున్నట్లు అందులో పేర్కొన్నాయి. 2019తో పోలిస్తే ఆకలి చావులు రెట్టింపయ్యాయని తెలిపాయి. 75 దేశాలకు చెందిన ఆక్స్‌ఫామ్, సేవ్ ది చిల్డ్రన్, ప్లాన్ ఇంటర్నేషనల్ వంటి 238 ఎన్జీవోలు ఈ మేరకు ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశాలకు హాజరయ్యే ప్రపంచ దేశాల నేతలనుద్దేశించి లేఖ రాశాయి. ''21వ శతాబ్దంలో కరువు పరిస్థితులను రానివ్వబోమంటూ ప్రపంచ నేతలు ప్రతినబూనినప్పటికీ సోమాలియాలో మరోసారి తీవ్ర కరువు తాండవిస్తోంది. 45 దేశాల్లోని మరో 5 కోట్ల మంది ప్రజలు కరువుకు చేరువలో ఉన్నారు'' అని ఆ ప్రకటనలో తెలిపాయి. 'కేవలం ఒక దేశం లేదా ఖండానికి సంబంధించింది కాదు. మొత్తం మానవాళికే జరుగుతున్న అన్యాయమిది'' అని పేర్కొన్నాయి. ప్రపంచవ్యాప్త ఆకలి సంక్షోభాన్ని నివారించేందుకు ప్రభుత్వాలు నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని కోరాయి. ''21వ శతాబ్దంలో కూడా కరువు గురించి మాట్లాడుకోవాల్సి రావడం దారుణం. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తక్షణమే ఆహారంతోపాటు దీర్ఘకాలం పాటు వారికి సాయం కొనసాగించడంలో ఏమాత్రం ఆలస్యం తగదు'' అని పేర్కొన్నాయి.



నగ్న చిత్రాలు షేర్ చేశాడని... ప్రియుణ్ని కొట్టి చంపింది

బెంగళూరు: ప్రియురాలి నగ్న చిత్రాలు నెట్‌లో పెట్టిన ఓ డాక్టర్ ఆమె చేతిలోనే కడతేరిపోయాడు. చెన్నైకి చెందిన వికాస్ రాజన్ అనే 27 ఏళ్ల డాక్టర్‌కు ఓ ఆర్కిటెక్ట్‌తో రెండేళ్ల క్రితం పెళ్లి కుదిరింది. అప్పట్నుంచీ ఇద్దరూ సన్నిహితంగా ఉంటున్నారు. నాలుగు నెలలుగా బెంగళూరులో ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్‌కు కోచింగ్ ఇస్తున్నాడు. ఒక రోజు ప్రియురాలి నగ్న చిత్రాలను తమిళనాడులోని తన మిత్రులకు పంపాడు. మారుపేరుతో ఇన్‌స్టాగ్రాం అకౌంట్ ఓపెన్ చేసి అప్‌లోడ్ చేసేశాడు. సెప్టెంబర్ 8న వాటిని చూసి ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఆగ్రహంతో నిలదీయగా సరదాకు పెట్టానంటూ బదులిచ్చాడని సమాచారం. దాంతో ఆమె ఆగ్రహంతో రగిలిపోయింది. పథకం ప్రకారం సెప్టెంబర్ 10న ప్రియుణ్ని తన మిత్రుని ఇంటికి రప్పించింది. మరో ఇద్దరు మిత్రులతో కలిసి వికాస్‌ను చావబాదింది. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన అతను నాలుగు రోజుల తర్వాత మరణించాడు. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

స్కూలుపై మయన్మార్ ఆర్మీ కాల్పులు

ఏడుగురు చిన్నారులు సహా 13 మంది మృతి



నేలపై రక్తం. అక్కడ పడున్న స్కూలు బ్యాగు



బాలుని మృతదేహాన్ని తరలిస్తూ తండ్రి కంటతడి

యాంగూన్: తిరుగుబాటుదారులు నక్కి ఉన్నారనే అనుమానంతో మయన్మార్ ఆర్మీ హెలికాప్టర్ ఓ స్కూలు భవనంపై జరిపిన కాల్పుల్లో ఏడుగురు విద్యార్థులు సహా 13 మంది చనిపోయారు. సగయింగ్ ప్రాంతంలోని లెటియెట్ కోన్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. బౌద్ధ ఆశ్రమం ఆవరణలోని 240 మంది విద్యార్థులున్న స్కూలుపై సైన్యం కాల్పులకు తెగబడింది. ఇందులో 30 మంది విద్యార్థులు గాయపడినట్లు సమాచారం. గ్రామంలోని 2 వేల మంది ప్రాణభయంతో ఊరొదిలారు. రెబల్స్ కాల్పులు జరిపారని, ఎదురు కాల్పుల్లో వారితో పాటు విద్యార్థులు చనిపోయారని సైన్యం తెలిపింది. సైనిక నేతలు గత ఏడాది ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం చేజిక్కించుకున్నప్పటి నుంచి దేశంలో హింసాత్మక ఘటనలు ఎక్కువయ్యాయి.



నేడు గురజాడ 160వ జయంతి

మహాకవి గురజాడ వెంకట అప్పారావు 160వ జయంతిని రాష్ట్రప్రభుత్వం బుధవారం వేడుకగా నిర్వహించనుంది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురజాడ ఇంటిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- 8లో

పిచ్చికుక్క స్వైరవిహారం



రాజాం సిటీ: రాజాం అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రాత్రి పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. సుమారు 25 మందిని గాయపర్చింది. డి.సాయిప్రకాష్, పి.సురేష్, కొల్లి రాము, ఎం.రామకృష్ణ, బి.బలరాం, వి.రమణి, పి.దుర్గారావు, జి.ధనలక్ష్మి, వి.గవర్రాజు, జి.బాలరాజు, జి.గిరి, కె.సూరిలతోపాటు మరో 13 మంది గాయపడిన వారిలో ఉన్నారు. వీరంతా స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు.

కౌన్సెలింగ్ నేడు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాలల సంయుక్తంగా 24 కేటగిరీలలో 194 ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాయి. అర్హుల జాబితాను వెలువరించాయి. ఆ మేరకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఆడియో విజువల్ టెక్నీషియన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

సేవలకు గుర్తింపు



ఎమ్.హరీష్



షేక్ జగదీష్

విజయనగరం క్రైమ్: జిల్లాలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు సాహసించి ఇద్దరు ప్రాణాలు కాపాడిన ఫైర్ సిబ్బంది షేక్ జగదీష్, ఎమ్.హరీష్ సేవలను భారతప్రభుత్వం గుర్తించింది. ప్రశంసాపత్రాలు, బ్రాంజ్‌మెడల్స్‌ను పంపించింది. వీటిని జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయంలో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కె.వినయ్ మంగళవారం అందజేశారు. ఇద్దరినీ అభినందించారు. జిల్లా ఏడీఎఫ్ఓ సోమేశ్వరరావు, తోటిసిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రామతీర్థంలో పవిత్రోత్సవాలకు అంకురారోపణ



స్వామివారి సన్నిధిలో అంకురారోపణం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో నిర్వహించే పవిత్రోత్సవాలకు మంగళవారం అంకురోపణం చేశారు. మట్టి పాలికల్లో వేసే పవిత్ర పుట్టమన్నును రామగిరి నుంచి మేళతాళాలతో అర్చకులు తీసుకొచ్చారు. శుద్ధిచేసిన మట్టిన పాలికల్లో సర్ది నవధాన్యాలను అంకురారోపణం చేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సీతారామస్వామి వారి సన్నిధిలో అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం జరిపించారు. అజస్ర దీపారాధన, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణము, వాస్తు పూజ నిర్వహించారు. శ్రీరంగం పుణ్యక్షేత్రం నుంచి తీసుకొచ్చిన పట్టు పవిత్రాలకు వాస్తు శుద్ధి కార్యక్రమాన్ని వైఖానస ఆగమోక్తంగా పండితులు పాణింగపల్లి రంగనాథాచార్యులు జరిపించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో అర్చకులు పాణంగిపల్లి ప్రసాద్, ఖండవిల్లి కిరణ్‌కుమార్, పెద్దింటి పవన్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

2.94 లక్షల ఎకరాల్లో ఈ క్రాప్

- వ్యవసాయశాఖ జేడీ తారకరామారావు



జామి రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ

జామి: జిల్లాలో 2లక్షల94వేల ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తి చేసినట్టు వ్యవసాయశాఖ జేడీ తారకరామారావు తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ క్రాప్ నమోదుకు గడువు ఉందన్నారు. జామి వ్యవసాయశాఖ కార్యాలయాన్ని, రైతుభరోసా కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ క్రాప్ నమోదుపై ఆరా తీశారు. వచ్చేనెల 5న సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. అభ్యంతరాలుంటే రైతులు తెలియజేసుకోవచ్చన్నారు. జిల్లాలో 11,884 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట ఏఓ కిరణ్‌కుమార్, వీఆర్వో హరినాథ్, వీఏఏలు పాల్గొన్నారు.

సాకారమవుతున్న స్వచ్ఛ సంకల్పం

ప్రజారోగ్యమే మహాభాగ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పల్లెల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తోంది. చెత్త తరలింపునకు రూ.కోట్ల ఖర్చుతో ప్రత్యేక వాహనాలు, పరికరాలను సమకూర్చింది. గ్రీన్ అంబాసిడర్లను పూర్తిస్థాయిలో నియమించింది. పంచాయతీల్లో ప్రతిరోజూ సేకరించిన తడి, పొడి చెత్తతో చెత్త సంపద కేంద్రాల్లో ఎరువులను తయారు చేస్తోంది. సంపద సృష్టిస్తోంది. 'జగనన్న స్వచ్ఛసంకల్పాన్ని' సాకారం చేస్తోంది.



విజయనగరం మండలం కొండకరకాంలో కాలువల్లో పూడికల తొలగింపు

- పల్లెల్లో పరిశుభ్రతకు పెద్దపీట
- సత్ఫలితాలిస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం
- చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనాలు
- రూ.13.87 కోట్ల ఖర్చుతో వాహనాలు, పరికరాల కొనుగోలు
- పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం
- నెలనెలా రూ.కోట్లలో జీతాల చెల్లింపు



విజయనగరం గంటస్తంభం:

జిల్లాలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం సత్ఫాలితాలిస్తోంది. ఒకప్పుడు చెత్త, చెదారంతో ఉండే పల్లెలు ఇప్పుడు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయాన్నే పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తరలించడం, కాలువల్లో పూడికలు తొలగిస్తుండడంతో పల్లెల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకుంటోంది. ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తోంది. జిల్లాకు సుమారు 13.87 కోట్ల విలువగల చెత్త తరలింపు వాహనాలు, తడిపొడి చెత్త సేకరణకు ప్రత్యేక బుట్టలు, పూడికల తొలగింపునకు పరికరాలను సమకూర్చింది. వీధులు, కాలువలను శుభ్రపరిచేందుకు 2,369 మంది సిబ్బందిని నియమించింది. వీరికి నెలకు సుమారుగా రూ.1.15 కోట్ల వేతనాలు చెల్లిస్తూ స్వచ్ఛ సంకల్ప లక్ష్యాన్ని నెరవేర్చుతోంది.

పరిశుభ్రంగా పల్లెలు

జిల్లాలో జగనన్న స్వచ్ఛ సంకల్ప లక్ష్యం నెరవేరుతోంది. ప్రతిరోజూ ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా సాగుతోంది. వీధుల్లోని చెత్తను, కాలువల్లోని పూడికలను గ్రీన్ అంబాసిడర్లు తొలగిస్తున్నారు. దీనివల్ల గ్రామాలు పరిశుభ్రమవుతున్నాయి. వ్యాధుల వ్యాప్తి తగ్గింది. ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తున్నారు. రానున్న రోజుల్లో చెత్తనుంచి మరింత సంపద సృష్టించేందుకు కృషిచేస్తున్నాం. ఇది పంచాయతీలకు మంచి ఆదాయవనరు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలంతా సహకరిస్తున్నారు.

– ఇందిర రమణ, జిల్లా పంచాయతీ అధికారి

చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనాలు

- జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కింద ఒక్కొక్కటి రూ.7లక్షల విలువైన 62 గార్బేజ్ ఆటో టిప్పర్లు కొనుగోలు చేసి జిల్లాకు అందజేసింది. వీటికోసం మొత్తం రూ.4.34కోట్లు ఖర్చు చేసింది.
- 810 ట్రైసైకిళ్లను జిల్లాకు సమకూర్చింది. దీనికోసం రూ.2,54,34,000 కేటాయించింది.
- ఇన్‌సినేటర్స్‌ను జిల్లాకు 464 మంజూరు చేసింది. వీటి విలువ ఒక్కొక్కటి రూ.41,886లు. దీనికోసం రూ.1,94,35,104 ఖర్చుచేసింది.
- ఒక్కొక్కటి రూ.18,996లు విలువగల 709 హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్స్‌ను జిల్లాకు సమకూర్చింది. దీనికోసం రూ.1,34,68,164లు వెచ్చించింది.
- రూ.3,70,40,220లు విలువగల 756 ఫాగింగ్ మిషన్‌లను అందజేసింది.



చెత్తను వాహనంలో వేస్తున్న కార్మికుడు

పరిశుభ్రతకు ప్రాధాన్యం...

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 777 పంచాయతీలు ఉన్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నుంచి పల్లెల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీ కార్యవర్గం స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టేది. నిధులు లేమితో ఏడాదిలో మూడు నాలుగుసార్లు మాత్రమే పారిశుద్ధ్య పనులు నిర్వహించేవారు. పనిచేసే కార్మికులకు జీతాలు సైతం సరిగా అందేవికావు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని పంచాయతీల్లోనూ గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. 1877 క్లాప్ మిత్రలను నియమించి నెలకు రూ.6 వేలు చొప్పున (మొత్తం 1,12,62,000) వేతనం చెల్లిస్తోంది. చెత్త సంపద కేంద్రాలు 520 నిర్మించి, అక్కడ 492 మంది క్లాప్ మిత్రలను నియమించింది. వీరికి కూడా నెలకు రూ.6 వేలు చొప్పున (మొత్తం రూ.29,52,000) అందజేస్తోంది.

ఏరోజుకారోజు చెత్త సేకరణ

ప్రతిరోజూ ఉదయాన్నే సిబ్బంది గ్రామాల్లో వీధివీధిన తిరిగి ఇళ్లల్లోని చెత్తను సేకరిస్తున్నారు. వాటిని చెత్తశుద్ధి షెడ్‌లకు తరలిస్తున్నారు. అక్కడ పొడి, తడి చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నారు. ఇప్పటి వరకు 44,805 కేజీల వర్మీకంపోస్టును విక్రయించగా రూ.3,35,444లు, పొడి చెత్త 36,200 కేజీలు అమ్మగా రూ.2,20,889 ఆదాయం సమకూరింది. ఓ వైపు ఆదాయంతో పాటు మరోవైపు గ్రామాలు పరిశుభ్రమవుతుండడంతో పల్లెప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మ సేవలో ఉప సభాపతి



కోలగట్ల వీరభద్రస్వామి దంపతులకు అమ్మవారి ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఉప సభాపతికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈఓ భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల ఏర్పాట్ల గురించి ఉప సభాపతికి ఈఓ భ్రమరాంబ వివరించారు.

23న మెగా జాబ్ మేళా

విజయనగరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పనా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాకు హాజరుకానున్న అభ్యర్థులు పదో తరగతి (పాస్/ఫెయిల్), ఇంటర్మీడియట్, డిప్లమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 18–40 ఏళ్ల మధ్య ఉండాలని చెప్పారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణం (టీటీడీసీ)లో ఉదయం 9 గంటల నుంచి ఉద్యోగ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు 15 బహుళ జాతి కంపెనీలైన హెటిరో లాబ్స్ లిమిటెడ్, కోజెంట్ ఈ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, జయభేరి ఆటోమోటివ్స్, గ్లోబల్ బయో మెడికల్ సర్వీసెస్ ఇండియా, మోహన్ స్పింటెక్స్, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, సహన క్లాతింగ్, ప్రీమియర్ హెల్త్ కేర్, డిక్సన్ టెక్నాలజీస్, రిలయన్స్ ట్రెండ్స్, మెడ్‌ప్లస్, రాండ్ స్టాండ్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి నెలకు రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. నిరుద్యోగ యువకులు వారి వివరాలను ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, రిఫరెన్స్ సంఖ్యతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, ఒరిజనల్ విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్ ఫొటోతో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్: 99888 53335, 79898 26953, 63027 38962 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మేకల మందపై పులిదాడి



పులిదాడిలో మృతిచెందిన మేక

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి పంచాయతీ మధుర గ్రామమైన గదబపేట సమీపంలో గొల్లవెంకయ్యపేట గ్రామానికి చెందిన కొండ్రి ఆదినారాయణ, కొండ్రి లచ్చయ్యలకు చెందిన మేకలమందపై మంగళవారం రాత్రి పులిదాడి చేసింది. ఈ ఘటనలో రెండు మేకలు మృతిచెందగా మూడు మేకలు గాయపడ్డాయి. మందలో మిగిలిన మేకలు పులిదాడి నుంచి తప్పించుకొని పారిపోయినట్టు కాపలాదారులు తెలిపారు. నిన్న, మొన్నటివరకూ పులిగుమ్మి పరిసర ప్రాంతంలో సంచరించిన పులి ఇప్పుడు తమ గ్రామాల వైపు రావడంతో గదబపేట, గొల్లవెంకయ్యపేట గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తమను ఆదుకోవాలంటూ పులిదాడిలో మేకలు కోల్పోయిన రైతులు అధికారులకు విజ్ఞప్తిచేస్తున్నారు.

వెంటాడుతున్న పులి భయం



రావివలసలో పులి పాదముద్రలు

బాడంగి: మండలంలోని గూడెపువలస పంచాయతీ పరిధిలోని గూడెపువలస, అల్లువానివలస, రావివలస గ్రామాల ప్రజలను పులి భయం వెంటాడుతోంది. రావివలస గ్రామ శివారున ఉన్న పూడి తిరుపతిరావు ఇంటి పక్కనే గణపతిరావు పశువులశాల వద్దకు సోమవారం అర్ధరాత్రి పులి రావడంతో కంగారుపడుతున్నారు. పులి రాకతో పశువులు ఒక్కసారిగా భయంతో అరిచాయి. ఆ సమయంలో తిరుపతిరావు భార్య పైడితల్లమ్మ మేల్కొని లైట్లు వేసింది. పశువుల వద్దనే పులి కనిపించడంతో ఆమె బిగ్గరగా కేకలు వేసింది. ఇరుగుపొరుగువారు లేవడం, గొల్లుమనడంతో అక్కడి నుంచి పులి జారుకున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. రావివలసచుట్టూ మామిడితోటలు, తుప్పలు ఎక్కువగా ఉండడంతో పులి ఇక్కడే దాక్కొని.. ఆదివారం హతమార్చిన ఆవుల కళేబరాలకోసం మళ్లీ వచ్చినట్టు భావిస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన తుపాకీ లైసెన్స్ ఉన్నవారు 8 మంది మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు తిరిగి ఇవ్వాలని, పులిని చంపబోమని, ప్రాణరక్షణ కోసం గాలిలో కాల్పులు జరుపుతామని సీఐ, ఎస్ఐలకు విజ్ఞప్తిచేశారు.

పైడితల్లి దీక్షకు వేళాయె..

- చదురుగుడిలో మండల దీక్షలు నేడు
- ఏటా పెరుగుతున్న దీక్షధారులు
- అమ్మవారి దీక్షధారణతో ఉత్సవాలు ఆరంభం
- సిరిపురంలో సిరిమాను చెట్టు గుర్తింపు



పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి కరుణా కటాక్షాల కోసం భక్తులు పరితపిస్తారు. తల్లి చల్లని దీవెనెల కోసం భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అమ్మవారి మాలలు ధరించి దీక్షబూనుతారు. నెలరోజుల పాటు తల్లి నామాన్ని స్మరిస్తారు. పైడితల్లి అమ్మవారి దీక్షధారణలతోనే జాతర ప్రారంభమవుతుంది. అమ్మవారి చదురుగుడిలో బుధవారం ఉదయం 8 గంటలకు భక్తులు మండల దీక్షలు స్వీకరిస్తారు. దీక్షాపరుల భజనలతో నెలరోజుల పాటు జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. ఈ ఏడాది పైడితల్లి ఉత్సవాలు సెప్టెంబర్ 21 నుంచి నవంబర్ 2వ తేదీవరకు సాగనున్నాయి. మధ్యలో గ్రహణాలు ఉండడంతో పండగ మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగనుంది. ఇప్పటికే అమ్మవారి ఉత్సవాలకు పందిరి రాటతో శ్రీకారం చుట్టారు. అమ్మవారి మండల దీక్షలు చేపట్టిన వారికి అమ్మవారి దీక్షా వస్త్రాలను, మాలలను దేవస్థానం అధికారులు ఉచితంగా సమకూర్చనున్నారు. 1997లో అమ్మవారి దీక్షలను అప్పటి ఈఓ కొండలరావు పైడిమాంబ దీక్షా పీఠం ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలిఏడాది 30 మంది భక్తులు దీక్షధారణ చేయగా, నేడు ఆ సంఖ్య 500కి పెరిగింది.

దీక్షధారులకు సేవలందిస్తాం..



సిరులతల్లి పైడితల్లి అమ్మవారి దీక్షలను అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. అమ్మవారి నెలరోజుల జాతరలో దీక్షలు చేసే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా దేవస్థాన సిబ్బంది చూస్తారు. గతంలో కోవిడ్ కారణంగా చాలా మంది భక్తులు దీక్షలకు దూరమయ్యారు. మండల దీక్షలు 21 నుంచి ప్రారంభమవుతాయి.

– బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్, పైడితల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం

దీక్షతో కొలుస్తాం..



అమ్మ పండగ అంటే అందరికీ సంబరమే. ఈ ఏడాది సుమారు 500 మందికి పైగా భక్తులు దీక్ష ధారణ చేసే అవకాశం ఉంది. ఉత్సవానికి సంబంధించి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ముందుస్తుగానే ప్రచార రథంతో ఉత్తరాంధ్ర అంతా ప్రచారం చేయగలిగాం. లక్షలాది మంది భక్తులు అమ్మవారి సిరిమానోత్సవాన్ని వీక్షించేందుకు తరలివస్తారు. వాడవాడలా భక్తులు పీఠాలు స్థాపించి 41 రోజుల పాటు భక్తితో అమ్మవారిని పూజిస్తారు.

– ఆర్.సూర్యపాత్రో, పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు, విజయనగరం

సిరిమాను గుర్తింపు..

పైడితల్లి సిరిమాను చెట్టును గంట్యాడ మండలం సిరిపురంలో గుర్తించినట్టు ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ మంగళవారం తెలిపారు.

చురుగ్గా భూముల రీ సర్వే

- అక్టోబర్ తొలి వారంలో భూ హక్కు పత్రాల అందజేత
- జేసీ మయూర్ అశోక్



రీ-సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో తలపెట్టిన 'జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం' రీ-సర్వే చురుగ్గా సాగుతోందని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. బాడంగి, రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి, జామి, కొత్తవలస, వంగర, సంతకవిటి తదితర మండలాల పరిధిలోని 125 గ్రామాల్లో చేపట్టిన రీ-సర్వే తుదిదశకు వచ్చినట్టు వివరించారు. ఇప్పటి వరకు సర్వే పూర్తయిన గ్రామాల్లో ఎల్‌పీఎన్ (ల్యాండ్ పార్సిల్ నంబర్)తో కూడిన భూహక్కు పత్రాలను అక్టోబర్ తొలివారం నుంచి అందజేస్తామన్నారు. జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియపై రైతులకు ఉన్న సందేహాలను 5 దశల్లో గ్రామ సభల ద్వారా నివృత్తి చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సులభతర విధానంలో భూ హక్కులు కల్పించాలని నిర్దేశించిందన్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు, సాంకేతిక సిబ్బంది, గ్రామ వలంటీర్లు మొత్తం 2 వేల మందితో రీ-సర్వే ప్రక్రియ నిరంతరాయంగా సాగుతున్నట్టు వివరించారు. జిల్లాలోని 926 గ్రామాలకు 625 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు.

పరిష్కారం లభించే సమస్యలు

రీ-సర్వే ప్రక్రియ ద్వారా ఏళ్లనాటి భూ సమస్యలకు పరిష్కారం లభిస్తున్నట్టు జేసీ చెప్పారు. సాదాబైనామా భూములకు, చుక్కల భూములు అనుభవిస్తున్న వారికి, డీ-పట్టాదార్లకు, పార్టీషన్ డీడ్‌కు సంబంధించిన భూములకు రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పార్టీషన్ డీడ్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన ఏమీ లేదని, నోటరీ ద్వారా అంగీకర పత్రం అందజేస్తే సమస్యను పరిష్కరిస్తామని జేసీ చెప్పారు. ప్రధానంగా 22ఏ భూములకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్టు తెలిపారు. సర్వే రాళ్ల విషయంలో ప్రభుత్వం నేరుగా అందించినవి తీసుకున్నా ఫర్వాలేదని, లేదంటే రైతులే నేరుగా రాళ్లను పాతుకోవచ్చని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు సంబంధిత రైతుకు సర్వే రాళ్ల నిమిత్తం నగదు అందజేస్తామని చెప్పారు. రీ-సర్వే ప్రక్రియ మరింత వేగవంతంగా సాగేందుకు జిల్లాలోని రైతాంగం సహకరించాలని జేసీ కోరారు.

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్య


కోవిద్ (ఫైల్)

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి ముడారపు కోవిద్(13) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపాడ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న కోవిద్ కొంతకాలంగా కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక వ్యవసాయం కోసం తెచ్చిన క్రిమిసంహారక గుళికలు తాగేశాడు. తర్వాత బాధ తట్టుకోలేక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు హుటాహుటిన ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రిలో ఉంచారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మరణించిన కామునాయుడు, ఈశ్వరరావు

డెంకాడ: మండలంలోని బొడ్డవలస జంక్షన్ సమీపంలో విజయనగరం–విశాఖ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన సారిక కామునాయుడు(47), డెంకాడ మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన మామిడి ఈశ్వరరావు(45)లు విజయనగరం నుంచి మోదవలస వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా బొడ్డవలస జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టి కొంతదూరంలో కింద పడిపోయారు. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు కామునాయుడికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తె ఉన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలు..


మృతిచెందిన దేవుడమ్మ

విజయనగరం క్రైమ్: దివ్యాంగురాలైన ఓ వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని బుధవారం మృతి చెందింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అలమండకు చెందిన దేవుడమ్మ (65) జిల్లా కేంద్రాస్పత్రికి వచ్చింది. వైద్యులకు చూపించుకున్న తర్వాత స్థానిక ఆర్‌అండ్‌బీ కంటోన్మెంట్ మలుపు దాటుతుండగా విజయనగరం నుంచి సాలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. వెంటనే స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

40 మద్యం సీసాల పట్టివేత

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను ఎక్సైజ్ ఎస్సై అప్పారావు మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. ఈ మేరకు గ్రామంలోని నలుగురు వ్యక్తుల నుంచి 40సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

నాలుగున్నర కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో నాలుగున్నర కిలోల గంజాయిని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అరకులో గంజాయి కొనుగోలు చేసి స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న లాడ్జిలో బ్యాగ్‌లో సర్దుకుని ఢిల్లీ వెళ్లేందుకు మంగళవారం రాత్రి బయలుదేరారు. వన్‌టౌన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా ఒక్కొక్కరి దగ్గర కేజీన్నర చొప్పున పట్టుబడిన నాలుగున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ ఎస్సై రామ్‌గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	50,130–00
బంగారం(22కి. 10గ్రా.)	45,950–00
వెండి (కిలో)	62,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

బాలికా.. భయం లేదిక

- లైంగిక వేధింపుల నుంచి రక్షణ
- ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె
- జిల్లావ్యాప్తంగా 2234 పాఠశాలల్లో ఏర్పాటు


ఎల్ కోట మండలంలోని ఉన్నత పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

విజయనగరం పూల్‌బాగ్/రామభద్రపురం: మేలిమి బంగరు తల్లులు..కలువ కన్నుల కన్నెలు.. తల్లులు గన్న పిల్లలు..బడికెళ్లినా..బయటకు వచ్చినా..భరోసా లేకుండా పోతోంది. వారిపై జరుగుతున్న దారుణాలను ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా కుంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆడపిల్లల భద్రత కోసం ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. అందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థినులకు భరోసా కల్పిస్తూ ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేస్తోంది.ఆకతాయిలు విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా ఫిర్యాదు చేసేలా చర్యలు తీసుకుంది. అలాగే ఎవరైనా తప్పుడు ఉద్దేశ్యంతో బాలికలను తాకినా, అనుకోకుండా ఆపద ఎదురైతే ఎవరికి చెప్పాలి.ఎలా తెలియజేయాలి అనే విషయాలను పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన ప్లెక్సీలు, పోస్టర్లలో తెలియజేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పదిరోజుల నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ప్రభుత్వం బాలికా విద్యకు పెద్దపీట వేయడమే కాకుండా వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో పోస్టర్ల ఏర్పాటు

బాలికా సంరక్షణలో భాగంగా బ్యాడ్‌టచ్..గుడ్‌టచ్.. లైంగిక వేధింపులు తదితర వాటిపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.ఇందులో భాగంగా రెండుపోస్టర్లను ఏర్పాటు చేశారు.ఒకదానిలో వేధింపులు ఎలా గుర్తించాలి? ఏవిధంగా స్పందించాలి అనే అంశాలు పొందుపరిచారు.మరోదానిలో ఆపద సమయంలో ఎవరికి తెలియజేయాలనే విషయాన్ని విద్యార్థులందరికీ కనిపించేలా ప్రదర్శిస్తున్నారు.ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లను ముద్రించారు. ఏదైనా అత్యవసరం, ఆపదలో చిక్కుకున్నప్పుడు ఆ నంబర్లకు కాల్‌చేస్తే తక్షణం చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుంది.

15 రోజులకోసారి ఫిర్యాదుల పరిశీలన

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లు కలిపి 2,232 ఉండగా 2,38,177 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎం గదికి సమీపంలో అందరికీ కనిపించేలా బాలికల కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. దానిని ప్రతి పదిహేను రోజులకోసారి ఎంఈఓ పర్యవేక్షణలో మహిళాపోలీసు,వైద్య ఆరోగ్యశాఖ ఏఎన్ఎం సమక్షంలో తెరిచి పరిశీలిస్తారు. ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.ఫిర్యాదులు,సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తారు. బాలికా సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లను ప్రత్యేకంగా పోస్టర్లలో ముద్రించి విద్యార్థినులు, పాఠశాలకు వచ్చే సందర్శకులకు కనిపించేలా ఏర్పాటు చేశారు. బాలికల ప్రవర్తనలో ఆకస్మిక మార్పు, ముభావంగా ఉండడం, ఇతరుల నుంచి దూరంగా ఉండడం, భయంభయంగా ఉండడం, ఆహారం,నిద్రలో మార్పులు తదితర వాటిని బట్టి వేధింపులకు గురయ్యారని గుర్తించవచ్చు. అనుమానం వచ్చిన వెంటనే బాధితులు, వారికి సంబంధించిన వ్యక్తులు సహాయం పొందేందుకు చైల్డ్‌లైన్ 1098,పోలీసు 100, దిశ 112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, అత్యవసర సేవల కోసం 108కు 24 గంటల్లో ఏ సమయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చు.

గోప్యంగా ఫిర్యాదుదారుల పేర్లు



వేధింపులపై ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. దారుణాలకు పాల్పడిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి. పాఠశాలల్లో పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి అవగాహన కల్పిస్తున్నారు. బాలికలకు భరోసాగా నిలవాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అమ్మాయిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. – డాక్టర్ వీఏ స్వామినాయుడు, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి,విజయనగరం.

అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలికల సంరక్షణకు అన్ని పాఠశాలల్లో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇచ్చాం. విద్యార్థినులకు గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తక్షణం అధికారులకు తెలియజేయాలి.ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం.

మంచి ఆలోచన...



రాష్ట్ర ప్రభుత్వం బాలికల భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు శ్రీకారం చుట్టడం మంచిది.వేధింపులకు గురవుతున్న బాలికలకు ఇలాంటి నిర్ణయం ఆత్మస్థైర్యాన్నిస్తుంది. దీనిపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తాం.

– వంగపండు రమాదేవి, సైన్స్‌టీచర్, ఉన్నత పాఠశాల రామభద్రపురం

సచివాలయం వీహెచ్‌ఏపై సస్పెన్షన్ వేటు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు సచివాలయం వీహెచ్‌ఏ (గ్రామ ఉద్యానవనశాఖ సహాయకుడు) కె.రవిపై వ్యవసాయశాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ప్రభుత్వం నుంచి రైతుభరోసా కేంద్రానికి వచ్చిన ఎరువులను అమ్మగా వచ్చిన డబ్బులను వీహెచ్‌ఏ తిరిగి ప్రభుత్వానికి చెల్లించలేదు. ఎరువుల డబ్బులు సుమారు రూ.4లక్షలు ఏమయ్యాయన్న వివాదం తలెత్తిన నేపథ్యంలో ఎరువుల డబ్బును మండల వ్యవసాయాధికారికి అందించానని వీహెచ్‌ఏ రవి గ్రామంలో పలువురి వద్ద చెప్పినట్లు సమాచారం. ఈమేరకు వ్యవసాయాధికారులు గ్రామంలో విచారణ చేపట్టి ఎరువుల డబ్బును ప్రభుత్వానికి చెల్లించని కారణంగా సస్పెన్షన్ విధించారు. ఈ విషయంపై వ్యవసాయశాఖ ఏడీఏ కోటేశ్వరరావును వివరణ కోరగా గ్రామంలో విచారణ చేపట్టామని, రైతుభరోసా కేంద్రంలో గల ఎరువులు అమ్మగా వచ్చిన డబ్బును చెల్లించని కారణంగా డ్యూస్ ఉండడంతో సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. అలాగే పర్యవేక్షణ లోపం కారణంగా మండల వ్యవసాయాధికారిణి టి.సంగీతను వేరే ప్రాంతానికి మార్చినట్లు తెలిపారు.

తాత్కాలిక వలంటీర్ల నియామకం

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో తాత్కాలిక వలంటీర్లను అధికారులు నియమించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి పంచాయతీ ప్రజలకు తాత్కాలిక వలంటీర్ల ద్వారా అందనున్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు 21 మంది తాత్కాలిక వలంటీర్లు నియమితులయ్యారు. శంబరలో ఇంతవరకు వలంటీర్లు లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు చొరవతో తాత్కాలిక వలంటీర్ల నియామకం జరగడంతో శంబర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బోర్డుల కొనుగోలులో తేడా..!

- బోగస్ సంస్థకు రూ.లక్ష బిల్లు జమ
- ఏపీఓ, ఈసీలకు షోకాజ్ నోటీసులు


జక్కువ గ్రామంలో ఏర్పాటు చేసిన వర్క్‌సైడ్ బోర్డు

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల్లో వలస కూలీలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న ఉపాధిహామీ పనులకు సంబంధించి కొనుగోలు చేసిన వర్క్‌సైడ్ బోర్డులలో చిలక్కొట్టుడు జరిగింది. మెంటాడ మండలంలో వెలుగు చూసిన ఈ వ్యవహారంలో ప్రధాన పాత్రదారులుగా ఏపీఓ, ఈసీ ఉన్నట్లు జిల్లాస్థాయి అధికారులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల నివేదికలను తెలిపేందుకు ఏర్పాటు చేయనున్న బోర్డులను ప్రకాశం జిల్లా బట్టల వ్యాపారి నుంచి బోగస్ ఫర్మ్‌పేరుతో రూ.2లక్షల 90వేలతో 211 బోర్డులు కొనుగోలు చేశారు. అయితే గతేడాది డిసెంబరులోనే ప్రకాశం జిల్లా వాసి ఫర్మ్ రద్దు అయినట్లు కొనుగోలు చేసిన బోర్డులను బోగస్ సంస్థ పేరుతో మెంటాడ అధికారులు తీసుకున్నట్లు ఉన్నతాధికారుల నివేదికలో తేటతెల్లమైంది. ఒక్కో బోర్డుకు సైజును బట్టి రూ.700, రూ.800, రూ.1500లతో మొత్తం రూ.2 లక్షల 90వేలకు ఉపాధిహామీ అధికారులైన ఏపీఓ, ఈసీ కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రకాశం జిల్లా వాసికి ఇప్పటికే బోర్డుల కొనుగోలులో లక్షరూపాయల వరకు పేమెంట్ చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఏపీఓ, ఈసీ సదరు ప్రకాశం జిల్లా కాంట్రాక్టర్ మధ్య వాటాలు కుదరకపోవడంతో ఈ విషయం జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారి ఉమాపరమేశ్వరి దృష్టికి వచ్చింది. దీంతో ఏపీఓ, ఈసీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు డీఆర్‌డీఏ పీడీ ఉమా పరమేశ్వరి తెలిపారు.

బిల్లుల్లో లోపాలు

ఈ విషయమై ఈసీ దుర్గాప్రసాద్ వద్ద సాక్షి ప్రస్తావించగా కమిటీ వేయకుండా బిల్లు చెల్లించడం వాస్తవమేనని ఏపీఓ ప్రమేయంతో లక్షరూపాయల బిల్లు చెల్లించినట్లు చెప్పారు. అయితే వేదాంశి ఎంటర్‌ప్రైజస్ ప్రకాశం వారు ఇచ్చిన బిల్లుల్లో లోపాలు ఉండడంవల్ల రూ.లక్షా 90వేలు నిలిపివేశామన్నారు.

ఈసీ పర్యవేక్షణలో..

ఈ విషయమై ఏపీఓ హరనాథ్ దగ్గర సాక్షి ప్రస్తావించగా ప్రకాశం జిల్లా వాసినుంచి 211బోర్డులు కొనుగోలు చేయడం వాస్తవమేనని, దీనికి సంబంధించి ఇప్పటికే లక్ష రూపాయల బిల్లును చెల్లించినట్లు చెప్పారు. ఈ తతంగమంతా ఈసీ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో జరిగినట్లు తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు

- ప్రభుత్వ కళాశాలల్లో విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ
- ఉత్తమ ఫలితాల కోసం స్టడీ అవర్స్
- ఆర్‌ఐఓ సత్యనారాయణ

చీపురుపల్లి: జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మజ్జి సత్యనారాయణ హెచ్చరించారు. చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని కళాశాలలను తనిఖీ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ కార్పొరేట్ కళాశాలలోను ల్యాబ్ ఉండాలని, అక్కడే ప్రాక్టికల్స్ జరగాలని సూచించారు. ల్యాబ్ లేకపోయినా, రిజిస్టర్లు నిర్వహించకపోయినా, ప్రాక్టికల్స్ జరగకపోయినా సంబంధిత కళాశాల గుర్తింపు రద్దు చేసేందుకు సిఫార్స్ చేస్తామన్నారు. విజయనగరం జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 మోడల్ జూనియర్ కళాశాలలు, 95 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 18 ఒకేషనల్ కళాశాలలు, 25 కేజీబీవీ, 9 సాంఘిక సంక్షేమశాఖ, ఒక గురుకుల కళాశాల, మూడు ఇన్సెంటివ్ జూనియర్ కళాశాలలు ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రత్యేక విద్యాప్రణాళిక రూపొందించినట్టు వెల్లడించారు. ప్రతీరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామని చెప్పారు. ఆయన వెంట స్థానిక కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ ఉన్నారు.


గద్దె దిగి పోయినా కూడా..!

- మాజీ ఎమ్మెల్యే నిర్వాకం
- ప్రభుత్వ కళాశాలలో చెట్ల నరికివేత
- అడ్డుకున్న ప్రిన్సిపాల్‌పై బెదిరింపులు


కళాశాలలో నరికివేసిన చెట్ల దుంగలు

చీపురుపల్లి: అదొక ప్రభుత్వ జూనియర్ కళాశాల. రెండు దశాబ్దాల క్రితం ఆ కళాశాలకు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ నాయకుడు గద్దే బాబూరావు ఫౌండర్‌గా ఉన్నారు. తరువాత కాలంలో ఆ కళాశాల ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కార్యకలాపాలన్నీ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు కూడా ఆయనే కళాశాల ఫౌండర్‌గా వ్యవహరిస్తూ అధికారాన్ని చలాయిస్తున్నారు. దీనికి తాజాగా ఆ కళాశాలలో జరిగిన చెట్ల నరికివేత ఆధారంగా నిలుస్తోంది. స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాజాగా మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు పర్యవేక్షణలో పలు చెట్లు నరికివేశారు. ఆ సమయంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ అడ్డుకున్నప్పటికీ ఆయనపై బెదిరింపులకు దిగుతూ చెట్లను నరికివేయించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు విస్మయానికి గురవుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి పనుల్లో భాగంగా నాడు–నేడు పథకం కింద రూ.85 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులకు ఈ నెల 16న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఆ కార్యక్రమం అనంతరం కళాశాలకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కళాశాల అభివృద్ధి కమిటీ రిజిస్టర్ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను అడిగి తీసుకుని చూసి అందులో తన పేరు ఎందుకు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కళాశాల సిబ్బంది చెబుతున్నారు. ఆ సమయంలోనే చెట్ల నరికివేతకు మనుషులను పెట్టినట్లు సమాచారం. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లు నరికివేయరాదని ప్రిన్సిపాల్ వారించినప్పటికీ పట్టించుకోనట్లు తెలుస్తోంది. ఇదే విషయమై కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కళాశాలకు వచ్చి చెట్లు నరికివేతను ప్రోత్సహించారని తాను అడ్డుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

సేంద్రియ సాగు బాగు


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

మెరకముడిదాం: డ్వాక్రా మహిళలు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ సూచించారు. మండలంలోని గొల్లలమర్రివలస, గాతాడ, గరుగుబిల్లి, యాడిక గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఏడాదిపాటు పంటలు సాగుచేయడం వల్ల అధిక ఆదాయం వస్తుందన్నారు. సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు చేతికొస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.అప్పారావు, ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, రైతు సంఘం అధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తిరాజు, ఏట శ్రావణితేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురజాడ 160వ జయంతి

- వేడుకల్లో పాల్గొననున్న ప్రముఖులు


గురజాడ వేంకట అప్పారావు


ప్రవల్లికా నారాయణ్ వేసిన గురజాడ కన్యాశుల్కం చిత్రం


గురజాడ స్వగృహం

విజయనగరం టౌన్: తన సాహితీ సౌరభంతో విజయనగరం ఖ్యాతిని దశదిశలా చాటిన మహాకవి గురజాడ వేంకట అప్పారావు 160వ జయంతిని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు గురజాడ స్వగృహంలో జ్యోతిప్రజ్వలన, చిత్రపటానికి పూలమాలంకరణ చేస్తారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులతో గురజాడ కాంస్య విగ్రహం వద్ద 'దేశమంటే మట్టికాదోయ్' సామూహిక గీతాలాపన చేస్తూ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తారు.

మహాకవి ప్రస్థానం..

సామాజిక సమస్యలపై సాహితీ సమరం పూరించి, విశ్వ సాహితీ వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మిన సాహితీ సౌరభం మన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. 1862 సెప్టెంబరు 21న రాయవరంలో ఆయన జన్మించారు. మహారాజా విద్యాసంస్థల్లో గిడుగు సహ విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. 23వ ఏట అప్పలనరసమ్మతో ఆయనకు వివాహం జరిగింది. వారికి వెంకట రామదాసు, కొండయమ్మలు సంతానం. అప్పట్లో సంస్కృత భాషకు ఆదరణ ఎక్కువగా ఉండేది. ఆ సమయంలో 1883లో సారంగధర, డామిట్ కథ అడ్డం తిరిగింది, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, లవణరాజు కల, నీలగిరి పాటలు, కాసులు, బిల్హణీయం, కన్యక, సుభద్ర, దించు, లంగరు,తదతర ఎన్నో అద్భుతమైన రచనలు తెలుగులో ఆయన చేశారు. అన్నింటికన్నా మించి ×దేశమును ప్రేమించుమన్నా..అంటూ దేశభక్తి గేయాన్ని రాసి విమర్శకుల ప్రశంసలు పొందారు. సామాన్యునికి అర్థమయ్యేవిధంగా ముత్యాలసరాలు రచించారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కన్యాశుల్కం పేరుతో 1892 ఆగస్టు 13న తొలికూర్పును ప్రదర్శించి 1897లో ఆనందగజపతికి అంకితం ఇచ్చారు. రెండో కూర్పును 1909లో ప్రచురించారు. రాజా వారి కోర్టు దావాలలో ఎడతెరిపి లేకుండా ఆ భారాన్నంతా తన భుజాన వేసుకుని పనులు చేశారు. అప్పటికే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. 1915 నవంబరు 30న ఉదయం 8.20 గంటలకు ఆ మహనీయుడు కన్నుమూశారు.

గురజాడ చిత్రంలో కన్యాశుల్కం

గురజాడ రచించిన కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ వంటి నాటకాల్లోని సన్నివేశాలను ఆయన చిత్రంలోనే తన కుంచెతో చిత్రీకరించిన పట్టణానికి చెందిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత ప్రవల్లికా నారాయణ్ ప్రముఖుల మన్ననలు అందుకుంటున్నారు. గురజాడ స్వగృహంలో ఆమె వేసిన చిత్రాలు ఇప్పటికీ అందరినీ ఆకర్షిస్తున్నాయి.

గురజాడ 'దేశభక్తి' పుస్తకావిష్కరణ


దేశభక్తి పుస్తకావిష్కరణ చేస్తున్న గురజాడ వారసులు

అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురజాడ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం గురజాడ స్వగృహంలో గురజాడ 'దేశభక్తి' పేరుతో రచించిన పుస్తకాన్ని గురజాడ వారసులు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిరలు ఆవిష్కరించారు. అరసం ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ సభకు ఆహ్వానం పలికారు. సాహితీస్రవంతి ప్రతినిధి చీకటి చంద్రికారాణి దేశభక్తిగీతాలాపన చేశారు. అనంతరం అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్.చలం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలిప్రతిని నాలుగెస్సుల రాజు స్వీకరించారు. సాహితీవేత్త, కవి, విమర్శకులు బసు పోతన (విశాఖ) మాట్లాడుతూ గురజాడ దేశభక్తి గేయం విశ్వగీతమని, మానవ గీతమని, ఏ దేశానికైనా ఈ గీతం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

స్వగ్రామానికి జవాన్ పార్థివ దేహం

- జై జవాన్ అంటూ పెద్ద ఎత్తున ప్రజల ర్యాలీ


భీమసింగి చేరిన వర్మ పార్థివ దేహం ఉన్న వ్యాన్


'జై జవాన్' నినాదాలు చేస్తున్న ప్రజలు

జామి: మండలంలోని తాండ్రంగి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గనివాడ వర్మ విధి నిర్వహణలో రాజస్థాన్‌లో ఈనెల 18న ట్రక్ బోల్తా పడి మృతిచెందిన విషయం విదితమే. ఆయన పార్థివ దేహం ఢిల్లీ నుంచి మంగళవారం సాయంత్రం విశాఖ ఎయిర్ పోర్ట్‌కు, అక్కడినుంచి రాత్రి 8గంటలకు మండలంలో భీమసింగి గ్రామానికి చేరుకుంది. ఈ మేరకు తాండ్రంగి, జామి.భీమసింగి తదితర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో ప్రజలు భీమసింగి గ్రామానికి చేరుకుని జై..జవాన్ వర్మ అమర్‌రహే.. అంటూ జాతీయ జెండాలతో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తు ర్యాలీగా స్వగ్రామం తాండ్రంగి గ్రామానికి పార్థివ దేహాన్ని తరలిలించారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎస్సై వీరబాబు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. తాండ్రంగిలో అధికార సైనిక లాంఛనాలతో జవాన్ వర్మ అంత్య క్రియలు బుధవారం జరుగుతాయని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో బుధవారం జరిగింది. ఆలయ వేదపండితులు తాతా రాజేష్, సాయిలు శాస్త్రోక్తంగా అమ్మవారి యాగాన్ని నిర్వహించారు. అమ్మవారి యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డుకు మరమ్మతులు



సర్వీసు రహదారికి మరమ్మతులు చేయిస్తున్న పోలీసు సిబ్బంది

పూసపాటిరేగ : మండల కేంద్రమైన పూసపాటిరేగలో సర్వీసు రహదారికి మరమ్మతులు చేస్తున్నారు. సర్వీసు రహదారి గతుకులు మయం కావడంతో పోలీస్ శాఖ సిబ్బంది గతుకులను పూడ్చటానికి చర్యలు చేపట్టారు. తరుచూ సర్వీసు రహదారిలో ప్రమాదాలు జరగడంతో మరమ్మతు పనులు స్వంతంగా చేయించారు. పూసపాటిరేగ ముఖద్వారం నుంచి గ్రామం శివారు వరకు సర్వీసు రహదారికి తారు, మెటల్‌తో మరమ్మతులు చేపట్టారు. భోగాపురం సీఐ కె.వి.వి. విజయనాథ్, ఎస్ఐ ఎ.నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిబ్బంది

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 180 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పతివాడ రామకృష్ణ, టోల్‌ప్లాజా ప్రెసిడెంట్ కర్రోతు శంకర్, వైద్యులు మనోజ్‌కుమార్, పి.విద్యాధర్, మౌనిక, కిన్నెరేష, గణేష్, వై.ఝాన్సీ, ఎం.నూకరాజు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రం శివారు, కోరుకొండ రోడ్డులో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పీవీఎస్ చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతభిషేకం, సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, కంచర్ల రాజేశ్వరరావు, రాధ దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రాండ్ పేరెంట్స్ డే వేడుక



వేడుకలో పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్

శృంగవరపుకోట: పెద్దలను గౌరవించడం మన సంప్రదాయమని స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంతిమహంతి అన్నారు. పాఠశాలలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌ను పాఠశాలకు ఆహ్వానించి సత్కరించారు. వారి మనుమలతో వారికి పాదపూజ చేయించారు. పెద్దలు తమ అనుభవాలను పిల్లలకు వివరించారు. కార్యక్రమానికి ప్రభుత్వ ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

పైడితల్లికి పుష్పాలంకరణ

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చిన కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయమంతా పుష్పశోభితంగా సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి ఘటాలను సమర్పించారు. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం బయట భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బిహెచ్‌విఎస్ఎస్.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, ఏడిద రమణ, మూలా పాపారావులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించి, తరించారు.

– విజయనగరం టౌన్



పుష్పాలంకరణలో ఉన్న పైడితల్లి అమ్మవారు



తలనీలాలర్పిస్తున్న బాలుడు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొక్కల సంరక్షణకు చర్యలు

● డ్వామా పీడీ ఉమ పరమేశ్వరి

నెల్లిమర్ల: గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలను తప్పనిసరిగా సంరక్షించాలని డ్వామా పీడీ జి.ఉమ పరమేశ్వరి ఆదేశించారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలోని అవెన్యూ ప్లాంటేషన్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త వాటిని నాటాలని సూచించారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే ఆయా క్షేత్ర సహాయకులదే బాధ్యత అని పీడీ స్పష్టం చేశారు. అలాగే పని ప్రదేశాల్లో వివరాల బోర్డులను అందుబాటులో ఉంచాలన్నారు. పీడీ వెంట ఏపీఓ అరుణకుమారి, క్షేత్ర సహాయకులు జె శ్రీనివాసరావు ఉన్నారు.

సంస్థల స్థాపన యువతరంతోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎంటర్‌ప్రెన్యూర్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ గీతారెడ్డి

విజయనగరం అర్బన్: పారిశ్రామిక సంస్థల వ్యవస్థాపక సామర్థ్యం కళాశాల దశ నుంచి విద్యార్థులు అలవర్చుకోవాలని ఎంటర్‌ప్రెన్యూర్ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ గీతారెడ్డి అన్నారు. స్థానిక గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన 'హౌ టూ గ్రూమ్ యువర్ సెల్ఫ్ ఇన్టూ ఎంటర్‌ప్రెన్యూర్' సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరికి ఉద్యోగాలు కల్పించే స్థితిలో ఉండడానికి అవసరమైన వ్యవస్థల స్థాపనకు యువతరం ముందుకు రావాలని అన్నారు. అందుకు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే దిశగా కళాశాలల్లో బోధన శైలికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యష్మీ సొల్యూషన్స్, భవిష్యత్ ఎంటర్‌ప్రెన్యూర్ కోసం విద్యార్థులు అమలు చేయాల్సిన వినూత్న ఆలోచనల గురించి వివరించారు.

ఎంటర్‌ప్రెన్యూరీషిప్ ఇన్నోవేషన్ స్టార్టప్ సెంటర్ లక్ష్యాలు, విధులు, మెరుగైన స్టార్టప్ కోసం చేపట్టాల్సిన వ్యాపార వ్యూహాల గురించి చర్చించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన విభిన్న వినూత్న ఆలోచనలకు ప్రత్యక్ష ఉదాహరణలను ఆమె వివరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. సదస్సులో కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ జి.రవికిషోర్, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ లక్ష్మి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టుల రద్దు ఉపసంహరించుకోవాలి

● ఏసీపీ పార్ట్ టైమ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్

విజయనగరం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ ఉద్యోగ భద్రత, రెగ్యులర్ పోస్టులు రద్దు ఆలోచన ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆర్ట్, క్రాఫ్ట్ మరియు పీఈటీ పార్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు. కొత్తగా ఎంఈఓ పోస్టుల సృష్టించడం కోసం ఏకంగా 1,145 రెగ్యులర్ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులను రద్దు చేస్తూ ఇచ్చిన జీఓ 154ను ఉపసంహరణ చేయాలని కోరారు. కాంట్రాక్టు పద్ధతిలో రూ.14,203 వేతనంతో పని చేస్తున్నామని ఉద్యోగ భద్రత రీత్యా మినిమమ్ టైం స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జి.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి డి.నరసింహులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న సంఘం సభ్యులు

ఘనంగా అక్కినేని జయంతి



అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

విజయనగరం టౌన్: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 99వ జయంతిని పురస్కరించుకుని జిల్లా అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ ప్రతినిధులు మంగళవారం స్థానిక ఆదిత్య థియేటర్‌లో ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కంటుభుక్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అక్కినేని తొలి తెలుగు శత దినోత్సవ చిత్ర నటుడు, జానపద చిత్ర రజతోత్సవ నటుడు, తొలి తెలుగు నవలా నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ హరివర్మ, అక్కినేని ఫ్యాన్స్ దుర్గాప్రసాద్, దారా వెంకట్, రవి, చిన్ని, కిరణ్, మదన్, వాసు పాల్గొన్నారు.

నిత్యన్నదానానికి రూ.25వేలు విరాళం

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి సంబంధించి స్థానిక బూర్లపేటకు చెందిన పోలమరశెట్టి జగ్గారావు, జయ దంపతులు ఆలయ ఈఓ కిశోర్‌కుమార్‌కు రూ. 25వేలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు మరింత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్లు ఏడుకొండలు, రామారావు, వర్మ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

డీవీఈఓ విచారణ



మాట్లాడుతున్న డీవీఈఓ ఆర్.సురేష్

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై జిల్లా వృత్తి విద్య అధికారి ఆర్.సురేష్ మంగళవారం విచారణ చేపట్టారు. కళాశాలలో మార్చి నెలలో నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు వచ్చిన కేజీబీవీ విద్యార్థినుల నుంచి భోజనాల కోసం డబ్బులు వసూలు చేశారంటూ అదే కళాశాలలో పనిచేస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సన్యాసిరావు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కోసం వచ్చిన డీవీఈఓ ఆర్.సురేష్ ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి, ఫిర్యాదుదారుడు సన్యాసిరావు నుంచి వివరాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం నాడు–నేడు పనులపై ప్రిన్సిపాల్‌తో సమీక్షించారు.

గర్భాం ఎఫ్ఏపై నేడు విచారణ

మెరకముడిదాం: గర్భాం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై బుధవారం బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఉపాధి ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు మంగళవారం తెలిపారు. 14వ విడత సోషల్ ఆడిట్‌లో గుర్తించి పలు అంశాలపై గరివిడి క్లస్టర్ ఏపీడీ విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు గర్భాం పంచాయతీ కార్యాలయంలో చేపట్టే ఈ విచారణకు ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు, గ్రామ సర్పంచ్, ఫిర్యాదుదారులు, గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు హాజరుకావాలని కోరారు.


25లోగా ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయండి



కనిమెరక సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మహారాజన్

బొండపల్లి: ఈనెల 25వ తేది లోగా అన్ని పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని గజపతినగరం ఏడీఏ కె.మహారాజన్ ఆదేశించారు. మండలంలోని కనిమెరక గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆర్బీకేలో ఈ–క్రాప్ నమోదుతో పాటు రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఉద్యానవన పంటలతో పాటు, వరి ఇతర పంటలు అన్నింటినీ ఈ–క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. నమోదైన పంటలకే ప్రభుత్వం నుంచి రాయితీలు, పరిహారం, పెట్టుబడి సాయం, బ్యాంకుల నుంచి రుణాలు, వడ్డీ రాయితీలు వర్తిస్తాయన్నారు. మండలంలో ఇంతవరకు 2799 మంది రైతుల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు.

స్మార్ట్ ఫోన్లు అందజేత



కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న సీడీపీఓ నాగమణి

గజపతినగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సేవలందిస్తున్న 213 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందజేసిన స్మార్ట్‌ఫోన్లను సీడీపీఓ పి.నాగమణి మంగళవారం పంపిణీ చేశారు. పౌష్టికాహార పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు.

పిల్లలను బడికి పంపించాలి

● సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

నెల్లిమర్ల: పిల్లలను పనికి కాకుండా బడికి పంపించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి.లక్ష్మీకుమారి అన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహనా సదస్సులో పాల్గొన్న ఆమె గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను బడికి కాకుండా పనికి పంపించే వారు న్యాయస్థానం విధించే శిక్షలకు గురవుతారని హెచ్చరించారు. పిల్లలందరికీ చదువుకునే హక్కు ఉందని, వారిని ఉన్నత చదువులు చదివించాలని లక్ష్మీకుమారి సూచించారు. ఎక్కడా బాల కార్మికులు కనిపించరాదని అన్నారు. సీనియర్ అడ్వకేట్ ఎంజెవిఎస్ఎన్.తాడిరాజు చట్టాల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని సూచించారు. సర్పంచ్ కె.సూర్యకళ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో చైల్డ్‌లైన్ 1098 మేనేజర్ జికె.దుర్గ, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

కదిరి వేరుశనగతో అధిక దిగుబడి

విజయనగరం ఫోర్ట్: సాధారణ రకం కంటే కదిరి లేపాక్షి రకం అధిక దిగుబడిని ఇస్తుందని అనంతపురం ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం (అనంతపురం) వేరుశనగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.శివశంకర్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం, కోరాడపేట గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. సాధారణ వేరుశనగ రకానికి, కదిరి లేపాక్షి రకానికి ఉన్న గుణగణాల తేడా తెల్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15నుంచి 60 కొమ్మలతో ఆకుల తక్కువగా తెగుళ్లను పురుగులను తట్టుకొని చెట్టుకు 100కు పైగా కాయలు కాసి మంచి దిగుబడిని లేపాక్షి రకం ఇస్తుందన్నారు. ఈ రకం ఎకరాకు 30 కిలోలు విత్తనం సరిపోతుందని చెప్పారు. అదే సాధారణ రకం అయితే రైతులు 80 కిలోల వరకు విత్తనం వాడుతారని తెలిపారు. ఎకరాకు లేపాక్షి రకం 70 నుంచి 80 బస్తాలు(40 కిలోలు) దిగుబడి వస్తుందన్నారు. ఈ రకానికి రెండు రెట్లు ఎరువులను వాడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్, శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షి రకాన్ని పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త శివశంకర్‌నాయక్

హెల్ప్ డెస్క్‌ల వద్ద ఆరోగ్యమిత్రలు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉన్న హెల్ప్ డెస్క్ వద్ద ఆరోగ్యమిత్రాలు అందుబాటులో ఉండాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. స్థానిక తిరుమల ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్యమిత్రాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మిత్రాలు సమయ పాలన పాటించాలన్నారు. అర్హుల అందరికి ఉచితంగా వైద్యం, ఆరోగ్య ఆసరా అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య మిత్రాలదేనని చెప్పారు. వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చిన వారికి సకాలంలో వైద్యం అందే విధంగా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన అందుతున్నది లేనిది నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. సిబ్బంది ఎవరైనా రోగుల నుంచి చేతివాటం ప్రదర్శిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. సమావేశంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్ధనరావు, రాయవరపు ముత్యాలనాయుడు, భానుప్రసాద్, ఉమ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

గోరుముద్ద పరిశీలన

నెల్లిమర్ల: పట్టణంలోని రెల్లివీధి బాలికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్దను ఎంపీడీఓ జి గిరిబాల, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు వండి పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసారు. ప్రతిరోజూ రుచికరంగా వండి పెడుతున్నదీ, లేనిదీ విద్యార్థులను ఆరా తీశారు. మెనూ ప్రకారం రుచిగా, శుచిగా వండి పెట్టాలని నిర్వాహకులకు ఆదేశించారు. వంటలు వండుతున్న ప్రదేశాన్ని నిత్యం శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో వాడుక నీరు నిల్వ ఉండటాన్ని గమనించిన అధికారులు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట ఈఓపీఆర్‌డీ హెచ్ భానోజీరావు ఉన్నారు.

భూసర్వేపై శిక్షణ



భూసర్వేపై జరుగుతున్న శిక్షణ తరగతులు

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్షణ పథకం అమలులో భాగంగా అర్బన్ రీసర్వే శిక్షణ తరగతులు రెండో రోజు జరిగాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళికా కార్యదర్శులకు సమగ్రమైన సమాచారాన్ని శిక్షకులు అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ సింహాచలం మాట్లాడుతూ భావితరాలకు ఎంతో ఉపయోగంగా ఉండే రీ సర్వే బాధ్యతాయుతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

ఎక్కడ ఏమరపాటు లేకుండా పూర్తి పారదర్శకంగా క్షుణ్ణంగా సర్వే నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న రీ సర్వే వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందన్న విషయమై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు.

అందరి సహకారంతో అమ్మ జాతర

విజయనగరం:

విజయనగర ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. పైడితల్లమ్మ జాతర సందర్భంగా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. గతంలో జరిగిన లోటుపాట్లను అధిగమిస్తూనే ఈసారి ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు కోవిడ్ కారణంగా భక్తులకు పైడితల్లమ్మ జాతర చూసే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందన్న ఆలోచనతో అందుకు తగ్గట్టుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన చర్యల గురించి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీరు వంటి విషయాలలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. జాతర మొత్తాన్ని ఏడు సర్కిల్‌గా విభజించి ఆయా ప్రాంతాలలో అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నామని చెప్పారు. చిన్నచిన్న రహదారి మరమ్మతులను చేపట్టి సిరిమాను తిరిగేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పామన్నారు. విద్యుత్ దీపాలు సక్రమంగా వెలిగే విధంగా చూడాలన్నారు. నిరంతరం తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే దాహార్తిని తీర్చేందుకు ఎక్కడికక్కడ తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బహిర్భూమికి ఇబ్బందులు లేకుండా బయోటాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఈఈ కే. శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదన్ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, డీఈ అప్పారావు, ఏఈలు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు

సభా సమయం



"టీడీపీ పాలనలో రాష్ట్రంలో వైద్య రంగం కునారిల్లిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలుకలు కొరికి పిల్లలు చనిపోవడం, సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో ఆపరేషన్ చేయడం వంటి ఘటనలు అప్పట్లో చూశాం. మనందరి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత విప్లవాత్మక చర్యలతో వైద్య, ఆరోగ్య రంగానికి చికిత్స చేశాం. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశాం. నిరుపేదలు పెద్ద జబ్బుల బారినపడినప్పుడు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదని వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి తీసుకువచ్చాం. అంటే నెలకు రూ.40 వేల ఆదాయం ఉండే మధ్యతరగతి కుటుంబాలకూ పథకాన్ని వర్తింపజేశాం.

– శాసనసభలో నాడు–నేడుపై చర్చ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మీడియా పాయింట్

టీడీపీ వికృత చేష్టలు ప్రజలు చూస్తున్నారు

• మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



అసెంబ్లీలో టీడీపీ వికృత చేష్టలను ప్రజలు గమనిస్తున్నారు. సంక్షోభంలో సంక్షేమం అంటున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. సన్ క్షేమం (తన కొడుకు క్షేమం) కోసం పాటుపడ్డారు. అందుకోసం అధికారాన్నంతా ఉపయోగించారు. ఈ విషయం గ్రహించిన ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీని పక్కనపెట్టారు. ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసింది చంద్రబాబు కాదా?, కిలో బియ్యం రూ.2 నుంచి రూ.5.50కి పెంచింది బాబు కాదా? వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను మా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుంటే సంక్షేమం సంక్షోభమని ఆరోపిస్తారా? వాస్తవాలను కప్పిపుచ్చి అబద్ధాలే అజెండాగా ఎల్లో మీడియాలో ప్రచారం చేసినంత మాత్రాన నిజమైపోదు.

వారు కూడా విమర్శించడమే!

• మంత్రి ఆర్కే రోజా



టీడీపీ సభ్యులు సభలో ఏం మాట్లాడాలో తెలియక పిచ్చి పట్టినట్టు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం 2016 – 18 మధ్య ప్రజా సాధికార సర్వే పేరిట ప్రజల నుంచి సేకరించిన డేటా చౌర్యానికి పాల్పడింది. ఇది డేరా బాబా ఘాతుకం కంటే ప్రమాదకరం. చంద్రబాబు టెలిఫోన్ల ట్యాపింగ్ కోసం సాఫ్ట్‌వేర్ కొన్నారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆనాడే చెప్పారు. మోసాల్లో చంద్రబాబు దిట్ట. డ్వాక్రా మహిళలకు రూ.30 వేల కోట్ల బకాయిలు ఎగ్గొట్టి వెళ్లారు. ఎన్టీఆర్‌కు, ఆయన సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారు. మా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం ఏమిటో గడప గడపకు వెళితే తెలుస్తుంది. సీఎం వైఎస్ జగన్ 98 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చారు. వచ్చే నెలలో కళ్యాణమస్తును ప్రారంభిస్తాం. పార్టీ అధ్యక్షుడంటే ఎలా ఉండాలో జగనన్నను చూసి నేర్చుకోవాలి, అనుక్షణం ప్రజల్లోనే ఉండి ఆయన సీఎం అయ్యారు. జెండా, అజెండా లేని వీకెండ్ నాయకుడు పవన్ కూడా విమర్శించడం హాస్యాస్పదంగా ఉంది.

అతిపెద్ద స్కాం.. డేటా చౌర్యం

• ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేష్‌లు కలిసి చేసిన డేటా చౌర్యం దేశ చరిత్రలో జరిగిన అతిపెద్ద స్కాముల్లో ఒకటిగా నిలిచింది. ఆనాడు ఐటీ మంత్రిగా లోకేష్ అధికారాన్ని దుర్వినియోగం చేశారు. ప్రజా సాధికార సర్వే పేరుతో ప్రజల నుంచి వివరాలు సేకరించి, తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారి ఓట్లను చెరిపేసేందుకు ప్రయత్నించారు. మరోపక్క ఆ వివరాలను పలు ఐపీ అడ్రస్‌ల ద్వారా ప్రైవేటు సంస్థ అయిన సేవామిత్ర యాప్ వారికి అందించారు. ఒక్క ఐపీ అడ్రస్‌లోనే 14 టెరాబైట్ల డేటా బదిలీ అయింది. ఇందులో 30 లక్షల మందికి పైగా ప్రజలు, ఉద్యోగులకు సంబంధించిన అన్ని వివరాలతో పాటు బ్యాంకు వివరాలు సైతం బదిలీ చేశారు. పటిష్టమైన ప్రభుత్వ రక్షణలో ఉండాల్సిన ఈ సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారు. కేంద్ర ఆధార్ వివరాలు సైతం బయటి వారికి చేరవేయడంపై ఆ సంస్థ కేంద్రానికి ఫిర్యాదు కూడా చేసింది. దీనిపై నిలదీస్తారని ముందే పసిగట్టిన చంద్రబాబు సభకు రాకుండా పారిపోయారు. ఇది మధ్యంతర రిపోర్టు మాత్రమే, దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నాం.

ప్రత్తిపాటి ప్రమాణం చేస్తావా?

• ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు



సాక్షి, అమరావతి: గౌతమ బుద్ధా ఇండస్ట్రియల్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు నేను భూమికోసం దరఖాస్తు చేయగా, ఏపీఐఐసీ భూమి కేటాయించింది. టెక్స్‌టైల్ పార్కు కోసం కేంద్రం ఇచ్చిన రూ.40 కోట్ల సబ్సిడీలో సగం (రూ.20 కోట్లు) లంచంగా ఇస్తేనే అనుమతులు ఇస్తామని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మొత్తం చంద్రబాబు నుంచి లోకేష్ వరకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నేను డబ్బులు ఇవ్వనని చెప్పడంతో పరిశ్రమకు ఇచ్చిన భూమి అనుమతులు కూడా రద్దు చేశారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టులో ఉంది. ప్రత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు టీడీపీలో చేరితే అనుమతులిస్తామని నాపై ఒత్తిడి తెచ్చారు. అయినా నేను తలొగ్గలేదు. డబ్బు కోసం పారిశ్రామికవేత్తలను వేధించలేదనిగాని, నన్ను రూ.20 కోట్లు డిమాండ్ చేయలేదని గానీ ప్రత్తిపాటి ప్రమాణం చేయగలరా?

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

• పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి. గతంలోని బిల్లులకు సంబంధించి నిన్ననే ప్రభుత్వం రూ.14 కోట్లు విడుదల చేసిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెప్పారు... ఇది మా విజయం.

ఆ ఐదేళ్లూ ఆరోగ్యం అస్తవ్యస్తం

- దోమలపై దండయాత్ర అంటూ ప్రజలపైకి వదిలారు : మంత్రి విడదల రజిని
- మూడేళ్లలో ఎన్నో సంస్కరణలు తెచ్చాం
- ఆరోగ్యానికి నాడు రూ.31 వేల కోట్లు.. నేడు రూ.52 వేల కోట్లు
- మౌలిక సదుపాయాలకు రూ.16 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ఐదేళ్లలో 1,693 పోస్టులే భర్తీ.. ఇప్పుడు మూడేళ్లలో 40,676 పోస్టులు భర్తీ
- టీడీపీ హయాంలో ఒక్క మెడికల్ కళాశాల తెచ్చిన పాపాన పోలేదు
- జగనన్న పాలనలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు
- రాష్ట్రంలో విషజ్వరాల వల్ల ఒక్కరూ చనిపోలేదు

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎన్నో సంస్కరణలు తెచ్చామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. దోమలపై దండయాత్ర పేరిట హంగామాతో ప్రజారోగ్యాన్ని చంద్రబాబు గాలికి వదిలేశారని విమర్శించారు. మూడేళ్లుగా కోవిడ్ నుంచి విషజ్వరాల వరకు సమర్థంగా ఎదుర్కోవటానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి రజిని సమాధానం ఇచ్చారు. ఆ వివరాలివీ...

- డెంగీ, మలేరియా విషజ్వరాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చి ఉచితంగా వైద్యసేవలందిస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్(ఐహెచ్ఐపీ) పోర్టల్ డేటా ప్రకారం 46,21,585 మందికి పరీక్షలు నిర్వహించి విష జ్వరాల బారిన పడ్డ 49,806 మందికి మెరుగైన వైద్యం అందించాం. ఏ ఒక్క ప్రాణం పోకుండా కాపాడాం. టీడీపీ హయాంలో 74,701 మలేరియా కేసులు నమోదైతే ఇప్పుడు మూడేళ్లలో 4,735 కేసులు వచ్చాయి. ఇదే సమయంలో నాడు 20,762 డెంగీ కేసులు మా హయాంలో 8,519 కేసులు మాత్రమే నమోదయ్యాయి. 26 లక్షల దోమతెరలు పంపిణీ చేశాం. అక్టోబర్ 1వ తేదీ నుంచి మూడోసారి రెసిడియల్ స్ప్రే చల్లేందుకు ఏర్పాట్లు చేశాం. నీటి నిల్వ ప్రాంతాల్లో కోటి గ్యాంబియా ఫిష్‌లను వదిలాం.



- వైద్య ఆరోగ్య రంగానికి టీడీపీ ఐదేళ్లలో రూ.31 వేల కోట్లు కేటాయిస్తే మేంమూడేళ్లలో రూ.52 వేల కోట్లు ఖర్చు చేశాం. మౌలిక సదుపాయాల కల్పనకే రూ.16 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. గత సర్కారు ఐదేళ్లలో 1,693 వైద్య పోస్టులు భర్తీ చేస్తే మేం మూడేళ్లలో ఏకంగా 40,676 పోస్టులు భర్తీ చేశాం.
- టీడీపీ హయాంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా తెచ్చిన పాపాన పోలేదు. జగనన్న పాలనలో రూ.7,880 కోట్లతో 17 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటవుతున్నాయి. 11 వైద్య కళాశాలలను రూ.3,820 కోట్లతో ఆధునికీకరిస్తున్నాం. రూ.568 కోట్లతో ఐదు చోట్ల ట్రైబల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం.
- టీడీపీ హయాంలో ఐదు పీహెచ్‌సీలు 37 యూపీహెచ్‌సీలు ఏర్పాటు కాగా మేం మూడేళ్లలోనే 201 యూపీహెచ్‌సీలు, 176 పీహెచ్‌సీలు కొత్తగా నెలకొల్పాం. రూ.1,692 కోట్లతో 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీని బలోపేతం చేసి ప్రొసీజర్స్ 1,059 నుంచి 2,446కి పెంచాం. ప్రజలకు మరింత మేలు జరిగేలా వీటిని 3 వేలకు పెంచబోతున్నాం.
- నంద్యాలలో రెండో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి కోరారు. చిత్తూరు నియోజక వర్గంలో పీహెచ్‌సీలతో పాటు ఏరియా ఆస్పత్రులను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాసుల నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య రంగానికి దివంగత వైఎస్సార్ జీవం పోస్తే సీఎం జగన్ పేదల జీవితాలకు భద్రత కల్పించారని ఎమ్మెల్యే గొల్లబాబూరావు పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మదనపల్లి టీబీ శానిటోరియాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేస్తే టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందించవచ్చని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించారు. స్విమ్స్‌లో పడకల సంఖ్యను పెంచడంతో పాటు తగినంత మంది సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోరారు. ఆరోగ్య రంగంలో మరిన్ని సంస్కరణలు తేవాలని ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రంలో విషజ్వరాల వల్ల వందలాది మంది మృత్యువాత పడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యేలు బాల వీరాంజనేయ స్వామి, అచ్చెన్నాయుడు, రామానాయుడు ఆరోపించారు. ప్లేట్‌లెట్స్ దొరక్క డెంగీ బాధితులు అల్లాడుతున్నారని చెప్పారు.

శృతిమించిన టీడీపీ ప్రవర్తన

స్పీకర్ పోడియంపైకి ఎక్కి హంగామా

- పోడియంను గుద్దుతూ స్పీకర్‌తో వాగ్వాదం
- ఆయన ముఖానికి ప్లకార్డులు అడ్డు పెట్టిన టీడీపీ సభ్యులు
- అనంతరం వాటిని ముక్కలుగా చించి.. మార్షల్స్ పైకి విసిరి..
- ఏమాత్రం మారని ఆ పార్టీ సభ్యుల తీరు
- ఒకరోజు సస్పెండ్ చేసిన స్పీకర్



పోడియం ఎక్కి స్పీకర్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: గొడవ చేయడం ద్వారా త్వరగా సస్పెండ్ అయి బయటకు వెళ్లిపోయేందుకు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో మంగళవారం కూడా హంగామా చేశారు. రాష్ట్రంలో సంక్షేమం సంక్షోభంలో ఉందనే అంశంపై వాయిదా తీర్మానం ఇచ్చిన టీడీపీ.. దానిపై చర్చకు అనుమతించాలని ఆ పార్టీ సభ్యులు స్పీకర్ తమ్మినేని సీతారాంతో వాగ్వాదానికి దిగారు. ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలు ఎక్కువసేపు మాట్లాడినా స్పీకర్ అనుమతించారు. అధికార పార్టీ సభ్యులు కూడా ఇందుకు అభ్యంతరం వ్యక్తంచేయలేదు. విద్య, వైద్యం–నాడు నేడుపై స్వల్పకాలిక చర్చ ప్రారంభమైన వెంటనే తమ వాయిదా తీర్మానాన్ని అనుమతించాలని టీడీపీ ఎమ్మెల్యేలు గొడవకు దిగారు. సంక్షేమం సంక్షోభంలో పడిందని, సంక్షేమ పథకాలన్నింటినీ ఎత్తివేశారని నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం దగ్గరకు వెళ్లారు. కొందరు సభ్యులు పోడియంపైకి ఎక్కి స్పీకర్ దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అచ్చెన్నాయుడు తదితరులు పోడియంను గుద్దుతూ స్పీకర్‌తో వాగ్వాదానికి దిగారు. సభలో అధికార పార్టీ సభ్యుల ప్రసంగాలు వినపడకుండా ఉండేందుకు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వాయిదా తీర్మానాన్ని తిరస్కరించానని, ఎవరి స్థానాల్లో వాళ్లు కూర్చుని స్వల్పకాలిక చర్చలో పాల్గొనాలని స్పీకర్ ఎంత కోరినా వారు పట్టించుకోలేదు. కొందరు ప్లకార్డులను స్పీకర్ మొహానికి అడ్డుగాపెట్టి అతిగా ప్రవర్తించారు. వారి ప్రవర్తన శృతిమించడంతో టీడీపీ ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, అచ్చెన్నాయుడు, ఆదిరెడ్డి భవానీ, నిమ్మకాయల చినరాజప్ప, గణబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, పయ్యావుల కేశవ్, మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు, గొట్టిపాటి రవికుమార్, ఏలూరు సాంబశివరావు, అనగాని సత్యప్రసాద్, డీబీవీ స్వామిలను ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని ప్రకటించారు. ఆ తర్వాత కూడా వారు సభ నుంచి బయటకు వెళ్లకుండా నినాదాలు చేస్తుండడంతో సభాపతి మార్షల్స్‌ను పిలిచారు. ఆ తర్వాత టీడీపీ సభ్యులు తాము ప్రదర్శించిన ప్లకార్డులను ముక్కలుగా చించి మార్షల్స్‌పై విసిరారు. చివరికి అధికార పార్టీ సభ్యులపై కామెంట్లు చేస్తూ బయటకెళ్లారు.

వందేళ్లు నిలిచేలా

విద్య, వైద్య రంగాల అభివృద్ధి

నాడు–నేడుతో విప్లవాత్మక మార్పులు

- విద్యార్థులు చదువుకునేలా అనేక పథకాలు
- నారాయణ, చైతన్య సంస్థల కోసం చంద్రబాబు విద్యను నాశనం చేశారు
- బాబు హయాంలో ఆరోగ్య శ్రీని అనారోగ్య శ్రీగా మార్చారు
- నాడు–నేడు విద్య, వైద్యంపై స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వందేళ్ల పాటు విద్య, వైద్య రంగాలు పటిష్టంగా ఉండేలా వైఎస్ జగన్ ప్రభుత్వం 'నాడు–నేడు' కార్యక్రమంలో అభివృద్ధి చేస్తోందని పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కోసం ప్రభుత్వ విద్యను నాశనం చేసిందని మండిపడ్డారు. పేదల ఊపిరిని నిలబెట్టిన ఆరోగ్య శ్రీని అనారోగ్యశ్రీగా మార్చి వైద్యాన్ని దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనసభలో విద్య, వైద్యం నాడు–నేడు ప్రగతిపై సభ్యులు మాట్లాడారు.

చరిత్ర సృష్టించిన నాడు – నేడు

నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ఒక్కో పాఠశాలను రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేసిన దాఖలాలు చరిత్రలో లేవు. రాజధాని గ్రామంలోని మందడం హైస్కూల్ రూపురేఖల్ని రూ.7 కోట్లతో మారుస్తున్నాం. రాజధానిపై అమితమైన ప్రేమ కురిపించే చంద్రబాబు ఆయన హయాంలో ఇది ఎందుకు చేయలేదు?. పైగా నీరు–చెట్టు అంటూ రూ.24 వేల కోట్లు దోచేశారు. మా ప్రభుత్వం నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక వంటి పథకాలు అమలు చేస్తోంది. బెండపూడి విద్యార్థినుల ఆంగ్ల ప్రతిభను చూసి చంద్రబాబుకు సైతం మైండ్ బ్లాంక్ అయ్యింది. టీడీపీ ప్రభుత్వంలో నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ శక్తుల కోసం విద్యా ప్రమాణాలను గాలికొదిలేశారు. మనిషి ఉన్నతికి విద్య అవకాశం కల్పిస్తుందని విశ్వసించిన సీఎం జగన్. చదువు కోసం ఎంతైనా ఖర్చు పెట్టమని చెప్పడం ఆయన దార్శనికతకు నిదర్శనం. పేదలకు వైద్యం విషయంలోనూ టీడీపీ ఆరోగ్య శ్రీని అనారోగ్య శ్రీగా మార్చేసింది. మా ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి ఆస్పత్రుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది.

పేదల లైఫ్‌కోచ్.. సీఎం జగన్

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సీఎం జగన్ పేదల లక్ష్యాలు, గమ్యాలకు లైఫ్ కోచ్‌గా మారారు. నాడు – నేడు ద్వారా విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తెస్తున్నారు. తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా బిడ్డలకు కార్పొరేట్ స్థాయి ఇంగ్లిష్ విద్యను అందిస్తున్నారు. లక్షల మంది పిల్లలు ప్రైవేటు స్కూళ్లను వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారంటే పరిస్థితి ఎంతలా మెరుగుపడిందో అర్థమవుతుంది. మందులు కూడా దొరకని ఆస్పత్రుల్లో మా ప్రభుత్వం అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించింది. ప్రభుత్వ మంచిపైనా అసత్య ప్రచారం చేసే ఎల్లో మీడియా, ప్రతిపక్షాలను ప్రజలు రాజకీయ సమాధి చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

కేవలం లోకేశ్ జీవితంలోనే మార్పు

సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు



చంద్రబాబు పాలనలో లోకేశ్ ఒక్కరి జీవితంలోనే మార్పు వచ్చింది. రామోజీరావు, రాధాకృష్ణ వ్యాపారాలు పెరిగాయి. పవన్ కల్యాణ్‌కు సినిమా అవకాశాలు పెరిగాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాల్లో ఎలాంటి మార్పూ లేదు. పేదలకు విద్యను అందని ద్రాక్షగా చేసిన చరిత్ర హీనుడు చంద్రబాబు. మా ప్రభుత్వంలో విద్యా హక్కును సమర్థంగా అమలు చేసిన 'రైట్ టు స్టడీ ఇన్ ఇంగ్లిష్ మీడియం' చంద్రబాబును కుదిపేసింది. అందుకే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, వెంకయ్యనాయుడు వికృత క్రీడకు తెరదీశారు. పేదలకు కార్పొరేట్ విద్యను అందిస్తున్న మా ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు.

శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు

ఇక్కడి నాడు–నేడు ఇప్పుడు దేశమంతా

• మంత్రి బొత్స సత్యనారాయణ



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు – నేడు కార్యక్రమం తరహాలోనే కేంద్ర ప్రభుత్వం కూడా కొత్తగా పీఎం–శ్రీ పేరుతో దేశవ్యాప్తంగా స్కూళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మొత్తం 56,572 స్కూళ్లను మూడు దశల్లో అభివృద్ధి చేయడం ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ఇప్పటికే తొలి దశ కార్యక్రమం పూర్తవగా, మిగతా రెండు దశల్లోనూ కొత్తగా 3,500 అదనపు తరగతుల నిర్మాణం కూడా చేపడుతున్నట్టు వివరించారు. ఇప్పుడు కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టే పీఎం–శ్రీ కార్యక్రమాన్ని మన రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేస్తున్న నాడు – నేడు కార్యక్రమంతో ఎంతవరకు అనుసంధానం చేసుకోవచ్చన్న దానిపై అధికారులు సమీక్షిస్తున్నట్టు తెలిపారు. నాడు – నేడు బిల్లులు ఎక్కడా పెండింగ్‌లో లేవని చెప్పారు.

టీడీపీ ప్రభుత్వం గోతులు పూడ్చకే...

• ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రోడ్లపై గుంతలు పూడ్చలేదని, అందువల్లే రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత రోడ్లు బాగా దెబ్బతిన్నాయని ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు చెప్పారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న గుంతలున్నప్పుడే టీడీపీ ప్రభుత్వం వాటిని పూడ్చి ఉంటే రోడ్లు ఇంతగా దెబ్బతినేవి కావని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తొలి దశలో రూ.1,073 కోట్లతో 4,638 కిలోమీటర్ల పొడవున 1,843 రోడ్లను అభివృద్ధి చేయబోతున్నట్లు చెప్పారు. సగం పనులకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ముగియగా, మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టగానే ఈ పనులు ఊపందుకుంటాయన్నారు.

క్రాప్ హాలిడే ఎక్కడా లేదు : మంత్రి అంబటి రాంబాబు

రాష్ట్రంలో ఈ ఏడాది క్రాప్ హాలిడే (పంట విరామం) పరిస్థితి ఎక్కడా ఉత్పన్నం కాలేదని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం పత్రికలలోనే ఇలాంటి అంశాలు చర్చకు వచ్చాయన్నారు.

సీబీఐ విచారణకైనా సిద్ధం

- లోకేశ్ తప్పుడు ఆరోపణలు మానుకోవాలి : మంత్రి కాకాణి
- స్విమ్మింగ్ పూల్‌లో విదేశీ వనితలతో లోకేశ్ ఫొటోలు ప్రదర్శించిన ఎమ్మెల్సీ దువ్వాడ
- నేను మగాడ్ని.. ఇంకా పెద్దవి చేసి చూపించుకోండి : లోకేశ్
- సంగం బ్యారేజ్‌ను వైఎస్ శంకుస్థాపన చేస్తే సీఎం జగన్ ప్రారంభించారు : మంత్రి అంబటి
- 'మండలి'లో వ్యవసాయంపై వాడివేడిగా చర్చ

సాక్షి, అమరావతి: నెల్లూరు కోర్టులో రికార్డుల మాయం వ్యవహారంలో తన ప్రమేయం ఉందంటూ టీడీపీ సభ్యులు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని, ఈ విషయంలో సీబీఐ విచారణకైనా తాను సిద్ధమేనని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. 'మండలి'లో వ్యవసాయంపై మంగళవారం చర్చ సందర్భంగా నెల్లూరు కోర్టులో మంత్రి కాకాణికి చెందిన కేసుల రికార్డులు ఏమయ్యాయంటూ ఎమ్మెల్సీ లోకేశ్ పెద్దపెద్ద కేకలు వేయడంతో మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో తాను సీబీఐ విచారణకు కూడా సిద్ధంగా ఉన్నట్లు హైకోర్టుకు నివేదించానని గుర్తుచేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలుచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆ సమయంలో విదేశీ వనితలతో స్విమ్మింగ్‌పూల్‌లో మద్యం తాగుతున్న లోకేశ్ ఫొటోలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రదర్శించారు. దీంతో లోకేశ్.. 'ఎస్.. నేను మగాడ్ని.. ఇంకా బాగా పెద్దవిచేసి చూపించుకో..' అంటూ గట్టిగా కేకలు వేశారు.

టీడీపీ ఎమ్మెల్సీకి మంత్రి కాకాణి సవాల్

మరోవైపు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఒక్క ట్రాక్టర్ కూడా ఇవ్వలేదని టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు చెప్పడాన్ని మంత్రి కాకాణి తప్పుబట్టారు. 'మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు ట్రాక్టర్లు ఇవ్వనట్లు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తా, లేదంటే నువ్వు రాజీనామా చేస్తావా..' అంటూ సవాల్ విసిరారు. తొలుత చర్చను ప్రారంభించిన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో వ్యవసాయాన్ని దండగ అని నిర్లక్ష్యం చేస్తే ఆ తర్వాత వైఎస్సార్, ఆయన వారసుడు సీఎం జగన్ వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సంగం బ్యారేజీని వైఎస్ శంకుస్థాపన చేస్తే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. పోలవరానికి కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని, సీఎం జగన్ ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రం కరువు కాటకాలతో అల్లాడితే, జగన్ పాలనలో సుభిక్షంగా ఉందన్నారు. మళ్లీ ఈ చర్చపై మంత్రి కాకాణి మాట్లాడుతూ... రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు.

రీసర్వేలో అప్పీళ్ల పరిష్కార సమయం కుదింపు

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే సందర్భంగా రైతులు, భూ యజమానుల నుంచి వచ్చే అప్పీళ్లను పరిష్కరించే సమయాన్ని 30 రోజుల నుంచి 21 రోజులకు కుదిస్తూ ప్రభుత్వం ఏపీ సర్వే, సరిహద్దుల చట్టాన్ని సవరించింది. ఇందుకు సంబంధించిన బిల్లును శాసన సభ మంగళవారం ఆమోదించింది. దీంతోపాటు మరో మూడు బిల్లులను కూడా సభ ఆమోదించింది. రీ సర్వేలో భూముల సరిహద్దులను కొత్తగా నిర్ధారించిన తర్వాత రైతుల నుంచి అక్కడక్కడ అభ్యంతరాలు వస్తున్నాయి. వీటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ మెజిస్ట్రేట్లను నియమించింది. రైతుల అభ్యంతరాలను మెజిస్ట్రేట్లు పరిష్కరిస్తున్నారు. రీ సర్వేను మరింత వేగవంతం చేసి 2023 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం అప్పీళ్ల పరిష్కార సమయాన్ని 21 రోజులకు తగ్గించింది. ఇప్పటికే దీనిపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దాని స్థానంలో ఇప్పుడు చట్టాన్ని సవరించింది. రీ సర్వే నేపథ్యంలో భూ హక్కుల రికార్డులను వార్షికంగా తనిఖీ చేసేలా 1971 ఏపీ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్ట సవరణ బిల్లును కూడా శాసనసభ ఆమోదించింది. భూ హక్కుల రికార్డుల సవరణ కష్టతరంగా మారిన నేపథ్యంలో సంవత్సరానికి ఒకసారి తనిఖీ చేయడం వల్ల సమస్యలను పరిష్కరించొచ్చని ప్రభుత్వం భావించి ఈ సవరణ చేసింది. 1956 ఏపీ (ఆంధ్ర ప్రాంత) కౌలుదారీ చట్టం రద్దు బిల్లును కూడా సభ ఆమోదించింది. తిరిగి తగిన మార్పులతో ఈ చట్టాన్ని త్వరలో ప్రవేశపెట్టనుంది. సహకార సంఘాల బలోపేతం, వాటి ఆస్తుల పరిరక్షణకు ప్రవేశపెట్టిన 2022 ఏపీ సహకార సంఘాల చట్ట సవరణ బిల్లును సభ ఆమోదించింది. అలాగే ఏపీ దుకాణాలు, సంస్థల సవరణ బిల్లును రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఏపీ కార్మిక సంక్షేమ నిధి రెండో సవరణ బిల్లును కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఏపీ వస్తువులు, సేవల పన్ను సవరణ బిల్లును ఆర్థిక మంత్రి తరఫున వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి సభలో ప్రవేశపెట్టారు. 2022–23 సంవత్సరానికి వ్యయా ల అనుబంధ అంచనాలను ఆర్థిక మంత్రి తరఫున వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి సభ ముందు ఉంచారు.

'సంక్షేమం'పై చర్చలో టీడీపీ రచ్చ

సాక్షి, అమరావతి: 'మండలి'లో సంక్షేమంపై మంగళవారం జరిగిన చర్చలో టీడీపీ సభ్యులు రచ్చచేయడంపై చైర్మన్ మోషేన్‌రాజు మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాల్లో అర్హుల్లో కోతవేసి తక్కువమందికి ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా జోక్యం చేసుకుని అమ్మఒడి నిబంధనలు తెలియకుండా మాట్లాడుతున్న దీపక్ రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వాస్తవాలను తెలుసుకోకుండా టీడీపీ కార్యాలయంలో తయారుచేసిన లెక్కలను పట్టుకొచ్చి 'మండలి'ని తప్పుదారి పట్టించడం సరికాదన్నారు. చైర్మన్ జోక్యం చేసుకుని అనధికారిక గణాంకాలు సభలో చెబితే కుదరదని, పేపర్లో వచ్చాయంటూ సభలో చెప్పడం సరికాదన్నారు. అయినా సభను పదేపదే తప్పుదోవ పట్టించడంతో మంత్రులు వేణుగోపాలకృష్ణ, మేరుగు నాగార్జున, పీడిక రాజన్నదొర, అంజాద్‌బాష, ఉషశ్రీచరణ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాగ్వాదం పెరగడంతో చర్చను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.


సంధ్యారెడ్డి

మహిళలూ... పరిశ్రమించండి!

'ఇంజనీరింగ్ సీట్ అమ్మాయిలకెందుకు?'
ఇది నలభై ఏళ్ల నాటి మాట.
విద్యావంతులు కూడా కనుబొమలు
ముడివేస్తున్న రోజులవి.
'నేను మెకానికల్ ఇంజనీరింగ్ చేస్తాను'
సంధ్య అనే ఓ అమ్మాయి పట్టుదల అది.
'మెకానికల్‌లోనా అసలే కుదరదు...
కావాలంటే ఎలక్ట్రానిక్స్‌లో చేరు'
కొద్దిగా రాజీపడుతూ
ఆ అమ్మాయికి సీటిచ్చారు.
ఇప్పుడామె దేశ రక్షణ రంగానికి
పరికరాలు సమకూరుస్తున్నారు.

ఆమే కోవె డైరెక్టర్ సంధ్యారెడ్డి. చేత వచ్చిన పనులతో కుటీర పరిశ్రమ లేదా చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలు స్థాపించా లనుకుంటూ గ్రామాల్లో ఉన్న కారణంగా ఏ మార్గమూ లేదని నిరుత్సాహ పడుతున్న వారి కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమా లను, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వందల మంది ఔత్సాహిక గ్రామీణ ప్రాంతాల మహిళలకు శిక్షణనిస్తున్నారామె. హైదరాబాద్ బోరబండలో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఈ ప్రయత్నం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా అసలామెకు ఈ ఆలోచన రావడానికి గల కారణాలేమిటో వివరించారు. అవి ఆమె మాటల్లోనే...

‘‘మాది చాలా సింపుల్ బ్యాక్‌గ్రౌండ్. నాన్న హైదరాబాద్, ఎల్‌ఐసీలో చేసేవారు, అమ్మ గృహిణి. అమ్మ పూర్తిగా గ్రామీణ నేపథ్యం, చదువుకోలేదు. కానీ ఆమె ఆలోచనలు, లక్ష్యాలు చాలా ఉన్నతంగా ఉండేవి. పిల్లలను పెద్ద చదువులు చదివించాలనే పట్టుదలతో ఉండేది. నాన్న కూడా ఆడపిల్లలు అనే ఆంక్షలు లేకుండా ఆధునిక భావాలు కలిగిన వ్యక్తి. దాంతో నాకు అమ్మాయి అనే కారణంగా పరిమి తులు తెలియదు. సమాజం చిన్న చట్రంలో ఇమిడి ఉందనే విషయం కూడా ఇంజనీరింగ్‌లో సీటు దగ్గరే మొదటిసారిగా తెలిసింది. ఇంజనీరింగ్ సీటు ఆడపిల్లలకు ఇస్తే ఆ సీటు వేస్టవుతుందనే అపోహ ఉండేదప్పట్లో. బెంగళూరులో రెండేళ్లు ఉద్యోగం చేసి, తిరిగి హైదరాబాద్‌కి వచ్చి 1989లో సొంత ఇండస్ట్రీ పెట్టాను. తర్వాత యూఎస్‌కి వెళ్లి ఎనిమిదేళ్లు ఐటీ ఇండస్ట్రీ నడిపించాను. ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశ్రమ స్థాపించాను. మా కెనా టెక్నాలజీస్ ఇప్పుడు రక్షణ రంగానికి హై క్వాలిటీ పవర్ సప్లయ్ సిస్టమ్స్, లాండ్ బేస్డ్, ఎయిర్ బోర్న్, నావల్ ప్రాజెక్టులకు అవసరమైన పరికరాలను అందిస్తోంది. ఈ స్థాయికి చేరడానికి ఎంతగా శ్రమించానో నాకు తెలుసు. అందుకే పారిశ్రామిక రంగంలోకి రావాల నుకునే మహిళల కోసం ఒక వేదిక ఉంటే బావుం టుందని భావసారూప్యం కలిగిన అనేక మంది మహిళా పారిశ్రామికవేత్తల ఆలోచనతో 2004లో మొదలైంది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (కోవె).

విస్తరించిన 'పౌష్టిక్'

కోవె దేశవ్యాప్తంగా 13 వందలకు పైగా సభ్యులతో 11 చాప్టర్స్‌తో పని చేస్తోంది. అయితే ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలకే పరిమితమై పని చేసింది. గ్రామీణ, పట్టణాల్లో ఉండే మహిళలకు అందుబాటులోకి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో జిల్లాలకు విస్తరించే ప్రయత్నం మొదలుపెట్టాం. ఇందుకోసం 'పౌష్టిక్' అనే కార్యక్రమాన్ని రూపొందించాం. మహిళలు పోషకాలతో కూడిన ఆహారాన్ని ఇంట్లోనే వండి, పోటీలు జరిగే ప్రదేశానికి తెచ్చి ప్రదర్శించాల్సి ఉంటుంది. తెలంగాణలో కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలున్నాయి. ఏపీలో విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, వైజాగ్‌లో నిర్వహించాం. ఆహారంతో మొదలుపెట్టడంలో మా ఉద్దేశం మహిళలకు పోషకాహారం ఆవశ్యకతను గుర్తు చేయడం, అందరికీ తెలిసిన ఆహారం నుంచి ఉపాధికి మార్గం వేసుకోవడం ఎలాగో నేర్పించడం అన్నమాట. మహబూబ్ నగర్ లో ఈ కార్యక్రమం రేపు ఉంది. ప్రతిచోటా వంద మంది వరకు పాల్గొంటున్నారు. పోటీల్లో గెలిచిన వాళ్లకు పోషకవిలువల గురించి వివరించగలగడం, ప్యాకేజింగ్, షెల్ఫ్‌లైఫ్‌ను అంచనా వేయడం వంటి అంశాల్లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇప్పిస్తున్నాం. వాళ్లంతా అక్టోబర్‌లో జరిగే లైవ్ కిచెన్ పోటీలో పాల్గొనాలి. ఈ పోటీల్లో గెలిచిన మహిళల్లో దాదాపుగా అందరూ సొంత పరిశ్రమ స్థాపించడానికి ముందుకు వస్తారని నమ్మకం.

అందిపుచ్చుకోండి

కోవెని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆస్ట్రేలియా, జర్మనీ, చైనా, శ్రీలంక, ఈజిప్టు వంటి ఇంటర్నేషనల్ ఉమెన్ ఆర్గనైజేషన్‌లతో అనుసంధానం చేశాం. సాధారణంగా పరిశ్రమ అనగానే మధ్యతరగతి మహిళలను అనేక రకాల భయాలు వెంటాడుతుంటాయి. ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్, కంపెనీ రిజిస్ట్రేషన్ వంటి ప్రక్రియల దగ్గరే వెనక్కిపోయేవాళ్లూ ఉంటారు. మహిళలకు తోడుగా ఈ పనులకు తిరగడానికి ఇంట్లో మగవాళ్లు మొదట విసిగిపోతారు. అలాంటప్పుడు ఆడవాళ్లలో ఎంత ఉత్సాహం ఉన్నప్పటికీ ఏమీ చేయలేక పోతుంటారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కోవెలో పరిశ్రమ స్థాపన, నిర్వహణకు అవసరమైన రిజిస్ట్రేషన్, ఐటీ ఫైలింగ్, మార్కెటింగ్ సర్వీస్‌లన్నీ అందిస్తున్నాం. యంత్ర పరికరాలు అవసరమయ్యే పరిశ్రమల కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యంతో ఇన్‌క్యుబేటర్ సెంటర్‌లను ఏర్పాటు చేశాం. పరిశ్రమ పెట్టాలనుకునే మహిళ తొలిదశలోనే పెట్టుబడి కోసం ప్రయాస పడాల్సిన అవసరం ఉండదు. మేము ఏర్పాటు చేసిన ఇన్ క్యుబేషన్ సెంటర్‌లో పని మొదలుపెట్టి, తన మీద తనకు నమ్మకం కుదిరిన తర్వాత యంత్రాలు కొనుక్కుని సొంత పరిశ్రమ ప్రారంభించవచ్చు. ఈ సౌకర్యాలను అందిపుచ్చుకోండి'' అని ఔత్సాహిక మహిళలకు పిలుపునిచ్చారు సంధ్యారెడ్డి.

– వాకా మంజులారెడ్డి
ఫొటో: గడిగె బాలస్వామి

అవకాశాలు విస్తరించాలి!

పౌష్టిక్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న మహిళల్లో రాజమండ్రి వాళ్లు చాలా ఉత్సాహంగా ఉన్నారు. చాలామంది ఇప్పటికే 'ఫుడ్ ఇండస్ట్రీ లైసెన్స్ కోసం ఎలా అప్లయ్ చేయాలి' వంటి సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో వాళ్ల సందేహాలను తీరుస్తున్నాం. ఏపీలో ఇప్పటికే ఫుడ్ కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. ఇదంతా ఎందుకు చేస్తున్నామంటే... మా తరంలో ఇన్ని అవకాశాల్లేవు. ఒక మహిళ పారిశ్రామిక వేత్తగా నిలదొక్కుకోవడం చాలా కష్టమయ్యేది. అనేక మంది ఉత్సాహంగా ముందుకు వచ్చి ఎదురీదలేక ఆగిపోయిన వాళ్లూ ఉన్నారు. నగరాల్లోనే ఇలా ఉంటే ఇక గ్రామాలు, పట్టణాల మహిళలకు ప్రయత్నం చేసే అవకాశం కూడా తక్కువే. అందుకే వాళ్ల చేత ఒక అడుగు ముందుకు వేయించాలనేదే కోవె సంకల్పం.

– సంధ్యారెడ్డి కేశవరం


● 'పౌష్టిక్' పోటీల్లో తమ వంటకాలను ప్రదర్శిస్తున్న మహిళలు



నేడు ప్రపంచ శాంతి దినోత్సవం

పీస్ ఈజ్ బ్యూటిఫుల్

యూత్ పల్స్

'పీస్ ఈజ్ ఆల్వేస్ బ్యూటిఫుల్' అనేది పెద్దల మాట. మరి యువతరం ఏ బాటలో పయనిస్తోంది? ఐక్యరాజ్య సమితి పీస్ కీపింగ్ ఆపరేషన్‌లలో యువత క్రియాశీల పాత్ర పైప్రశ్నకు స్పష్టమైన జవాబు చెబుతుంది....

'మా ప్రపంచం మాది. ప్రపంచం ఎటూ పోతే మాకెందుకు!' అనుకోవడం లేదు యువత.

ఒకవైపు తమదైన ప్రపంచంలో సరదా సరదాగా ఉంటూనే, ప్రపంచ ధోరణులను నిశితంగా పరిశీలిస్తోంది.

'శాంతిభద్రతల పరిరక్షణకు మీవంతు సహాయం కావాలి. మీ శక్తి సామర్థ్యాలు కావాలి' అనే ఐరాస పిలుపు యువతకు వినబడిందా?

'అవును. వినిపిస్తోంది' అని కాస్త గట్టిగానే చెప్పుకోవడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

ఐక్యరాజ్య సమితి పీస్‌మిషన్ ఆపరేషన్‌లపై ఆసక్తి ప్రదర్శించడమే కాదు రకరకాల పద్ధతుల్లో వాటిలో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది యువతరం. ప్రపంచ వ్యాప్తంగా ప్రాణాలను పణంగా పెట్టి మరీ సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు యంగ్ పీస్‌కీపర్స్.

'మేము చేపట్టే పీస్‌మిషన్ కార్యక్రమాల్లో యువతరం కీలక పాత్ర పోషిస్తుంది. వారిలో సహజంగా ఉండే సులభంగా అందరిలో కలిసి పోయే లక్షణం, కమ్యూనికేషన్ స్కిల్స్ మా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఉపకరిస్తున్నాయి' అంటున్నారు అండర్–సెక్రెటరీ ఫర్ పీస్ ఆపరేషన్స్ జీన్ లక్రోయిక్స్.

రోహిణి ఐరాస తరపున దక్షిణ సుడాన్‌లో పనిచేస్తుంది. వైద్యురాలిగా తన వృత్తిలో భాగంగా ఎంతో మంది యువతీయువకులతో కలిసి పనిచేసే అవకాశం ఆమెకు వచ్చింది.

'వారి ప్రతిభ, శక్తిసామర్థ్యాలకు నిర్మాణాత్మక రూపం కల్పిస్తే అద్భుతాలు సాధించవచ్చు' అంటుంది డా.రోహిణి.

ప్రస్తుతం యూత్ సోషల్ మీడియాను శ్వాసిస్తుంది.

సోషల్ మీడియా అనేది 'పీస్ బిల్డింగ్ ఇన్‌స్ట్రుమెంట్' అనేవారితో పాటు 'అబ్బే! అదేం లేదు' అనేవారు కూడా ఉన్నారు. దీనికి కారణం వివిధ రకాల అంశాలలో విద్వేషపూరిత చర్చలు, దుమ్మెత్తి పోసుకోవడాలకు అది వేదిక కావడమే. ఈ వాతావరణంలో యూత్ ఎటువైపు నిలబడుతుంది? అనే ఒక కీలక ప్రశ్న ముందుకు వస్తుంది.

విద్వేషప్రేమికుల సంగతి ఎలా ఉన్నప్పటికీ ప్రపంచశాంతిని ప్రేమించే యువతరం తమ వంతు ప్రయత్నం తాము చేస్తున్నారు. చిన్న సూక్తి లేదా ఒక పుస్తకానికి సంబంధించిన విషయాలను ఉటంకించడం ద్వారా శాంతి సందేశాన్ని అందరికీ పంచే ప్రయత్నం చేస్తున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న క్రూరమైన యుద్ధానికి సంబంధించిన దృశ్యాలపై కొన్ని వ్యాఖ్యానాలు చూస్తుంటే యువతరం మనసులో ఏముందో సులభంగా అర్థమవుతుంది. స్థూలంగా చెప్పుకోవాలంటే వారు ప్రపంచశాంతిని బలంగా కోరుకుంటున్నారు.

'ఒకప్పుడు నాకు ముక్కుపైనే కోపం ఉండేది. ఫ్రెండ్ సలహాపై మహాత్ముడి ఆత్మకథ చదివాను. చదువుతూనే ఉన్నాను. నాలో ఎంత మార్పు వచ్చింది అనేది చెప్పడానికి మాటలు చాలవు' అని ఒకరు పోస్ట్ పెడితే దీనిపై ఎన్నో కామెంట్స్ వచ్చాయి. అవన్నీ హింసను నిరాకరించే కామెంట్స్. ప్రపంచశాంతిని ప్రేమించే కామెంట్స్.

ఉదాహరణకు ఒక కామెంట్...

'విద్వేషం లేని చోట శాంతి ఉంటుంది. శాంతి ఉన్నచోట సౌభాగ్యం ఉంటుంది'

> 'ఒకప్పుడు నాకు ముక్కుపైనే కోపం ఉండేది. ఫ్రెండ్ సలహాపై మహాత్ముడి ఆత్మకథ చదివాను. చదువుతూనే ఉన్నాను. నాలో ఎంత మార్పు వచ్చింది అనేది చెప్పడానికి మాటలు చాలవు' అని ఒకరు పోస్ట్ పెడితే దీనిపై ఎన్నో కామెంట్స్ వచ్చాయి. అవన్నీ హింసను నిరాకరించే, ప్రపంచశాంతిని ప్రేమించే కామెంట్స్.

యూట్యూబ్ రైజింగ్ స్టార్


మైథిలీ ఠాకూర్

కొందరు ఎన్ని ప్రతికూలతలున్నా, వాటిని సానుకూలంగా మార్చుకుని ఉన్నతంగా ఎదిగి ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తుంటారు. ఈ కోవకు చెందిన అమ్మాయే మైథిలీ ఠాకూర్. తినడానికి తిండి, ఉండడానికి సరైన ఇల్లులేని నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ ఎన్నో కష్టాలను ఎదుర్కొని గాయనిగా ఎదిగి లక్షల మందిని అలరిస్తోంది. ఈ స్థాయికి రావడానికి మైథిలీ ఎదుర్కొన్న సవాళ్ల గురించి ఆమె మాటల్లో....

మాది బీహార్‌లోని మధుబని జిల్లాలోని చిన్న పల్లెటూరు. 1994లో నాన్న రమేశ్ ఠాకూర్ పీజీ పూర్తిచేసి ఢిల్లీ వచ్చారు. ఎంత ప్రయత్నించినా ఆయనకు ఉద్యోగం దొరకలేదు. దీంతో జీవనోపాధికోసం పిల్లలకు సంగీతం పాఠాలు చెప్పేవాళ్లు. 2000 సంవత్సరంలో నేను పుట్టాను. నేను పుట్టిన తరువాత కూడా మా ఆర్థిక పరిస్థితుల్లో పెద్ద మార్పులేవీ రాలేదు. నజాఫ్‌ఘ డ్‌లో ఓ చిన్న గదిలో కుటుంబం మొత్తం ఉండే వాళ్లం. సంగీతం తరగతుల ద్వారా నాన్నకు నెలకు ఏడు వేల రూపాయలు వచ్చేవి. ఇంటి అద్దె, కుటుంబ ఖర్చులకు అవి సరిపోయేవి కావు. దీంతో నన్ను స్కూలుకు పంపలేకపోయారు. అయితే నాకు, తమ్ముడికి శాస్త్రీయ సంగీతంతో పాటు, జానపద గీతాలను నేర్పించేవారు. నాన్న చెప్పిన పాఠాలను రోజుకి ఏడు నుంచి ఎనిమిది గంటలపాటు సాధన చేసేవాళ్లం. ఒక పక్క సంగీతం నేర్చుకుంటూనే నాలుగో తరగతి వరకు పుస్తకాలను తెచ్చుకుని ఇంట్లోనే చదువుకునేదాన్ని. ఐదోతరగతిలో మున్సిపల్ స్కూల్ అడ్మిషన్ పరీక్షలో పాసవ్వడంతో స్కూల్లో చేరాను. కానీ తరగతిలో అంతా నాకన్నా పెద్దవాళ్లు ఉండడంతో వాళ్లతో కలిసి చదవలేక, సంగీత సాధన కుదరడం లేదని స్కూలుకెళ్లడం మానేసాను. అమ్మ బాగా తిట్టేవారు. అవేవీ పట్టించుకోకుండా నాన్న చెప్పే సంగీత పాఠాలను శ్రద్ధగా సాధన చేసేదాన్ని.

సైన్స్ ఫెయిర్‌లో తొలిసారి..

నాన్న మరోసారి మున్సిపల్ స్కూల్లో చేర్పించారు. మళ్లీ ఐదో తరగతిలో చేరి రోజూ స్కూలుకు వెళ్లేదాన్ని. ఒకసారి స్కూల్లో సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనేందుకు నేను సెలక్ట్ అయ్యాను. అక్కడ ఒక పాట పాడేందుకు నాకు అవకాశం లభించింది. అప్పుడు నేను పాడిన పాట ఇంటర్నేషనల్ బాలభవన్ స్కూలు ప్రిన్స్‌పాల్‌కు నచ్చింది. దీంతో వాళ్లు రెండేళ్లు ఉచితంగా చదువుకునేందుకు స్కాలర్‌షిప్ ఇచ్చారు. అంతేగాకుండా తమ్ముళిద్దరూ చదువుకునేందుకు సాయం చేశారు. అప్పటి నుంచి చక్కగా చదువుకుంటూ మంచి మార్కులు తెచ్చుకునేదాన్ని. ఏటా నిర్వహించే పాటల పోటీల్లో సైతం పాల్గొని బహుమతులు కూడా గెలుచుకున్నాను.

ద రైజింగ్ స్టార్

వివిధ పాటలపోటీల్లో గాయనిగా గుర్తింపు రావడంతో టీవీలో ప్రసారమయ్యే రియాల్టి షో 'ద రైజింగ్ స్టార్', సారేగమపా లిటిల్ చాంప్, ఇండియన్ ఐడల్ జూనియర్ వంటి షోలలో పాల్గొన్నాను. కానీ ఐదుసార్లు ఎంట్రీ స్థాయిలోనే ఫెయిలయ్యాను. తరువాత 2017లో రైజింగ్ స్టార్‌లో పాల్గొని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచి గాయనిగా గుర్తింపు తెచ్చుకున్నాను.

యూట్యూబ్ స్టార్‌గా...

రైజింగ్ స్టార్ ద్వారా గాయనిగా మంచి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత 'మైథిలీ ఠాకూర్' పేరుతో ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో అకౌంట్ క్రియేట్ చేసి నేను పాడే ప్రతిపాట వీడియోను పోస్టు చేసేదాన్ని. ప్రారంభంలో పెద్దగా వ్యూస్ వచ్చేవి కావు. తరువాత వీడియో ఎడిటింగ్, మెలోడీస్‌ను కంపోజ్ చేయడం నేర్చుకుని వీడియోలను చక్కగా పోస్టుచేయడంతో నా చానల్‌ను ఫాలో అయ్యేవారి సంఖ్య దాదాపు 38 లక్షలకు చేరింది. ఫేస్‌బుక్ అకౌంట్‌ను ఫాలో అయ్యేవారైతే కోటీ ముప్పై లక్షలమంది ఉన్నారు. ఇంటర్మీడియట్ పూర్తయ్యాక కరోనా రావడంతో ఇంట్లోనే ఉండిపోయాం. చిన్నప్పుడు తాతయ్య వద్ద నేర్చుకున్న బీహారీ భజన పాటలు, సంప్రదాయ వంటకాలతో వ్లాగింగ్ వీడియోలను అప్‌లోడ్ చేశాను. నా వీడియోలు నచ్చడంతో వ్లాగర్‌గా మంచి పేరు వచ్చింది. ఇలా సోషల్ మీడియా స్టార్‌గా రాణిస్తున్నాను.



> నేను ఒక్కదానినే కాకుండా కుటుంబ సభ్యుల సాయంతో ఇవన్నీ చేయగలుగుతున్నాను. గత ఐదేళ్లుగా అంతా కష్టపడుతున్నాము. మా బిహారీ సంప్రదాయాలు, జానపదాలను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాము. దేశ విదేశాల్లో షోలు చేయడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడ్డాయి. ఇతర భాషల్లోని జానపద గీతాలను పాడాలన్నదే నా కల.

నేడు వరల్డ్ అల్జైమర్స్ డే

అమ్మ మర్చిపోతోంది

అమ్మకు మతిమరుపు ఎక్కువవుతోంది.
అమ్మలో అయోమయం పెరుగుతోంది.
అమ్మలో ఆ మార్పు ఎందుకు?
అల్జైమర్స్ కావచ్చు.
ఒక వయసు దాటాక అమ్మా నాన్నల ఆరోగ్యం
జాగ్రత్తగా చూసుకోవాలి.
నాన్నల కంటే అమ్మలే ఎక్కువగా
అల్జైమర్స్ బారిన పడుతున్నారని అధ్యయనాలు
చెబుతున్నాయి.
అలాంటి సందర్భంలో వారితో ఎలా మెలగాలి?
వారికి ఎలాంటి సపోర్ట్ అందించాలి?
పెద్దల మీద ఒక కన్ను వేసి వారికి వచ్చే ఈ ఇబ్బందిని
సకాలంలో ఎలా గుర్తించాలి?
తెలుసుకోక తప్పదు.



'అల్జైమర్స్ అండ్ రిలేటెడ్ డిజార్డర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా' (ఏ.ఆర్.డి.ఎస్.ఐ) ప్రకారం 2030 నాటికి 75 లక్షల మంది భారతదేశంలో అల్జైమర్స్ బారిన పడి ఉంటారు. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే 65 ఏళ్లు దాటిన తర్వాత ఆరుమంది మహిళలలో ఒకరికి ఈ రుగ్మత సోకే అవకాశం ఉంటే పురుషులలో 11 మందిలో ఒకరికి దీని ప్రమాదం పొంచి ఉంటుంది. అంటే స్త్రీలలోనే ఎక్కువమంది అల్జైమర్స్ బారిన పడుతున్నారని పరిశోధనలు చెబుతున్నాయే. స్త్రీలే ఎందుకు?

ఇవీ కారణాలు:

డిప్రెషన్‌కు, అల్జైమర్స్‌కు నేరుగా సంబంధం ఇంకా తేలాల్సి ఉన్నా డిప్రెషన్ స్త్రీలలో ఎక్కువ కనుక వారికి ఈ రుగ్మత సోకుతున్నదనేది నిపుణుల పరిశీలన. డిప్రెషన్ వల్ల జ్ఞాపకశక్తికి కారణమయ్యే మెదడు రసాయనాలు ప్రభావితమయ్యి మతిమరుపు, జ్ఞాపకాలు నశించడం జరుగుతున్నదని అంటున్నారు. అలాగే వ్యాయామం లేకపోవడం. పురుషుల కంటే స్త్రీలకు వ్యాయామం తక్కువ కావడం కూడా అల్జైమర్స్‌కు కారణం. పురుషులు ఎంతో కొంత వ్యాయామం కోసం బయటకు వెళతారు. కాని స్త్రీలు ఇంటిపట్టునే ఉండాల్సి వస్తోంది. వారికి వ్యాయామం చేసే సమయం కూడా ఉండదు. ఆరోగ్యకరమైన శరీరం మెదడును కూడా చురుగ్గా ఉంచుతుంది కనుక అల్జైమర్స్ పురుషులతో పోలిస్తే స్త్రీలలో ఎక్కువ కనిపిస్తోంది. అలాగే ఇంట్లో బాధ్యతలు కూడా స్త్రీలను తెలియని ఒత్తిడికి గురి చేస్తాయి. కుటుంబ సభ్యులలో ఎవరి ఆరోగ్యం బాగలేకపోయినా వారిని చూసుకోవాల్సిన, ఎవరికి ఏ సమస్య వచ్చినా దాని గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత స్త్రీలలో ఎక్కువ కనిపిస్తుంది. వారికి తప్పని ఈ పని వల్ల కూడా మెదడు పై అనవసర ఒత్తిడి పడి అల్జైమర్స్‌కు కారణం కావచ్చు. ఇవి కాకుండా స్త్రీలలో రెండు 'ఎక్స్' క్రోమోజోములు ఉంటాయి. ఇందువల్ల కూడా అల్జైమర్స్ వస్తున్నదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మెదడు నిర్మాణం కూడా పురుషులకు, స్త్రీలకు కొద్దిపాటి వ్యత్యాసమూ ఒక కారణం కావచ్చు. మరో విషయం ఏమంటే చురుగ్గా ఉండే మెదడు కలిగిన వారికి అల్జైమర్స్ తక్కువగా వస్తుంది. అంటే మెదడు నిరంతరం పని చేసేవారికి ఈ రుగ్మత సమస్య తక్కువ. కాని తరాల వెంబడి స్త్రీలను విద్యకు దూరం చేయడం, వారి ఆలోచనలు పరిమితం చేయడం, కూరా నారకు మాత్రమే ఆలోచిస్తే చాలు అన్నట్టుగా చూడటం వల్ల కూడా స్త్రీలకు ఈ రుగ్మత వస్తున్నదని అంటున్నారు. పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ కాలం జీవించడం వల్ల కాలం గడిచే కొద్ది ఈ రుగ్మత బారిన వీరు పడుతుండటం మరో అనివార్యత. కాబట్టి 65 ఏళ్లు దాటాక పురుషుల గురించి కంటే అల్జైమర్స్ విషయంలో స్త్రీల గురించి మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

ఎలా గుర్తించాలి?

అల్జైమర్స్ సూచనలు ఎలా గమనించాలి. అల్జైమర్స్ వచ్చిన వారిలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

- తరచూ మతిమరుపు
- స్థలకాలాల ఎరుక తగ్గుతుంది.
- మూడ్స్ తరచూ స్థిరంగా మారుతుంటాయి.
- ఏదైనా నిర్ణయం తీసుకోవడంలో తికమక
- నలుగురితో కలవకపోవడం
- రోజువారి పనులు చేసుకోవడంలో కూడా అయోమయం

ఈ ప్రమాదాన్ని ఎలా నివారించవచ్చు?

యాభైలకు సమీపిస్తున్నప్పుడే జీవన విధానాలను మార్చుకోవడం, కళాత్మకమైన పనుల్లో నిమగ్నమవడం, పజిల్స్ నింపడం, సమతుల ఆహారం తీసుకోవడం, బరువు పెరక్కుండా చూసుకోవడం, మంచి పోషకాలుండే పండ్లు తినడం, తగినంత నిద్ర ఉండేలా చూసుకోవడం. నిద్రలేమి మెదడు పై ప్రభావం చూపుతుంది. ఏ వయసులో అయినా ఏదో ఒక కోర్సు చదవడం. లేదా ఏదో ఒక క్లాసుకు (ఇంగ్లిష్, డాన్స్, పెయింటింగ్) హాజరు కావడం. బి.పి, డయాబెటిస్‌లను అదుపులో పెట్టుకోవడం. ఒత్తిడి తగ్గించుకోవడం, వ్యాయామం చేయడం, నలుగురితో ఎక్కువ కలవడం.

సహాయం

ఈ రుగ్మత ఉన్నవారిని కనిపెట్టుకుని ఉండటమే అసలైన సహాయం. వైద్యపరంగా చేసేది పెద్దగా లేకపోయినా చిన్న చిన్న టిప్స్ పాటించడం వల్ల, వాళ్లున్న గదుల్లో పోస్టర్లు ఫొటోలు పెట్టడం వల్ల, బాత్‌రూమ్‌లో సూచనలు అంటించడం వల్ల, అలారంలు పెట్టి వారిని ఒక క్రమపద్ధతిలో పనులు చేసుకునేలా చేయడం వల్ల, పగటి పూట ఎండలో తిప్పుతూ నిద్ర తక్కువ పోయేలా చేసి రాత్రిళ్లు త్వరగా నిద్రపోయేలా చేయడం వల్ల ఇలాంటి బాధితులకు కొద్దిగా ఉపశమనం లభిస్తుంది.

అల్జైమర్స్ అంటే పెద్దలు మళ్లీ పసిపాపలుగా మారడం. పిల్లలు వారికి తల్లిదండ్రుల అవతారం ఎత్తడం. సమాధానం లేని ఈ రుగ్మతను ప్రేమ, బాధ్యతలతోనే జయించాలి.



హేల్స్ మెరుపులు... ఇంగ్లండ్ విజయం

పాకిస్తాన్‌తో కరాచీలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. మొదట పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. రిజ్వాన్ (46 బంతుల్లో 68 ; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), బాబర్ ఆజమ్ (24 బంతుల్లో 31 ; 3 ఫోర్లు) రాణించారు. తర్వాత ఇంగ్లండ్ 19.2 ఓవర్లలో 4 వికెట్లకు 160 పరుగులు చేసింది. హేల్స్ (40 బంతుల్లో 53 ; 7 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (25 బంతుల్లో 42 నాటౌట్; 7 ఫోర్లు) ఇంగ్లండ్‌ను గెలిపించారు. రేపు ఇక్కడే రెండో టి20 జరుగుతుంది.



టేబుల్ టెన్నిస్ సెమీఫైనల్లో తెలంగాణ

గుజరాత్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు సెమీఫైనల్‌కు చేరింది. ఆకుల శ్రీజ, నిఖత్ బాను, వరుణి జైస్వాల్ సభ్యులుగా ఉన్న తెలంగాణ గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో నిలిచింది. హరియాణా, గుజరాత్ జట్లపై 3–1తో నెగ్గిన తెలంగాణ 0–3తో మహారాష్ట్ర చేతిలో ఓడింది. జాతీయ క్రీడలు ఈనెల 29 నుంచి జరగనున్నాయి. అయితే అవే తేదీల్లో భారత జట్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉండటంతో టీటీ ఈవెంట్‌ను ముందుగా నిర్వహిస్తున్నారు.

208 సరిపోలేదు

- తొలి టి20లో భారత్ ఓటమి
- 4 వికెట్లతో ఆస్ట్రేలియా విజయం
- గెలిపించిన గ్రీన్, వేడ్
- రెండో వన్డే శుక్రవారం

ఆస్ట్రేలియాపై టి20ల్లో అత్యధిక స్కోరు సాధించిన ఆనందం భారత్‌కు దక్కలేదు. హార్దిక్, కేఎల్ రాహుల్, సూర్యకుమార్ దూకుడైన బ్యాటింగ్‌తో 208 పరుగులు సాధించినా అవి విజయానికి సరిపోలేదు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్, వేగవంతమైన అవుట్ ఫీల్డ్‌పై అదే రీతిలో జవాబిచ్చిన ఆస్ట్రేలియా భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో సఫలమైంది. ఆరంభంలో గ్రీన్, చివర్లో వేడ్ చెలరేగి ఆ జట్టుకు సిరీస్‌లో ఆధిక్యాన్ని అందించారు. ఇద్దరు ప్రధాన పేసర్లు భువనేశ్వర్, హర్షల్ కలిపి ఒక్క వికెట్ తీయకుండా 8 ఓవర్లలో 101 పరుగులు ఇవ్వడం టీమిండియా ఓటమికి ప్రధాన కారణంగా నిలిచింది. తాజా మ్యాచ్ ఫలితం ప్రపంచకప్‌కు ముందు భారత్ సరిదిద్దుకోవాల్సిన లోపాలను గుర్తు చేసింది.

మొహాలి: భారత్‌పై టి20 సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఆసీస్ నాలుగు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (30 బంతుల్లో 71 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (35 బంతుల్లో 55; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా, సూర్యకుమార్ యాదవ్ (25 బంతుల్లో 46; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కామెరాన్ గ్రీన్ (30 బంతుల్లో 61; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), మాథ్యూ వేడ్ (21 బంతుల్లో 45 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టీవ్ స్మిత్ (24 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఇరు జట్ల మధ్య రెండో టి20 శుక్రవారం నాగపూర్‌లో జరుగుతుంది.

రాహుల్ అర్ధ సెంచరీ...



భారత్ ఇన్నింగ్స్ ధాటిగా ప్రారంభమైనా... తక్కువ వ్యవధిలోనే రోహిత్ (11), కోహ్లి (2) వెనుదిరిగారు. అయితే మరో ఎండ్‌లో రాహుల్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించాడు. తన స్ట్రయిక్‌రేట్‌పై వస్తున్న విమర్శలకు సమాధానాలివ్వాలనే కసి అతనిలో కనిపించింది. సూర్యకుమార్ కూడా తనదైన శైలిలో మెరుపు షాట్లు ఆడటంతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. పవర్‌ప్లేలో భారత్ 46 పరుగులు చేయగా, 10 ఓవర్లలో స్కోరు 86 పరుగులకు చేరింది. 32 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన రాహుల్ ఈ క్రమంలో అంతర్జాతీయ టి20ల్లో 2 వేల పరుగులు కూడా పూర్తి చేసుకున్నాడు. అయితే మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అతను వెనుదిరగ్గా, జంపా ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టిన సూర్యకుమార్ త్రుటిలో అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. ఆ తర్వాత హార్దిక్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత్ భారీ స్కోరు సాధించగలిగింది. చివరి 7 ఓవర్లలో భారత్ 89 పరుగులు సాధించగా, ఇందులో హార్దిక్ ఒక్కడే 69 పరుగులు చేయడం విశేషం. హాజల్‌వుడ్ ఓవర్లో 2 ఫోర్లు, కమిన్స్ ఓవర్లో 6, 4 కొట్టిన అతను 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో చివరి 3 బంతులను అతను వరుసగా 6, 6, 6 బాది ఘనంగా ఇన్నింగ్స్‌ను ముగించాడు. టి20ల్లో ఆస్ట్రేలియాపై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. గాయం నుంచి కోలుకున్న బుమ్రాను ముందు జాగ్రత్తగా భారత్ ఈ మ్యాచ్‌లో ఆడించలేదు.



హార్దిక్

వేడ్ మెరుపులు...

భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్సర్‌గా మలచిన ఆరోన్ ఫించ్ (13 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) అతని మలి ఓవర్లో 3 ఫోర్లు కొట్టాడు. మరోవైపు మూడున్నరేళ్ల తర్వాత తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన ఉమేశ్ యాదవ్ తన తొలి ఓవర్లోనే గ్రీన్‌కు నాలుగు ఫోర్లు సమర్పించుకున్నాడు. ఫించ్‌ను అవుట్ చేసి అక్షర్ ప్రత్యర్థి జోరుకు బ్రేక్ వేసినా... గ్రీన్, స్మిత్ భాగస్వామ్యం (40 బంతుల్లో 70 పరుగులు) ఆసీస్‌ను విజయం వైపు నడిపించింది. అక్షర్, రాహుల్ చెరో క్యాచ్ వదిలేయడం కూడా ప్రత్యర్థికి కలిసొచ్చింది. చహల్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టిన గ్రీన్, అక్షర్ బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో 26 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్లలో స్కోరు 109 పరుగులకు చేరింది. విజయానికి 60 బంతుల్లో 109 పరుగులు చేయాల్సి ఉండగా, 14 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి భారత్ కాస్త ఒత్తిడి పెంచింది. గ్రీన్‌ను అక్షర్ అవుట్ చేయగా... ఉమేశ్ ఒకే ఓవర్లో స్మిత్, మ్యాక్స్‌వెల్ (1)లను వెనక్కి పంపాడు. ఈ రెండు నిర్ణయాలు డీఆర్‌ఎస్ ద్వారానే భారత్‌కు అనుకూలంగా రాగా, ఇన్‌గ్లిస్ (17) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అయితే వేడ్ మెరుపు బ్యాటింగ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. భువీ ఓవర్లో రెండు ఫోర్ల తర్వాత హర్షల్ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదిన అతను... భువీ వేసిన 19వ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టడంతో ఆసీస్ గెలుపు ఖాయమైంది.



గ్రీన్



పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) స్టేడియంలోని రెండు స్టాండ్లకు భారత మాజీ క్రికెటర్లు యువరాజ్, హర్భజన్ పేర్లు పెట్టారు. తొలి టి20 మ్యాచ్ సందర్భంగా ఈ స్టాండ్‌లను పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆవిష్కరించారు. వీరిద్దరితో పాటు పలువురు పంజాబ్ మాజీ క్రికెటర్లను కూడా పీసీఏ సత్కరించింది.



వేడ్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) ఎలిస్ (బి) హాజల్‌వుడ్ 55; రోహిత్ (సి) ఎలిస్ (బి) హాజల్‌వుడ్ 11; కోహ్లి (సి) గ్రీన్ (బి) ఎలిస్ 2; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) గ్రీన్ 46; హార్దిక్ (నాటౌట్) 71; అక్షర్ (సి) గ్రీన్ (బి) ఎలిస్ 6; కార్తీక్ (ఎల్బీ) (బి) ఎలిస్ 6; హర్షల్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 208. **వికెట్ల పతనం:** 1–21, 2–35, 3–103, 4–126, 5–146, 6–176. **బౌలింగ్:** హాజల్‌వుడ్ 4–0–39–2, కమిన్స్ 4–0–47–0, జంపా 4–0–36–0, ఎలిస్ 4–0–30–3, గ్రీన్ 3–0–46–1, మ్యాక్స్‌వెల్ 1–0–10–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ఫించ్ (బి) అక్షర్ 22; గ్రీన్ (సి) కోహ్లి (బి) అక్షర్ 61; స్మిత్ (సి) కార్తీక్ (బి) ఉమేశ్ 35; మ్యాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) ఉమేశ్ 1; ఇన్‌గ్లిస్ (బి) అక్షర్ 17; టిమ్ డేవిడ్ (సి) హార్దిక్ (బి) చహల్ 18; వేడ్ (నాటౌట్) 45; కమిన్స్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు)** 211. **వికెట్ల పతనం:** 1–39, 2–109, 3–122, 4–123, 5–145, 6–207. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–52–0, ఉమేశ్ యాదవ్ 2–0–27–2, అక్షర్ పటేల్ 4–0–17–3, చహల్ 3.2–0–42–1, హర్షల్ పటేల్ 4–0–49–0, హార్దిక్ పాండ్యా 2–0–22–0.

'సలైవా'పై శాశ్వత నిషేధం

- అక్టోబర్ 1 నుంచి మారనున్న నిబంధనలు
- మన్కడింగ్ ఇకపై రైట్ రనౌట్

దుబాయ్: కోవిడ్ మహమ్మారితో బంతిని లాలాజలం (సలైవా, ఉమ్ము)తో మెరుగు పర్చడంపై తాత్కాలిక నిషేధం విధించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇప్పుడు పూర్తిగా నిషేధం విధించింది. ఇకపై ఉమ్ముతో బంతిని రుద్దడం కుదరనే కుదరదు. అయితే ఇప్పటికే రెండున్నరేళ్లుగా ఆటగాళ్లంతా అలవాటు పడిపోవడంతో దాంతో వచ్చే నష్టం, ప్రయోజనం ఏమీ లేదు. దీంతో పాటు మరికొన్ని నిబంధనలు అక్టోబర్ 1 నుంచి మారనున్నాయి. మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) గత మార్చి నెలలోనే కొత్త నిబంధనలకు ఆమోదం తెలుపగా త్వరలోనే అమలు కానున్నాయి.

- మన్కడింగ్ ఇప్పుడు చట్టబద్ధమైన రనౌట్. నాన్ స్ట్రయికర్ బంతిని వేయక ముందే క్రీజు దాటితే బౌలర్ వికెట్లను గిరాటే వేసి రనౌట్ చేయొచ్చు. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమనే విమర్శలకు ఇప్పుడు కాలం చెల్లింది.
- స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న బ్యాటర్ క్యాచ్ అవుటైతే... నాన్ స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న బ్యాటర్ సగం క్రీజు దాటి వచ్చినా అతనికి స్ట్రయికింగ్ అవకాశం ఉండదు. కొత్త బ్యాటర్ మాత్రమే స్ట్రయికర్ ఎండ్‌లోకి వచ్చి ఆడాలి.
- టి20ల్లో నిర్ణీత సమయంలోగా ఓవర్ల కోటా పూర్తవకపోతే సర్కిల్ వెలుపల ఒక ఫీల్డర్‌పై కోత పడేది. అంటే ఒకరిని సర్కిల్ లోపలికి తెచ్చేవారు. అప్పుడు బౌండరీలు ఆపే ఫీల్డర్ తక్కువ వుతారు. ఇది పొట్టి ఫార్మాట్లో ఇప్పటికే ఉంది. దీన్ని వన్డేల్లోనూ అమలు చేస్తారు.



గప్టిల్‌కు చోటు

టి20 ప్రపంచకప్‌కు న్యూజిలాండ్ జట్టు



క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ మార్టిన్ గప్టిల్ వరుసగా ఏడో టి20 ప్రపంచకప్ ఆడనున్నాడు. ఈ మెగా టోర్నీ కోసం మంగళవారం ప్రకటించిన 15 మంది సభ్యుల కివీస్ జట్టులో గప్టిల్‌కు చోటు దక్కింది. 2009 నుంచి గప్టిల్ అన్ని ప్రపంచకప్‌లు ఆడాడు. గత ఏడాది జరిగిన ప్రపంచకప్‌తో పోలిస్తే న్యూజిలాండ్ టీమ్‌లో మూడు మార్పులు జరిగాయి. ఫిన్ అలెన్, మైకేల్ బ్రేస్‌వెల్‌లకు తొలిసారి ప్రపంచ కప్ అవకాశం దక్కగా, లోకీ ఫెర్గూసన్ కూడా జట్టులోకి వచ్చారు. కైల్ జేమీసన్, టాడ్ ఆస్టల్, సీఫెర్ట్‌లను సెలక్టర్లు పక్కన పెట్టారు. ఇటీవల బోర్డు కాంట్రాక్ట్ నిరాకరించిన బౌల్ట్, నీషమ్‌లను కూడా ఎంపిక చేయడం విశేషం.

జట్టు వివరాలు: విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, అలెన్, కాన్వే, ఫిలిప్స్, చాప్‌మన్, డర్యిల్ మిచెల్, నీషమ్, బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, సోధి, బౌల్ట్, సౌతీ, ఫెర్గూసన్, మిల్నే.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో స్మృతి



దుబాయ్: భారత స్టార్ మహిళా బ్యాటర్ స్మృతి మంధాన కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు ఎగబాకింది. ఐసీసీ టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచిన ఆమె వన్డేల్లో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లండ్ పర్యటనలో నిలకడగా రాణించడం ద్వారా ఆమె ర్యాంక్ మెరుగైంది. మూడు టి20ల సిరీస్‌లో ఆమె 111 పరుగులు చేసింది. దీంతో నాలుగో స్థానం నుంచి రెండో స్థానానికి చేరింది. అనంతరం మొదలైన వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 91 పరుగులతో ఒంటి చేత్తో జట్టును గెలిపించడంతో స్మృతి మూడు స్థానాల్ని మెరుగుపర్చుకొని ఏడో ర్యాంక్‌కు చేరింది. వన్డే జాబితాలో మిగతా సహచరుల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాలుగు స్థానాలు ఎగబాకి తొమ్మిదో ర్యాంకులో కొనసాగుతోంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 32వ ర్యాంక్‌లో ఉంది. బౌలర్ల జాబితాలో దీప్తి 18 నుంచి 12వ ర్యాంక్‌కు ఎగబాకింది.

సినిమా



చిరంజీవి

రాజకీయం నా నుంచి దూరం కాలేదు!

''నేను రాజకీయం నుంచి దూరంగా ఉన్నాను. కానీ రాజకీయం నా నుంచి దూరం కాలేదు'' అంటూ మంగళవారం చిరంజీవి చేసిన వాయిస్ ట్వీట్ ఇటు చిత్ర పరిశ్రమలోనూ అటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశం అయింది. అయితే చిరంజీవి పలికిన ఈ డైలాగ్ ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'గాడ్ ఫాదర్'లోనిది అన్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం చిరంజీవి ట్విట్టర్ అకౌంట్ ప్రొఫైల్ ఫోటో కూడా 'గాడ్ ఫాదర్' చిత్రంలోనిదే. మలయాళంలో హిట్ సాధించిన 'లూసిఫర్' సినిమాకు తెలుగు రీమేక్‌గా ఈ చిత్రం రూపొందింది. 'లూసిఫర్' కంప్లీట్ పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్. సో... పొలిటికల్ టచ్ ఉండే డైలాగ్స్ 'గాడ్ ఫాదర్' చిత్రంలో ఉండటం సహజమే. ఆ విధంగా చూసుకున్నా 'గాడ్ ఫాదర్' డైలాగ్‌నే చిరంజీవి చెప్పి ఉంటారని ఊహించవచ్చు. పైగా ఇటీవల 'ఆచార్య' ప్రమోషన్స్‌లో మరోసారి రాజకీయాల్లోకి వెళ్లే ఆలోచన లేదన్నట్లుగా చిరంజీవి పేర్కొన్నారు. ఇక 'గాడ్ ఫాదర్' చిత్రానికి మోహన్‌రాజా దర్శకుడు. నయనతార, సల్మాన్ ఖాన్, సత్యదేవ్ కీలక పాత్రలు పోషించారు. కొణిదెల సురేఖ సమర్పణలో ఎన్వీ ప్రసాద్, ఆర్‌బీ చౌదరి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 5న రిలీజ్ కానుంది.



నాగచైతన్య

యాక్షన్ బిగిన్

నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో కృతీ శెట్టి హీరోయిన్. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ''ఈ సినిమా షూటింగ్‌ను నేటి (బుధవారం) నుంచి ప్రారంభించనున్నాం. అక్కినేని నాగేశ్వరరావుగారి దివ్య ఆశీస్సులతో (సెప్టెంబర్ 20 ఏయన్నార్ జయంతి) ఈ సినిమా అప్‌డేట్‌ను వెల్లడిస్తున్నాం. ఈ సినిమా యాక్షన్ బిగిన్స్'' అని చిత్రబృందం పేర్కొంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, ఆయన తనయుడు మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్‌రాజా ఈ సినిమాకు కలిసి వర్క్ చేస్తున్నారు. ఈ తండ్రీ కొడుకులు ఒకే సినిమాకు కలిసి పని చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఆస్కార్‌కు గుజరాతీ ఫిల్మ్ ఛెల్లో షో



ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుకలకు 'బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్' (అంతర్జాతీయ ఉత్తమ చిత్రం) విభాగంలో నామినేషన్ ఎంట్రీ పోటీ కోసం మన దేశం తరఫున గుజరాతీ మూవీ 'ఛెల్లో షో' (ఇంగ్లీష్‌లో 'లాస్ట్ ఫిల్మ్ షో') ఎంపికైంది. ఈ విషయాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం ప్రకటించింది. పాన్ నలిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భవిన్ రాబరి, భవేష్ శ్రీమాలి, రిచా మీనా, డిపెన్ రావల్ ప్రధాన పాత్రధారులు.

ఈ చిత్రకథ విషయానికి వస్తే... గుజరాత్‌లోని సౌరాష్ట్రలో గల చలాలా గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల సమయ్ (భవిన్ రాబరి) సినిమా ప్రొజెక్టర్ టెక్నీషియన్ ఫజల్ (భవేష్ శ్రీమాలి)ని మచ్చిక చేసుకుని, సినిమా హాల్ ప్రొజెక్షన్ బూత్‌లోకి ప్రవేశిస్తాడు. అలా వేసవిలో చాలా సినిమాలు చూస్తాడు. ఆ తర్వాత అతనే సొంతంగా ఓ ప్రొజెక్షన్‌ని తయారు చేయాలనుకుంటాడు. సినిమా అతని జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేసిందనే కథతో ఈ చిత్రం సాగుతుంది. చిత్రదర్శకుడు నలిన్ నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమా పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. ''ఛెల్లో షో'పై నమ్మకం ఉంచి, మా చిత్రాన్ని ఆస్కార్‌కు ఎంపిక చేసినందుకు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ధన్యవాదాలు. ఇప్పుడు నేను మళ్లీ ఊపిరి తీసుకోగలుగుతున్నాను. అలాగే సినిమా అనేది వినోదాన్ని, స్ఫూర్తిని, విజ్ఞానాన్ని అందిస్తుందని నమ్ముతున్నాను'' అని ట్వీట్ చేశారు దర్శకుడు పాన్ నలిన్. ఈ సంగతలా ఉంచితే.. బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో 'ఆర్ఆర్ఆర్'ని ఎంపిక చేయకపోవడంపట్ల సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు విమర్శిస్తూ, ట్వీట్లు చేశారు. అయితే 'ఆర్ఆర్ఆర్'ని చిత్రబృందం ఆస్కార్ నామినేషన్ ఎంట్రీకి పంపించిందా? లేదా అనే విషయంపై స్పష్టత లేదు.



యశ్

రాజు వచ్చే నెల వస్తాడు

యశ్, రాధికా పండిట్ జంటగా మహేశ్‌రావు దర్శకత్వంలో రూపొందిన కన్నడ చిత్రం 'సంతు: స్ట్రయిట్ ఫార్వార్డ్'. ఈ సినిమా తెలుగులో 'రారాజు'గా రిలీజ్ కానుంది. పద్మావతి పిక్చర్స్ పతాకంపై వీఎస్ సుబ్బారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ''కన్నడంలో మంచి విజయం సాధించిన ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో అక్టోబరులో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు వీఎస్ సుబ్బారావు. 'కిక్' శ్యామ్, సీత, రవిశంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: హరికృష్ణ.

నీతోనే.. నీతోనే...

అభిరామ్, గీతిక జంటగా తేజ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అహింస'. పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఆర్పీ పట్నాయక్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కలలో అయినా, కలిసుండని కాలాలైనా నీతోనే నీతోనే..' అంటూ సాగే పాటని విడుదల చేశారు. చంద్రబోస్ రాసిన ఈ పాటని సిద్ శ్రీరామ్, సత్య యామిని పాడారు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.



గీతిక, అభిరామ్

అలా ఉండిపోదలచుకోలేదు

"పోలీస్ స్టోరీగా తెరకెక్కిన చిత్రం 'అల్లూరి'. ఫిక్షనల్ పాత్ర తీసుకొని వాస్తవ ఘటనలతో రూపొందించాం. ఈ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుంది.. చాలామందిలో స్ఫూర్తి నింపుతుంది" అని హీరో శ్రీ విష్ణు అన్నారు. ప్రదీప్ వర్మ దర్శకత్వంలో శ్రీ విష్ణు, కయదు లోహర్ జంటగా నటించిన చిత్రం 'అల్లూరి'. బెక్కెం బబిత సమర్పణలో బెక్కెం వేణు గోపాల్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజవుతోంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు పంచుకున్న విశేషాలు...



- 'అల్లూరి' కథ చెప్పే ముందు ప్రదీప్ ఇందులో నాది పోలీస్ పాత్ర అంటే లైట్ తీసుకున్నాను. కానీ, కథ విన్నాక చేయాలనిపించింది. ఎలాంటి పరిస్థితిలోనైనా నిజాయితీగా ఉంటూ విధిని నిర్వహించే ఓ పోలీస్ కథ ఇది. వ్యవస్థలోని మంచి చెడుల్ని చూపించాం. చెడుకి పరిష్కారం కూడా చెప్పాం.
- కృష్ణగారి సినిమా 'అల్లూరి సీతారామరాజు' క్లయిమాక్స్‌లో 'ఒక అల్లూరి చనిపోతే వందమంది అల్లూరిలు పుడతారు' అనే డైలాగ్ ఉంది. ఆ వందమందిలో మా 'అల్లూరి' ఒకరు (నవ్వుతూ).
- పక్కింటి అబ్బాయిలా కంఫర్ట్ జోన్‌లో ఉంటే కొంత కాలానికి బోర్ కొట్టేస్తుంది. అందుకే అలా ఉండిపోదలచుకోలేదు. విభిన్నమైన పాత్రలు చేయాలని కొత్త ప్రయత్నాలు చేస్తుంటాను. అయితే మాస్ ఇమేజ్ తెచ్చుకోవాలనే ఉద్దేశం లేదు.
- 'అల్లూరి'కి కొత్త ఆడియన్స్ కావాలి. దీనికి నా ఒక్కడి బలం సరిపోదు. అందుకే అల్లు అర్జున్‌గారిని మా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి పిలిచాను. మాకు సపోర్ట్ చేసిన బన్నీ, నాని, రవితేజగార్లకు థ్యాంక్స్. నిజానికి ఏఏ (అల్లు అర్జున్) సెంటిమెంట్ నాకు కలిసొచ్చింది. 'అల్లూరి'లో 'అల్లు' రావడం ఇంకా హ్యాపీ (నవ్వుతూ).
- రానున్న రెండేళ్లలో ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నాను. దర్శకుడు మన తెలుగువాడే. స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ప్రస్తుతం హాసిత్, సాయి, హర్ష దర్శకత్వాల్లో సినిమాలు చేస్తున్నాను.

వినోదాల పగ

అభిలాష్ సుంకర, దీపిక ఆరాధ్య జంటగా రవిశ్రీ దుర్గా ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పగ పగ పగ'. సంగీత దర్శకుడు కోటి కీలక పాత్ర చేశారు. సుంకర బ్రదర్స్ సమర్పణలో సత్యనారాయణ సుంకర నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదల కానుంది. ''వినోదాత్మకంగా సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇది. మా సినిమాపై నమ్మకంతో ఫస్ట్ డే ఫస్ట్ షో ఉచితంగా చూపించాలని నిర్ణయించుకున్నాం'' అన్నారు సత్యనారాయణ సుంకర.



అభిలాష్
దీపిక

నారీ నారీ మధ్య కెప్టెన్


'కెప్టెన్ మిల్లర్' కథానాయికలు కన్ఫార్మ్ అయ్యారు. ధనుష్ హీరోగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికలుగా ప్రియాంకా అరుళ్ మోహన్, నివేదితా సతీష్ నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ''ధనుష్‌గారు చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కావడం సంతోషంగా ఉంది'' అని ప్రియాంక పేర్కొన్నారు. ''స్ఫూర్తి నింపే నటుడు ధనుష్‌గారితో కలిసి నటించేందుకు ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు నివేదితా సతీష్. 1930–1940 నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమాలో సందీప్ కిషన్ ఓ కీ రోల్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమాను ఒకేసారి విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: శ్రేయాస్ కృష్ణ.



నివేదితా సతీష్
ప్రియాంకా అరుళ్ మోహన్

థ్రిల్లర్ కబ్జా

ఉపేంద్ర హీరోగా, శ్రియా శరన్ హీరోయిన్‌గా ఆర్. చంద్రు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కబ్జా'. హీరోలు కిచ్చా సుదీప్ కీలక పాత్రలో నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్ స్పెషల్ అప్పియరెన్స్ ఇవ్వనున్నారు. ఆర్. చంద్రశేఖర్ నిర్మిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం టీజర్‌ని హీరో రానా విడుదల చేశారు. ''కబ్జా' మంచి యాక్షన్ థ్రిల్లర్ మూవీ. 1942 బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఇందులో పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో ఉపేంద్ర నటిస్తున్నారు. టీజర్ నెక్ట్స్ లెవల్‌లో ఉందని ఫ్యాన్స్, ప్రేక్షకులు అంటున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: ఏజే శెట్టి.



ఉపేంద్ర

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
579	194
59,720	17,816

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్‌	11,442	▽	92
డోజోన్స్‌	30,602	▽	418
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,193	▽	44
డాక్స్‌	12,671	▽	132
షాంఘై	3,122	▲	7
నికాయ్‌	27,688	▲	121

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

23 నుంచి జియోమార్ట్‌ పండుగల ఆఫర్‌



హైదరాబాద్‌: నవరాత్రి, దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఈ నెల 23వ తేదీ నుంచి ఫేవరేట్‌ ఈకామర్స్‌ ప్లాట్‌ఫామ్‌–జియోమార్ట్‌ ప్రత్యేక ఆఫర్లను అందించనుంది. ''ఫెస్టివ్‌ రెడీ సేల్‌' పేరుతో ఈ నెల 27వ తేదీ వరకూ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. అన్ని కేటగిరీల ప్రొడక్టులపై విస్తృత శ్రేణిలో పొదుపు ఆఫర్లు లభిస్తాయని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన పేర్కొంది. స్మార్ట్‌ బజార్, స్మార్ట్‌ సూపర్‌స్టోర్, స్మార్ట్‌ పాయింట్, రిలయన్స్‌ ఫ్రెష్‌సహా దేశ వ్యాప్తంగా 2,700 విస్తృతస్థాయి స్మార్ట్‌ స్టోర్స్‌ నెట్‌వర్క్‌ కస్టమర్లకు అందుబాటులో ఉంటుందని వివరించింది.

ఆర్‌బీఐ 'నిఘా నేత్రం' నుంచి బయటపడ్డ సెంట్రల్‌ బ్యాంక్‌



ముంబై: రిజర్వ్‌ బ్యాంక్‌ (ఆర్‌బీఐ) దిద్దుబాటు చర్యల చట్రం (పీసీఏఎఫ్‌) నుంచి సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా బయట పడింది. పలు ప్రమాణాలు మెరుగుపడటం, మూలధన నిర్వహణకు సంబంధించి నిబంధనలు పటిష్టంగా పాటిస్తామన్న లిఖితపూర్వక హామీ నేపథ్యంలో పీసీఏఎఫ్‌ జాబితా నుంచి బ్యాంకును తొలగిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటన పేర్కొంది.

బులియన్‌ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	49,368	▲	48
బంగారం (99.5 స్వచ్ఛత)	49,170	▲	47
వెండి (కిలో)	56,354		0

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

21-9-2022	
విశాఖ	425–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్‌ ధర (డజను)	66.00
20-9-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	393–00
వరంగల్‌	395–00
రిటైల్‌ ధర	4.55


ఖరీదైనా పెంచుకుంటున్నారు..

- రూ. 8,000 కోట్లకు పెట్‌ కేర్‌
- కోవిడ్‌తో పెరిగిన మార్కెట్‌

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: కుక్క, పిల్లి, పక్షి.. పెంపుడు జంతువు ఏదైనా వీటి మీద మనుషులకు ఉన్న ప్రేమ పెట్‌ కేర్‌ రంగ కంపెనీలకు కాసులు కురిపిస్తోంది. భారత్‌లో పెంపుడు జంతువుల సంరక్షణ (పెట్‌ కేర్‌) విపణి రూ.8,000 కోట్లుంది. ఇందులో సగం వాటా పెట్‌ ఫుడ్‌ కైవసం చేసుకుంది. మిగిలిన వాటా భద్రత, పోషణ, వ్యాయామం, వైద్య సంరక్షణ వంటి సేవలు దక్కించుకున్నాయి. కోవిడ్‌–19 మహమ్మారి పుణ్యమా అని ఒత్తిడి, నిరాశ నుంచి బయటపడేందుకు పెంపుడు జంతువులను పెంచుకునే ట్రెండ్‌ అధికం అయింది. ఈ నేపథ్యంలో 2025 నాటికి పరిశ్రమ రూ.10,000 కోట్లను దాటుతుందని అంచనా. దేశవ్యాప్తంగా 3 కోట్ల పైచిలుకు పెంపుడు జంతువులు ఉన్నట్టు సమాచారం. వీటి సంఖ్య ఏటా 11% పెరుగుతోంది.

పోటీలో దిగ్గజాలు..


పెట్‌ ఫుడ్‌ విభాగం ఏటా 20 శాతం వృద్ధి చెందుతోందని ఎడెల్వీజ్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ చెబుతోంది. పెట్‌ కేర్‌ రంగంలో మార్స్‌ పెట్‌కేర్, హిమాలయ వెల్‌నెస్‌ కంపెనీలు అగ్ర స్థానంలో ఉన్నాయి.



మకావ్‌ చిలుకలు



కొరియన్‌ మాస్టిఫ్‌



షిడ్జూ కుక్క పిల్ల

ప్యూరినా పెట్‌కేర్‌ ఇండియాను కొనుగోలు చేయడం ద్వారా నెస్లే ఈ రంగంలోకి ఇటీవలే ఎంట్రీ ఇచ్చింది. క్యానిస్‌ లుపస్‌ సర్వీసెస్‌ ఇండియాలో పెట్టుబడి చేస్తున్నట్టు ఇమామీ ప్రకటించింది. వేగంగా వృద్ధి చెందుతున్న పెట్‌ కేర్‌ మార్కెట్లలో భారత్‌ ఒకటిగా ఉందని మార్స్‌ పెట్‌కేర్‌ ఎండీ సలీల్‌ మూర్తి తెలిపారు. పెడిగ్రీ, విస్కాస్‌ వంటి బ్రాండ్లను ప్రమోట్‌ చేస్తున్న మార్స్‌ పెట్‌కేర్‌ హైదరాబాద్‌ ప్లాంటు విస్తరణకు రూ.500 కోట్ల పెట్టుబడి చేస్తోంది. కాస్మోస్‌ ఫిల్మ్స్‌ జిగ్లీ బ్రాండ్‌తో ఈ రంగంలో అడుగుపెట్టింది.

లక్షలు వెచ్చిస్తున్నారు..

పెంపుడు జంతువుల కొనుగోళ్ల విషయంలో భారత్‌లో బెంగళూరు తర్వాత హైదరాబాద్‌ రెండవ స్థానంలో నిలిచింది. పెట్స్‌లో కుక్కల వాటా అత్యధికంగా 75 శాతం ఉంది. పిల్లులు 15 శాతం, పక్షులు 10 శాతం వాటా కైవసం చేసుకున్నాయని సమాచారం. షిడ్జూ కుక్క పిల్ల, ఆస్ట్రేలియన్‌ కాకటియెల్‌ పక్షులకు డిమాండ్‌ ఎక్కువ. రంగు రంగుల్లో లభించే పక్షుల అమ్మకాలే అధికం. బ్లూ–గోల్డ్‌ మకావ్‌ చిలుకలు రూ.2 లక్షల నుంచి, స్కార్లెట్‌ మకావ్‌ రూ.18 లక్షల వరకు లభిస్తాయి. ఒక మీటర్‌ దాకా పొడవు ఉండే హయసింత్‌ మకావ్‌ ఖరీదు రూ.40 లక్షల వరకు ఉంది. సవన్నా పిల్లుల జతకు బెంగళూరులో ఓ కస్టమర్‌ రూ.50 లక్షలు, మరో కస్టమర్‌ కొరియన్‌ మాస్టిఫ్‌ కుక్కకు రూ.1 కోటి వెచ్చించారని అమ్మూస్‌ పెట్స్, కెన్నెల్స్‌ ఫౌండర్‌ మహమ్మద్‌ మొయినుద్దీన్‌ సాక్షి బిజినెస్‌ బ్యూరోకు తెలిపారు. 'విదేశాల నుంచి పెట్స్‌ దిగుమతిపై నిషేధం ఉంది. దేశీయంగానే వీటిని పెంచుతున్నారు. కోవిడ్‌ సమయంలో డిమాండ్‌ పెరగడంతో కొరత ఏర్పడి వీటి ధరలు రెండింతలయ్యాయి. రంగు, ఆకారం, ఆరోగ్య స్థితినిబట్టి ధర నిర్ణయం అవుతోంది' అని తెలిపారు. సెలబ్రిటీల్లో క్రికెటర్‌ యూసుఫ్‌ పఠాన్, సినీ నటుడు రామ్‌చరణ్, దర్శకుడు పూరీ జగన్నాథ్‌.. ఇలా చెప్పుకుంటూ పోతే పెట్స్‌ ప్రేమికుల జాబితా పెద్దదే.

హెచ్‌పీసీఎల్‌తో హీరో మోటోకార్ప్‌ జట్టు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్‌ ద్విచక్ర వాహనాల కోసం చార్జింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేసే దిశగా హీరో మోటోకార్ప్, ప్రభుత్వ రంగ హిందుస్తాన్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ (హెచ్‌పీసీఎల్‌) చేతులు కలిపాయి. దీని ప్రకారం ప్రస్తుతం హెచ్‌పీసీఎల్‌కి ఉన్న బంకుల్లో ఇరు సంస్థలు కలిసి చార్జింగ్‌ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తాయి. తొలి దశలో ఎంపిక చేసిన నగరాల్లో చార్జింగ్‌ స్టేషన్లను నెలకొల్పనున్నట్లు, ఆ తర్వాత ఇతరత్రా మార్కెట్లకు విస్తరించనున్నట్లు హీరో మోటోకార్ప్‌ తెలిపింది. చార్జింగ్‌ మొదలుకుని చెల్లింపుల వరకూ మొత్తం ప్రక్రియను హీరో మోటోకార్ప్‌ మొబైల్‌ యాప్‌ ద్వారా నిర్వహించుకోవచ్చని పేర్కొంది. దేశవ్యాప్తంగా తమకు 20,000 పైచిలుకు రిటైల్‌ అవుట్‌లెట్లు ఉన్నాయని, ద్విచక్ర వాహనాల మార్కెట్లో దిగ్గజంగా ఉన్న హీరో మోటోకార్ప్‌తో జట్టు కట్టడం ద్వారా పెద్ద ఎత్తున చార్జింగ్‌ స్టేషన్లను అందుబాటులోకి తెచ్చేందుకు సాధ్యపడుతుందని హెచ్‌పీసీఎల్‌ చైర్మన్‌ పుష్ప కుమార్‌ జోషి చెప్పారు.

హీరో గ్రూప్‌తో కేకేఆర్‌ జత



- పునరుత్పాదక ఇంధనంపై దృష్టి
- రూ. 3,588 కోట్ల పెట్టుబడులకు సై

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన విభాగంపై దృష్టితో గ్లోబల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ దిగ్గజం కేకేఆర్‌ దేశీ కంపెనీ హీరో గ్రూప్‌తో చేతులు కలిపింది. తద్వారా హీరో గ్రూప్‌ సంస్థ.. హీరో ఫ్యూచర్‌ ఎనర్జీస్‌లో భాగస్వామ్యానికి తెరతీసింది. ఇందుకు అనుగుణంగా హీరో ఫ్యూచర్‌ ఎనర్జీస్‌లో సంయుక్తంగా రూ. 45 కోట్ల డాలర్లు(రూ. 3,588 కోట్లు) ఇన్వెస్ట్‌ చేయనున్నట్లు హీరో గ్రూప్‌ తెలియజేసింది. ఈ పెట్టుబడులతో కంపెనీ వృద్ధి బాటలో సాగేందుకు అవసరమైన మద్దతు లభించనున్నట్లు పేర్కొంది. పునరుత్పాదక ఇంధన సామర్థ్యాలు, టెక్నాలజీల అభివృద్ధితోపాటు.. విస్తరణవైపు అడుగులేయనున్నట్లు తెలియజేసింది. సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజీ, గ్రీన్‌ హైడ్రోజన్‌ విభాగాలలో టెక్నాలజీలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించింది. తదుపరి ఇతర మార్కెట్లకూ కార్యకలాపాలు విస్తరించే ప్రణాళికలున్నట్లు హీరో గ్రూప్‌ తెలియజేసింది. అంతేకాకుండా కంపెనీల కర్బనరహిత ప్రయాణానికి తగిన మద్దతునివ్వనున్నట్లు వెల్లడించింది. 2012లో ఏర్పాటైన హీరో ఫ్యూచర్‌ ఎనర్జీస్‌ స్వతంత్ర విద్యుదుత్పత్తి(ఐపీపీ) సంస్థలలో అగ్రగామిగా నిలుస్తోంది. సౌర, పవన విద్యుత్‌ ప్రాజెక్టులతో కలిపి 1.6 గిగావాట్ల డైవర్సిఫైడ్‌ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

ఐవోసీ బంకుల్లో ఈవోల్ట్‌ చార్జింగ్‌ స్టేషన్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ (ఐవోసీ) బంకుల్లో చార్జింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు స్టార్టప్‌ సంస్థ ఈవోల్ట్‌ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ ప్రదేశ్‌లో 75 పైచిలుకు స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, కార్ల కోసం వీటిని ఉపయోగించనున్నారు. భారీ స్థాయి చార్జింగ్‌ స్టేషన్ల నెట్‌వర్క్‌ ఏర్పాటు చేయాలన్న లక్ష్య సాకారానికి ఐవోసీతో భాగస్వామ్యం తోడ్పడగలదని ఈవోల్ట్‌ ఇండియా వ్యవస్థాపకుడు, సీఈవో సార్థక్‌ శుక్లా తెలిపారు.

రెండో రోజూ మార్కెట్ల జోరు

- సెన్సెక్స్‌ 579 పాయింట్ల హైజంప్‌
- 59,720 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 965 పాయింట్లు జూమ్‌
- 17,816కు నిఫ్టీ.. 194 పాయింట్లు అప్‌



ముంబై: ప్రపంచ కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచనున్న ఆందోళనలున్నప్పటికీ వరుసగా రెండో రోజు దేశీ స్టాక్‌ మార్కెట్లు లాభపడ్డాయి. తొలి నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో రోజంతా దూకుడు చూపాయి. వెరసి ప్రామాణిక ఇండెక్స్‌ సెన్సెక్స్‌ 579 పాయింట్లు జంప్‌చేసి 59,720 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 965 పాయింట్లవరకూ ఎగసింది. మళ్లీ 60,100 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. ఈ బాటలో మిడ్‌సెషన్‌కల్లా నిఫ్టీ 297 పాయింట్లు దూసుకెళ్లి 18,000 పాయింట్ల సమీపానికి చేరింది. చివరికి 194 పాయింట్ల వృద్ధితో 17,816 వద్ద స్థిరపడింది. మంగళవారం నుంచి యూఎస్, యూకే, స్విట్జర్లాండ్, బీవోఈ వడ్డీ రేట్ల సమీక్షను చేపట్టనున్నాయి. అయితే వడ్డీ రేట్ల పెంపు ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారితీయవచ్చన్న అంచనాలు గ్లోబల్‌ మార్కెట్లలో సెంటిమెంటును బలహీనపరుస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

ఫార్మా స్పీడ్‌

ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ లాభపడగా.. ఫార్మా, మెటల్, ఆటో, బ్యాంకింగ్, రియల్టీ 3–1.5% మధ్య ఎగశాయి. నిఫ్టీలో అపోలో హాస్పిటల్, సిప్లా, సన్‌ ఫార్మా, ఐషర్, డాక్టర్‌ రెడ్డీస్, టాటా స్టీల్, ఇండస్‌ఇండ్, టైటన్, హీరోమోటో, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఏషియన్‌ పెయింట్స్, ఐసీఐసీఐ, యాక్సిస్‌ 6–2% మధ్య జంప్‌ చేశాయి.

చిన్న షేర్లకూ డిమాండ్‌..: ద్రవ్యోల్బణ అదుపునకు ఫెడ్, ఆర్‌బీఐసహా పలు దేశాల కేంద్ర బ్యాంకులు కఠిన పరపతి విధానాలను అవలంబిస్తున్న నేపథ్యంలోనూ మార్కెట్లు జోరు చూపుతున్నాయి. తాజాగా చిన్న, మధ్యతరహా కౌంటర్లకు డిమాండ్‌ పెరిగింది. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌ క్యాప్స్‌ 1.6–1% బలపడ్డాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.1,196 కోట్లు, దేశీ ఫండ్స్‌(డీఐఐలు) రూ. 132 కోట్లు ఇన్వెస్ట్‌ చేశాయి.

స్టాక్‌ హైలైట్స్‌

- ఎఫ్‌పీఐ నలందా ఇండియా ఈక్విటీ 29.1 లక్షల షేర్లను కొనుగోలు చేసిన వార్తలతో అడ్వాన్స్‌డ్‌ ఎంజైమ్‌ టెక్‌ 9% దూసుకెళ్లి రూ. 291 వద్ద ముగిసింది.
- జీఎస్‌ఎం–3 పర్యవేక్షణ నుంచి తప్పించడంతో టాటా గ్రూప్‌ షేరు టీఆర్‌ఎఫ్‌ ఆరో రోజు 5% అప్పర్‌ సర్క్యూట్‌తో రూ.341 వద్ద ముగిసింది.
- పండుగల సీజన్‌ కారణంగా వంట నూనెలకు డిమాండ్‌ పెరుగుతున్న వార్తలతో అదానీ విల్మర్, పతంజలి ఫుడ్స్‌ 5% చొప్పున అప్పర్‌ సర్క్యూట్లను తాకాయి. రూ. 770, రూ. 1,397 వద్ద ముగిశాయి.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్‌ పాయింట్‌ కోసం

ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

జాబ్‌ పాయింట్‌

ఫారెస్ట్‌ కాలేజీలో 27 ప్రొఫెసర్‌ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలో ఉన్న ఫారెస్ట్‌ కాలేజ్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌.. పలు విభాగాల్లో టీచింగ్‌ పోస్టుల భర్తీకి తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌ ద్వారా ప్రొఫెసర్, అసోసియేట్‌ ప్రొఫెసర్, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టుల్లో నియామకాలు చేపడతారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్‌ 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టులు:** 27(ప్రొఫెసర్‌–2, అసోసియేట్‌ ప్రొఫెసర్‌–4, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌–21).
» **సబ్జెక్టులు:** వైల్డ్‌ లైఫ్‌ మేనేజ్‌మెంట్, నేచురల్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్, అగ్రికల్చరల్‌ ఎకనామిక్స్, ఫారెస్ట్‌ యుటిలైజేషన్, సాయిల్‌ సైన్స్‌ అండ్‌ అగ్రికల్చరల్‌ కెమిస్ట్రీ, ట్రీ బ్రీడింగ్‌ అండ్‌ ఇంప్రూవ్‌మెంట్, జియో ఇన్ఫర్మేటిక్స్, ఆగ్రో ఫారెస్ట్రీ, సీడ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, ఫారెస్ట్‌ మేనేజ్‌మెంట్, అగ్రికల్చరల్‌ స్టాటిస్టిక్స్, ఆగ్రో ఫారెస్ట్రీ, బోటనీ, కంప్యూటర్‌ సైన్స్‌/ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, ఉడ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, ఫారెస్ట్‌ బయాలజీ, ఫారెస్ట్‌ జెనెటిక్‌ రిసోర్సెస్, వైల్డ్‌ లైఫ్‌ సైన్స్‌.
» **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంసీఏ, ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు టీచింగ్, రీసెర్చ్‌ అనుభవం ఉండాలి. » **వయసు:** 01.07.2022 నాటికి 21–61ఏళ్ల మధ్య ఉండాలి.

వేతనాలు

ప్రొఫెసర్‌ పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ.1,44,200, అసోసియేట్‌ ప్రొఫెసర్‌కు రూ.1,31,400, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌కు రూ.57,700 వేతనంగా చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** అకడమిక్‌/రీసెర్చ్‌ యాక్టివిటీ, అకడమిక్‌ స్కోర్, టీచింగ్‌ అనుభవం, రీసెర్చ్‌ పబ్లికేషన్స్, ఇంటర్వ్యూ కమ్‌ డెమో తదితర ప్రక్రియల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 27.09.2022
» **వెబ్‌సైట్‌:** https://www.tspsc.gov.in

సఫ్దర్‌జంగ్‌ హాస్పిటల్, న్యూఢిల్లీలో 434 సీనియర్‌ రెసిడెంట్‌ పోస్టులు

న్యూఢిల్లీలోని వీఎంఎం కాలేజ్‌–సఫ్దర్‌జంగ్‌ హాస్పిటల్‌.. వివిధ విభాగాల /స్పెషాలిటీలలో రెగ్యులర్‌ ప్రాతిపదికన సీనియర్‌ రెసిడెంట్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 434
» **విభాగాలు:** అనెస్థీషియా, అనాటమీ, బయోకెమిస్ట్రీ, క్యాన్సర్‌ సర్జరీ, కార్డియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్‌ మెడిసిన్, హెమటాలజీ, ల్యాబ్‌ ఆంకాలజీ, మెడికల్‌ ఆంకాలజీ, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, న్యూరోఫిజికల్‌ సర్జరీ, న్యూరోఫాలజీ, ఆర్థోపెడిక్స్‌ తదితరాలు.
» **అర్హత:** ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు పీజీ డిగ్రీ, డిప్లొమా, ఎండీ, డీఎన్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 45ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మెడికల్‌ సూపరింటెండెంట్, వీఎంఎం కాలేజ్‌–సఫ్దర్‌జంగ్‌ హాస్పిటల్, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.09.2022
» **వెబ్‌సైట్‌:** www.vmmc.sjh.nic.in

టీవీవీపీ ఆసుపత్రులు, హైదరాబాద్‌లో 66 పోస్టులు

హైదరాబాద్‌లోని ప్రోగ్రామ్‌ ఆఫీస్‌ కార్యాలయం (హెచ్‌ఎస్‌–ఐ).. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ ఆసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన సీఏఎస్‌(స్పెషలిస్టులు), జీడీఎంవో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 66

» **పోస్టుల వివరాలు:** సీఏఎస్‌(స్పెషలిస్టులు)– ఓ అండ్‌ బీ, అనెస్థీషియా, పీడియాట్రిక్స్, రేడియాలజీ, జనరల్‌ మెడిసిన్, జనరల్‌ సర్జరీ, ఆర్థో, జీడీఎంవో. » **అర్హత:** ఎంబీబీఎస్, ఎండీ, డిప్లొమా, డీఎన్‌బీ ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ (హెచ్‌ఎస్‌–ఐ) కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్, ఖైరతాబాద్, హైదరాబాద్‌ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.09.2022
» **వెబ్‌సైట్‌:** hyderabad.telangana.gov.in

ఐటీబీపీలో 52 కానిస్టేబుల్‌ పోస్టులు

ఇండో–టిబెటన్‌ బోర్డర్‌ పోలీస్‌ ఫోర్స్‌.. కానిస్టేబుల్‌(యానిమల్‌ ట్రాన్స్‌పోర్ట్‌) గ్రూప్‌ సీ నాన్‌ గెజిటెడ్‌(నాన్‌ మినిస్టీరియల్‌) పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 52 (పు. 44, మ. 08)
» **అర్హత:** మెట్రిక్యులేషన్‌ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25ఏళ్ల మధ్య ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 వరకు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్, రాతపరీక్ష, డాక్యుమెంట్ల వెరిఫికేషన్, మెడికల్‌ ఎగ్జామినేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 27.09.2022
» **వెబ్‌సైట్‌:** www.recruitment.itbpolice.nic.in

ఐఐటీలకు మరో మార్గం.. జామ్‌!

ఐఐటీల్లో ఉన్నత విద్య.. ఆపై అత్యున్నత కెరీర్‌. సైన్స్, టెక్నికల్‌ విభాగాల విద్యార్థుల్లో.. అత్యధిక శాతం మంది లక్ష్యం ఇదే! ఇందుకోసం మొదట గేట్‌ పరీక్షపై దృష్టిపెడతారు. గేట్‌లో ఆశించిన ఫలితం రాకుంటే.. ఐఐటీల్లో ఉన్నత విద్య చేజారినట్లేనా..! అని ఆందోళన చెందుతుంటారు! ఐఐటీల్లో ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశానికి మరో మార్గం ఉంది. అదే.. జాయింట్‌ అడ్మిషన్‌ టెస్ట్‌ ఫర్‌ మాస్టర్స్‌.. సంక్షిప్తంగా జామ్‌!!జాతీయ స్థాయిలో.. ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ వంటి కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది! తాజాగా.. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి జామ్‌ నోటిఫికేషన్‌ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జామ్‌తో ప్రయోజనాలు, ప్రవేశం లభించే కోర్సులు, పరీక్ష విధానం తదితర వివరాలు తెలుసుకుందాం..



» 21 ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్‌ పీహెచ్‌డీల్లో ప్రవేశం
» పలు స్పెషలైజేషన్లలో మూడు వేలకు పైగా సీట్లు
» జామ్‌–2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

జామ్‌... ఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో మ్యాథమెటిక్స్, సైన్సెస్‌ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. ప్రతి ఏటా ఈ పరీక్షను ఒక్కో ఐఐటీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఐఐటీ–గువహటి ఆధ్వర్యంలో జామ్‌ పరీక్ష జరుగనుంది.

ప్రవేశం లభించే కోర్సులు

- జామ్‌ స్కోర్‌తో ప్రస్తుతం దేశంలోని 21 ఐఐటీల్లో.. మూడు వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. • జామ్‌లో ప్రతిభ ఆధారంగా ఎమ్మెస్సీ(రెండేళ్లు), మాస్టర్స్‌ ఇన్‌ ఎకనామిక్స్‌ (రెండేళ్లు), జాయింట్‌ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ డ్యూయల్‌ డిగ్రీ, పోస్ట్‌ బ్యాచిలర్‌ డిగ్రీ ప్రోగ్రామ్స్, ఇంటిగ్రేటెడ్‌ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం లభిస్తుంది.

ఎన్‌ఐటీలు, సీఎఫ్‌టీలకు జామ్‌ స్కోర్‌

- జామ్‌ స్కోర్‌తో ఐఐటీల్లోనే కాకుండా.. ఎన్‌ఐటీలు, ట్రిపుల్‌ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థలు సైతం ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. దాదాపు రెండు వేల సీట్లు వీటిలో అందుబాటులో ఉన్నాయి. •అదే విధంగా ఐఐఎస్‌ఈఆర్‌–పుణె, భోపాల్‌ క్యాంపస్‌లు, ఐఐఎస్‌సీ–బెంగళూరు, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్‌ఆర్‌ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా జామ్‌ స్కోర్‌ ఆధారంగా ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్‌ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎంఎస్‌ బై రీసెర్చ్‌ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

అర్హతలు

జామ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా 5.5 సీజీపీఏ ఉండాలి. 2023లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాంటి విద్యార్థులు సెప్టెంబర్‌ 29, 2023లోపు సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

ఏడు పేపర్లు

జామ్‌ను ప్రస్తుతం ఏడు టెస్ట్‌ పేపర్లుగా ఆన్‌లైన్‌ విధానంలో నిర్వహిస్తున్నారు. అవి.. బయోటెక్నాలజీ; కెమిస్ట్రీ; ఎకనామిక్స్‌; జియాలజీ; మ్యాథమెటిక్స్‌; మ్యాథమెటికల్‌ స్టాటిస్టిక్స్‌; ఫిజిక్స్‌. అభ్యర్థులు గరిష్టంగా రెండు పేపర్లలో పరీక్షకు హాజరవ్వొచ్చు. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది.

మూడు విభాగాల్లో జామ్‌

- జామ్‌ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో జరుగుతుంది. వివరాలు..
- సెక్షన్‌–ఎ: 30 మల్టిపుల్‌ ఛాయిస్‌ కొశ్చన్స్‌(ఎంసీక్యూ)ఉంటాయి.ఇందులో 10 ఒక మార్కు ప్రశ్నలు, 20 రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్‌–బి: ఈ విభాగంలో 10 మల్టిపుల్‌ సెలక్ట్‌ కొశ్చన్స్‌(ఎంఎస్‌క్యూ) ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు ఉంటాయి. వీటిలో ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. అభ్యర్థులు అడిగిన ప్రశ్నకు సరితూగే సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది.
- సెక్షన్‌–సి: ఈ విభాగంలో 20 న్యూమరికల్‌ ఆన్సర్‌ టైప్‌ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 1 మార్కు ప్రశ్నలు 10, 2 మార్కుల ప్రశ్నలు 10 ఉంటాయి. • మొత్తం మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. • నెగెటివ్‌ మార్కింగ్‌ నిబంధన అమలవుతోంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు కోత విధిస్తారు. ఎంఎస్‌క్యూ, ఎన్‌ఏటీ విభాగాల్లో ఎలాంటి నెగెటివ్‌ మార్కులు ఉండవు.

ప్రవేశాలు ఇలా

జామ్‌లో స్కోర్‌ ఆధారంగా ఐఐటీలు ఆన్‌లైన్‌ విధానంలో అడ్మిషన్‌ ప్రక్రియ నిర్వహిస్తాయి. అభ్యర్థులు ఐఐటీల్లో సీట్ల కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం.. జామ్‌ ఆన్‌లైన్‌ అప్లికేషన్‌ ప్రాసెసింగ్‌ సిస్టమ్‌ (జేఓఏపీఎస్‌)ను అందుబాటులోకి తెస్తారు. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో తమ లాగిన్‌ ఐడీ క్రియేట్‌ చేసుకుని.. ఆన్‌లైన్‌ దరఖాస్తును పూర్తి చేయాలి. ఈ దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌ల ప్రాథమ్యాలను పేర్కొనాలి. ఆ తర్వాత అభ్యర్థులు పొందిన స్కోర్, వారు పేర్కొన్న ప్రాథమ్యాలను బేరీజు వేసి.. ఆన్‌లైన్‌లోనే సీట్‌ అలాట్‌మెంట్‌ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం నాలుగు రౌండ్లలో ఉంటుంది.

విజయం సాధించాలంటే

ఐఐటీ–జామ్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు తమ అకడమిక్‌ సబ్జెక్ట్‌లకు సంబంధించి బ్యాచిలర్‌ డిగ్రీ స్థాయిలోని పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయాలి.

బయోటెక్నాలజీ

ఈ పేపర్‌లో బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ను ప్రిపేరవ్వాల్సి ఉంటుంది. బయాలజీ విభాగానికి సంబంధించి పదో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు అకడమిక్స్‌ను అభ్యసనం చేయాలి. జనరల్‌ బయాలజీ, బయోకెమిస్ట్రీ అండ్‌ ఫిజియాలజీ, బేసిక్‌ బయోటెక్నాలజీ, మాలిక్యులర్‌ బయాలజీ, సెల్‌ బయాలజీ, మైక్రో బయాలజీ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. కెమిస్ట్రీకి సంబంధించి పదోతరగతి,ఇంటర్, డిగ్రీ పాఠ్యాంశాలను చదవాలి. మ్యాథ్స్, ఫిజిక్స్‌లను ఇంటర్‌ స్థాయిలో చదివితే సరిపోతుంది.

కెమిస్ట్రీ

ఫిజికల్‌ కెమిస్ట్రీ: బేసిక్‌ మ్యాథమెటికల్‌ కాన్సెప్టులు, అటామిక్‌ అండ్‌ మాలిక్యులర్‌ స్ట్రక్చర్, థియరీ ఆఫ్‌ గ్యాసెస్, సాలిడ్‌ స్టేట్, కెమికల్‌ థర్మోడైనమిక్స్, కెమికల్‌ అండ్‌ ఫేజ్‌ ఈక్విలిబ్రియా, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్‌ కైనటిక్స్, అబ్సార్ప్షన్, స్పెక్ట్రోమెట్రీ; ఆర్గానిక్‌ కెమిస్ట్రీ అండ్‌ స్పెక్ట్రోమెట్రి బేసిక్‌ కాన్సెప్టులు, ఆర్గానిక్‌ రియాక్షన్‌ మెకానిజం, సింథటిక్‌ అప్లికేషన్స్, క్వాలిటేటివ్‌ ఆర్గానిక్‌ అనాలసిస్, ఆరోమాటిక్‌ అండ్‌ హెటిరోసైక్లిక్‌ కెమిస్ట్రీ. ఇనార్గానిక్‌ కెమిస్ట్రీలో పిరియాడిక్‌ టేబుల్, కెమికల్‌ బాండింగ్, షేప్స్‌ ఆఫ్‌ కాంపౌండ్స్, మెయిన్‌ గ్రూప్‌ ఎలిమెంట్స్, ట్రాన్సిషన్‌ మెటల్స్, బయో ఇనార్గానిక్‌ కెమిస్ట్రీ, అనలిటికల్‌ కెమిస్ట్రీ.

ఎకనామిక్స్‌

మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌ ఫర్‌ ఎకనామిక్స్, ఇండియన్‌ ఎకానమీ, మ్యాథమెటిక్స్‌ ఫర్‌ ఎకనామిక్స్‌లను అధ్యయనం చేయాలి.

జియాలజీ

ప్లానెట్‌ ఎర్త్, జియో మార్ఫాలజీ, స్ట్రక్చరల్‌ జియాలజీ, పాలియోంటాలజీ, స్ట్రాటిగ్రఫీ, మినరాలజీ, పెట్రోలజీ, ఎకనామిక్‌ జియాలజీ, అప్లయిడ్‌ జియాలజీలపై దృష్టి పెట్టాలి.

మ్యాథమెటిక్స్‌

సీక్వెన్సెస్‌ అండ్‌ సిరీస్‌ ఆఫ్‌ రియల్‌ నంబర్స్, ఫంక్షన్స్‌ ఆఫ్‌ వన్‌/టూ/త్రీ రియల్‌ వేరియబుల్, ఇంటిగ్రల్‌ క్యాల్కులస్, డిఫరెన్షియల్‌ ఈక్వేషన్స్, వెక్టార్‌ క్యాల్కులస్, గ్రూప్‌ థియరీ, లీనియర్‌ ఆల్జీబ్రా, రియల్‌ అనాలసిస్‌ పాఠ్యాంశాలను ప్రిపేరవ్వాలి.

మ్యాథమెటికల్‌ స్టాటిస్టిక్స్‌

మ్యాథ్స్‌కు 40 శాతం, స్టాటిస్టిక్స్‌కు 60 శాతం వెయిటేజీ ఉండే ఈ పేపర్‌లో.. మ్యాథ్స్‌కు సంబంధించి సీక్వెన్సెస్‌ అండ్‌ సిరీస్, డిఫరెన్షియల్‌ క్యాల్కులస్, ఇంటిగ్రల్‌ క్యాల్కులస్, మాట్రిసెస్‌ చాప్టర్లను అధ్యయనం చేయాలి. స్టాటిస్టిక్స్‌లో ప్రాబబిలిటీ, ర్యాండమ్‌ వేరియబుల్స్, స్టాండర్డ్‌ డిస్ట్రిబ్యూషన్, జాయింట్‌ డిస్ట్రిబ్యూషన్, సాంప్లింగ్‌ డిస్ట్రిబ్యూషన్, లిమిట్‌ థీరమ్స్, ఎస్టిమేషన్, టెస్టింగ్‌ ఆఫ్‌ హైపోథీసిస్‌లను అధ్యయనం చేయాలి.

ఫిజిక్స్‌

మ్యాథమెటికల్‌ మెథడ్స్, మెకానిక్స్‌ అండ్‌ జనరల్‌ ప్రాపర్టీస్‌ ఆఫ్‌ మేటర్, ఆసిలేషన్స్, వేవ్స్‌ అండ్‌ ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ అండ్‌ మ్యాగ్నటిజం, కైనటిక్‌ థియరీ, థర్మోడైనమిక్స్, మోడ్రన్‌ ఫిజిక్స్, సాలిడ్‌ స్టేట్‌ ఫిజిక్స్, డివైజెస్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ పాఠ్యాంశాలను అభ్యసనం చేయాలి.

అకడమిక్‌ పుస్తకాలు ఆలంబనగా

అభ్యర్థులు బ్యాచిలర్‌ స్థాయి అకడమిక్స్‌ను ఔపోసన పట్టడం మేలు చేస్తుంది. అదే విధంగా జామ్‌ పాత ప్రశ్న పత్రాలు, గేట్‌ సైన్స్‌ సబ్జెక్ట్‌లకు సంబంధించి పాత ప్రశ్న పత్రాలు ప్రాక్టీస్‌ చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది. కాన్సెప్ట్స్, అప్లికేషన్‌ అప్రోచ్‌లపై పట్టు సాధించాలి. అప్పుడే పరీక్ష హాల్లో ప్రశ్నను ఏ విధంగా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. ముఖ్యంగా మల్టిపుల్‌ సెలక్ట్‌ కొశ్చన్స్‌ విషయంలో ఈ దృక్పథం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
- ఆన్‌లైన్‌ దరఖాస్తు తేదీలు: సెప్టెంబర్‌ 7–అక్టోబర్‌ 11,2022
- జామ్‌ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 12, 2023
- ఫలితాల వెల్లడి: మార్చి 22, 2023
- ఆన్‌లైన్‌ అడ్మిషన్‌ అప్లికేషన్‌ తేదీలు: ఏప్రిల్‌ 11– ఏప్రిల్‌ 25, 2023
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
- వెబ్‌సైట్‌: https://jam.iitg.ac.in/index.html

క్లుప్తంగా

ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి : వైద్య విద్య పీజీ, డిప్లొమా కోర్సుల్లో యాజమాన్య కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను మంగళవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. మెడికల్ విభాగంలో 4,199 మంది, డెంటల్ విభాగంలో 333 మందితో మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ జాబితాపై అభ్యంతరాలను తెలియజేసేందుకు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల వరకు గడువు ఇచ్చింది. అభ్యంతరాలు, వాటిని బలపరిచే ధ్రువీకరణపత్రాలను appgadmissions2021@gmail.comకు నిర్దేశిత గడువులోపు విద్యార్థులు పంపాలి.

సమాచార కమిషనర్ల దరఖాస్తుల పరిశీలన

సమావేశమైన సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ పదవుల భర్తీకి దాఖలైన దరఖాస్తులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మంగళవారం పరిశీలించింది. అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సెలక్షన్ కమిటీ చైర్‌పర్సన్‌గా సీఎం వైఎస్ జగన్, సభ్యులుగా మంత్రి జోగి రమేష్, జీఏడీ స్పెషల్ సీఎస్ ప్రవీణ్‌కుమార్, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రయోజనాలే ఎల్లో మీడియా ధ్యేయం

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి విమర్శ



సాక్షి, అమరావతి: ప్రజల పక్షాన ఉండాల్సిన ప్రసార మాధ్యమాలు ప్రతిపక్ష నేత ప్రయోజనమే ధ్యేయం అన్నట్లుగా వ్యవహరించటం బాధ కలిగిస్తోందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. చంద్రబాబు అసమర్థతను కప్పిపుచ్చేందుకు ఆయన అనుకూల మీడియా అబద్ధాలు, అర్ధసత్యాలు ప్రచారం చేసే పనిని నెత్తినఎత్తుకుని తామే ప్రతిపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నిరంతర జాగురూకతతో ఉండే రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా, అమరావతి నిర్మాణంపైనా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యంపైనా సీఎం వైఎస్ జగన్ సంపూర్ణ గణాంకాలతో వివరణలు ఇచ్చారన్నారు. ఆ వెంటనే టీడీపీ అనుకూల పత్రికలు రంగంలోకి దిగి సీఎం జగన్ మాటలు అబద్ధాలన్నట్లు అడ్డగోలు వాదనలు, అంకెల గారడీలతో ప్రజలను నమ్మించడానికి కథనాలు వండి వార్చాయని తెలిపారు.

అమెరికా వెళ్లేందుకు నారాయణను అనుమతించండి

ఇమ్మిగ్రేషన్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: శస్త్రచికిత్స కోసం అమెరికా వెళ్లేందుకు మాజీమంత్రి పొంగూరు నారాయణను అనుమతించాలని హైకోర్టు మంగళవారం బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ ఏడాది డిసెంబర్ 20లోపు దేశానికి తిరిగి రావాలని నారాయణను ఆదేశించింది. ఈ షరతుతోనే అమెరికా వెళ్లేందుకు అనుమతినిస్తున్నట్లు తెలిపింది. విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. తన పేరు మీద జారీచేసిన లుక్‌ఔట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) వల్ల తన అమెరికా ప్రయాణం సాధ్యం కాదని, అందువల్ల దీన్ని రద్దుచేయాలని కోరుతూ నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ రఘునందన్‌రావు విచారించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి: ఏపీ జేఏసీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని ఏపీ జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం విజయవాడలోని జేఏసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్టు సిబ్బందిని క్రమబద్ధీకరణ చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేయాలన్నారు.

విపత్తుల నిర్వహణపై ఐఏఎస్‌లకు శిక్షణ

సాక్షి, అమరావతి: ఏపీ క్యాడర్ 2021 బ్యాచ్‌కు చెందిన 9 మంది ఐఏఎస్ అధికారులకు విపత్తుల నిర్వహణపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో రాబోయే 10 సంవత్సరాల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించారు.

హర్షపాతం



సాధారణం కంటే అధికం..

- ఈ సీజన్‌లో సమృద్ధిగా నైరుతి రుతుపవనాల ప్రభావం
- 20 జిల్లాల్లో సాధారణం.. ఐదు జిల్లాల్లో అధిక వర్షపాతం


సాక్షి, విశాఖపట్నం : కరువు ఛాయల్లేకుండా ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సమృద్ధిగా వర్షాలు కురిపించాయి. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఇవి ప్రభావం చూపుతాయి. ఖరీఫ్ పంటలకు ఈ రుతుపవనాలే కీలకం. అందుకే నైరుతి రుతుపవనాల ప్రభావం ఎలా ఉంటుందోనని ఇటు రైతులు, అటు ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఎంతో ఆసక్తి చూపుతాయి. అయితే, ఈ ఏడాది ఆరంభం నుంచి దాదాపు ఇప్పటివరకు వానల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడలేదు. తరచూ తేలికపాటి నుంచి మోస్తరుగాను, అప్పుడప్పుడు భారీ వర్షాలు కురిశాయి. ఇలా వరుసగా నాలుగేళ్ల నుంచి ఖరీఫ్ సీజనులో వరుణుడు రాష్ట్రంలో విస్తారంగా వానలు కురిపిస్తూనే ఉన్నాడు. ఇందుకు అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు ఎంతో దోహదపడ్డాయి. రుతుపవనాల సీజను మొదలైన జూన్ నుంచి ఇప్పటివరకు బంగాళాఖాతంలో ఏడు అల్పపీడనాలు, రెండు వాయుగుండాలు ఏర్పడ్డాయి. ఫలితంగా రాష్ట్రంలో పలుచోట్ల సమృద్ధిగా వర్షాలు కురిశాయి.

కొద్దిరోజుల్లో 'నైరుతి' సీజన్ ముగింపు

ఇక మరికొద్ది రోజుల్లోనే నైరుతి రుతుపవనాల సీజను ముగియనుంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (ఏపీఎస్‌డీపీఎస్) గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలోని 26 జిల్లాలకుగాను 20 జిల్లాల్లో సాధారణం, ఐదు జిల్లాల్లో అధిక, ఒక జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. విజయనగరం, కాకినాడ, బాపట్ల, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో అధిక వర్షపాతం, శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధిక వర్షపాతం రికార్డయింది. అరకొర వర్షాలతో కరువు పరిస్థితులేర్పడే అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ ఏడాది సాధారణానికి మించి అధిక వర్షం కురవడం విశేషం.

మరోవైపు.. నైరుతి రుతుపవనాల సీజనులో జూన్ ఒకటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 514.7 మి.మీల వర్షపాతం కురవాల్సి ఉండగా 544.3 మి.మీలు కురిసింది. ఇది సాధారణం కంటే దాదాపు 6.0 శాతం అధికమన్నమాట. ఒక్క సెప్టెంబర్‌లోనే 95 మి.మీలకు గాను 115.9 మి.మీలు (22 శాతం అధికంగా) వర్షపాతం నమోదైంది. నిజానికి.. సాధారణంకంటే 20 శాతానికి పైగా తక్కువ వర్షం కురిస్తే లోటు వర్షపాతంగా పరిగణిస్తారు. ఇలా ఈ నైరుతి రుతుపవనాల సీజనులో రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లోటు వర్షపాతం రికార్డు కాలేదు. ఈ నేపథ్యంలో కరువు ఛాయలు ఏర్పడకుండా ఖరీఫ్ సీజను ముగుస్తుండడం, అవసరమైనప్పుడల్లా వర్షాలు కురుస్తూ పంటలకు ఢోకా లేకపోవడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు.

పక్కాగా చీమల లెక్క!



భూమ్మీద ఇసుక రేణువులు ఎన్ని ఉన్నాయని ఎవరైనా అడిగితే మీరేం చెబుతారు? ఇదేం పిచ్చి ప్రశ్న.. వాటినెలా లెక్కేస్తాం? అని ఎదురు ప్రశ్నిస్తారు. మరి భూమ్మీద ఎన్ని చీమలున్నాయని అడిగితే మీ సమాధానం? మళ్లీ ఇంకో పిచ్చి ప్రశ్న అని తీసిపారేయవద్దు. ఎందుకంటే... జర్మనీలోని జులియస్ మాక్సిమిలియన్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు చీమల సంఖ్యను మాత్రమే కాదు.. వాటన్నింటినీ ఒక దగ్గర చేరిస్తే ఎంత బరువు ఉంటాయో కూడా లెక్కలేసి తేల్చేశారు మరి!! కొంచెం విచిత్రంగా అనిపించినా ఇది నిజమే. భూమ్మీద మొత్తం చీమల సంఖ్యపై ఇప్పటివరకూ సరైన అంచనా ఏదీ లేకపోవడంతో జర్మనీ శాస్త్రవేత్తలు లెక్కలేసేందుకు నడుం బిగించారు. అంతేకాదు.. చీమల సంఖ్య అడవుల్లో ఎంత ఉంటుంది? ఎడారుల్లోనైతే ఎంత? తేమ ఉన్నచోట?... నగరాల్లో? ఇలా రకరకాల జీవావరణ వ్యవస్థల్లో చీమల ఉనికి ఎంత మేరకు ఉందో తెలుసుకునేందుకు వీరు అందుబాటులో ఉన్న పరిశోధన వ్యాసాలన్నింటినీ జల్లెడ పట్టారు. ఈ అంశంపై ఇప్పటివరకూ ప్రచురితమైన సుమారు 489 అధ్యయనాల సారాంశాన్ని వడపోసి "ఈ భూమ్మీద మొత్తం 20 క్వాడ్రిలియన్ల చీమలున్నాయి" అని తేల్చారు! అంటే 20 పక్కన 15 సున్నాలు పెడితే వచ్చే సంఖ్య అన్నమాట. దీన్నే మరోలా చెప్పాలంటే విశ్వం మొత్తమ్మీద ఉన్న నక్షత్రాలకు 2 వేల రెట్ల ఎక్కువ సంఖ్యలో చీమలున్నాయట!

బరువు అతిభారీగానే..

గండుచీమ, నల్లచీమ, ఎర్ర చీమలన్నింటి సంఖ్యపై ఓ స్పష్టత సాధించిన జర్మనీ శాస్త్రవేత్తలు.. ఆ తరువాత వాటి మొత్తం బరువును అంచనా వేశారు. వేర్వేరు ప్రాంతాలు, జీవావరణ వ్యవస్థల్లోని చీమల రకాలను.. వాటి సగటు బరువులను పరిగణనలోకి తీసుకుని చూస్తే.. వాటి మొత్తం బరువు కోటీ ఇరవై లక్షల టన్నులని తేలింది! భూమ్మీద ఉన్న అన్ని పక్షులు, మానవులను మినహాయించి మిగిలిన క్షీరదాల మొత్తం బరువు కంటే చీమల బరువే ఎక్కువ కావడం గమనార్హం.

అక్కడ ఒక్క చీమా లేదు!

ఏ ప్రాంతంలో ఎక్కువ చీమలు ఉన్నాయి? ఎక్కడ తక్కువ ఉన్నాయనేదీ పరిశీలించారు. భూమధ్య రేఖకు 10 డిగ్రీలు పైన, కింద ఉండే ఉష్ణమండల ప్రాంతాల్లో చీమలు పుట్టలు పుట్టలుగా ఉంటే.. నగర ప్రాంతాల్లో అతితక్కువగా ఉన్నాయట. ధ్రువ ప్రాంతాల్లో ఒక్క చీమ కూడా లేదట.

జీవిత ఖైదీల విడుదల అధికారం గవర్నర్‌కుంది

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల ప్రభుత్వ విధాన నిర్ణయం

- అర్హతలున్న వారినే విడుదల చేస్తున్నాం
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- తదుపరి విచారణ ఈ నెల 26కి వాయిదా



సాక్షి, అమరావతి : రాజ్యాంగం ప్రకారం జీవిత ఖైదీలను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేసే అధికారం గవర్నర్‌కు ఉందని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైకోర్టుకు నివేదించింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని ప్రభుత్వ న్యాయవాది (హోం) వేలూరి మహేశ్వరరెడ్డి వివరించారు. గవర్నర్ తన విచక్షణాధికారాలను ఉపయోగిస్తున్నప్పుడు జీవిత ఖైదు పడ్డ వ్యక్తి 14 ఏళ్ల శిక్ష అనుభవించి తీరాలన్న నిబంధనను పాటించాల్సిన అవసరం లేదన్నారు. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు కూడా చెప్పిందన్నారు. సత్ప్రవర్తనతో పాటు విడుదలకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు కలిగి ఉన్న ఖైదీలను మాత్రమే విడుదల చేస్తున్నామని తెలిపారు. ఇదే రీతిలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 175 మందిని విడుదల చేశామని చెప్పారు. ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించేందుకు ఉద్దేశించిన విధాన నిర్ణయాన్ని, 14 ఏళ్ల శిక్ష పూర్తి కాక ముందే 8 మంది ఖైదీల విడుదలకు సంబంధించి గవర్నర్ ముందుంచిన ఫైల్‌ను కోర్టు ముందుంచామని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఖైదీల విడుదలలో ప్రభుత్వానికి అధికారం లేదనడంలేదని, అయితే జీవితఖైదు పడ్డ వారి విడుదల విషయంలో ప్రభుత్వానికి అపరిమిత అధికారాలున్నాయా? ప్రభుత్వం అనుకుంటే జీవిత ఖైదు పడ్డ ఆరు నెలల్లోనే విడుదల చేయవచ్చా వంటి ప్రశ్నలకు సమాధానం కావాలంది. తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.తన భర్త పార్థమరెడ్డి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న 8 మందిని శిక్షాకాలం పూర్తి కాక ముందే విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మెట్టు గ్రామానికి చెందిన ముడి నవనీతమ్మ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. జీవిత ఖైదు పడ్డ ఖైదీ 14 సంవత్సరాల జైలు జీవితాన్ని అనుభవిస్తేనే క్షమాభిక్షకు అర్హుడని తెలిపారు. ప్రస్తుత కేసులో విడుదలైన వారు క్షమాభిక్షకు అర్హులు కాదన్నారు.

పరిశ్రమల ఆటోమేషన్‌కు 'కల్పతరువు'

విశాఖలో ప్రారంభమైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ

- ఆర్ఐఎన్ఎల్ సమస్యల పరిష్కారానికి ఓపెన్ ఛాలెంజ్
- ఛాలెంజ్‌లో పాల్గొనడానికి స్టార్టప్‌లకు ఆహ్వానం
- ఈ పరిష్కారాలు స్టీల్ పరిశ్రమకు ఉపయోగకరం: ఆర్ఐఎన్ఎల్ సీఎండీ
- అన్ని పీఎస్‌యూలూ ఉపయోగించుకోవాలి: ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్
- సీవోఈతో తయారీ రంగంలో 25 శాతం వృద్ధి: ఏయూ వీసీ



'కల్పతరువు' పేరుతో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సంయుక్తంగా నాలుగోతరం ఇండస్ట్రీ-4 టెక్నాలజీ అభివృద్ధికి 'కల్పతరువు' పేరుతో విశాఖపట్నంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కార్యక్రమాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. అనేక పారిశ్రామిక సంస్థలకు.. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థల ఆటోమేషన్‌కు 'కల్పతరువు' అన్ని విధాలా ఉపయోగపడనుంది. మంగళవారం ఆర్ఐఎన్ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ సీఎండీ అతుల్ భట్, ఢిల్లీ నుంచి ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ కలిసి కల్పతరువు ఓపెన్ ఛాలెంజ్ ప్రోగ్రాం - 1 (ఓసీపీ-1)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన ఆరు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ ఛాలెంజ్‌ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారం అందించే స్టార్టప్‌లు అంతర్జాతీయంగా ఉక్కు పరిశ్రమ ఎదుర్కొంటున్న కీలక సమస్యలకు పరిష్కారాన్ని కూడా అందించే అవకాశం లభిస్తుందన్నారు. విశాఖపట్నంలో ఉన్న ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్‌టీపీసీ, బీహెచ్ఈఎల్-హెచ్‌పీవీపీ, హెచ్ఎస్ఎల్, హెచ్‌పీసీఎల్, వీపీటీ, బీఏఆర్సీ వంటి సంస్థలు ఈ సీవోఈని వినియోగించుకోవాలని కోరారు. ఈ సీవోఈతో రాష్ట్రంలో స్టార్టప్‌లు పెరుగుతాయని, పారిశ్రామిక కార్యక్రమాలు వేగం పుంజుకుంటాయని తెలిపారు. అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌టీపీఐకి దేశవ్యాప్తంగా 20 సీవోఈలు ఉండగా కల్పతరువు 21వదని, కాని ఇది అన్ని సీవోఈలకు తల్లిగా అవతరించనుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, ఎనలటిక్స్ వంటి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించుకొని స్మార్ట్ ఆటోమేషన్‌ను పెంచుకోవచ్చని చెప్పారు. ఆర్ఐఎన్ఎల్ లానే ఇతర పీఎస్‌యూలు కూడా వారి సమస్యల పరిష్కారానికి కల్పతరువును వినియోగించుకోవాలని కోరారు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కల్పతరువు రాకతో 2025 నాటికి రాష్ట్ర తయారీ రంగంలో 25 శాతం వృద్ధి నమోదవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఓసీపీ-1 కార్యక్రమంలో పాల్గొనే స్టార్టప్‌లు అక్టోబర్ 19 వరకు www.kalpataru.stpi.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని ఎస్‌టీపీఐ విశాఖ అడిషనల్ డైరెక్టర్ సురేష్ బాతా తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన 1,032 మంది పాల్గొన్నారు.

తెలంగాణ

'బుల్లెట్టు బండి'కి లంచాల పంక్చర్

ఏసీబీ వలలో 'బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తపా.. ఫేమ్ అశోక్



హైదరాబాద్: 'బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తపా..' అంటూ పెళ్లి బారాత్‌లో నృత్యం చేసి ప్రముఖులైన వధూవరులు గుర్తుండే ఉంటారు. ఇప్పుడా పెళ్లికొడుకు ఏసీబీకి పట్టుబడి వార్తల్లో మరోసారి నిలిచాడు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆకుల అశోక్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అల్మాస్‌గూడకు చెందిన దేవేందర్‌రెడ్డికి బడంగ్‌పేటలో రెండు ప్లాట్లు ఉండగా.. వాటి నిర్మాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అందుకోసం టౌన్‌ప్లానింగ్ అధికారి అశోక్ ప్లాట్‌కు రూ.30 వేల చొప్పున రూ.60 వేలు డిమాండ్ చేశాడు. వారం క్రితం దేవేందర్‌రెడ్డి నేరుగా అశోక్‌కు రూ.20 వేలు అందజేశాడు. మరో రూ.30 వేలు మంగళవారం ఇచ్చే ప్రయత్నం చేయగా.. ప్రైవేట్ డాక్యుమెంటరీ ప్లానర్ ఎర్రబట్టు శ్రీనివాస్‌రాజుకు ఇవ్వండని.. అశోక్ సూచించాడు. దేవేందర్‌రెడ్డి రూ.30 వేలను శ్రీనివాస్‌రాజుకు ముట్టజెబుతుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అశోక్‌ను, శ్రీనివాసరాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ కార్యాలయంతో పాటు నాగోల్‌లోని అశోక్ ఇంటిపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

శ్రీశైలానికి వరద

సాగర్ 16 గేట్లు ఎత్తి నీటివిడుదల



సాగర్ నుంచి నీరు విడుదల అవుతున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 884.80 అడుగులకు చేరుకుంది. జూరాల, సుంకేసుల నుంచి 2,28,024 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. ఎనిమిది గేట్లను పదడుగులు ఎత్తి 2,23,864 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. సోమవారం నుంచి మంగళవారం వరకు కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 65,183 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఎనిమిదివేల క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 214.3637 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జున సాగర్ జలాశయం 16 గేట్లు ఎత్తి, విద్యుదుత్పాదనతో కలిపి దిగువకు 2,72,568 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరదకాల్వలకు 13,985 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం సాగర్‌లో 589.60 అడుగుల మట్టంలో 310.8498 టీఎంసీల నీరు ఉంది.

సచివాలయాలను డీఎల్‌డీఓలు పర్యవేక్షించాలి

- ప్రతిరోజూ 'స్పందన' నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించాలి
- గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న అజయ్‌జైన్. వేదికపై ధనుంజయ్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాలు మరింత మెరుగ్గా పనిచేసేలా డీఎల్‌డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. విజయవాడలో సంబంధిత అధికారులకు మంగళవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామ, వార్డు సచివాలయాలన్నింటిలో ప్రతిరోజూ స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. శాఖ డైరెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ.. అత్యంత ప్రాధాన్యత గల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించిందని.. నిబంధనలకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపించి పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. సీఎం సలహాదారు (గ్రామ, వార్డు సచివాలయ శాఖ) ఆర్. ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హత ఉండి కూడా ఏ కారణంతోనైనా ప్రభుత్వ పథకాలు పొందని పేద వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి సైతం న్యాయం చేయాలనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనన్నారు. దాదాపు 25 ఏళ్లుగా పదోన్నతుల్లేక కేవలం ఎంపీడీఓలుగానే ఉండిపోయిన వారికి, అధికారులకు ముఖ్యమంత్రి చొరవతో డీఎల్‌డీఓలుగా పదోన్నతి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ జాయింట్ డైరెక్టర్ వికాస్ మర్మాట్, అడిషనల్ కమిషనర్లు కైలాష్ గిరీష్, సోమనారాయణ, రామ్‌నాథ్‌రెడ్డి, గీత పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.